www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

9న సిట్ ముందుకు ప్రభాకర్ రావు
నేడు అమెరికా నుంచి పయనం



హైదరాబాద్. జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు అత్యవసర ట్రాన్సిట్ వారెంట్‌ను అమెరికాలోని భారత ఎంబసీ జారీ చేసింది. పాస్‌పోర్ట్‌ను రద్దు చేయడంతో సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన అత్యవసర ట్రాన్సిట్ వారెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. 7వ తేదీన భారత్‌కు బయలుదేరి ఈ నెల 8న అర్ధరాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ప్రభాకర్‌రావు 9న ఉదయం సిట్ ఎదుట హాజరుకానున్నారు.

శనివారం | 7-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 69
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి పూర్తి; నక్షత్రం: చిత్ర ఉ.9.40 తదుపరి స్వాతి, వర్జ్యం: మ.3.58-5.46; దుర్ముహూర్తం: ఉ.5.43-7.27; అమృతఘడియలు: రా.2.47-4.35; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.44
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అది కేసీఆర్ నిర్ణయమే



కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన ఎంపీ ఈటల రాజేందర్

- ఆయనతో పాటు నాటి మంత్రి వర్గమూ కాళేశ్వరం బ్యారేజీలు కట్టాలని తీర్మానించింది
- తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్ర అభ్యంతరాలు తెలిపింది
- అక్కడ నీటి లభ్యత లేదంటూ సీడబ్ల్యూసీ లేఖ రాసింది
- తాగు, సాగు నీటి అవసరాల రీత్యానే ప్రాజెక్టు రీడిజైన్
- కాళేశ్వరం తొలి అంచనా వ్యయం రూ.60 వేల కోట్లే..
- ఆ తర్వాత పలు మార్పులతో రూ.80 వేల కోట్లకు: ఈటల
- కాళేశ్వరం కమిషన్ ప్రశ్నలకు మాజీ మంత్రి జవాబులు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీలు నిర్మించాలన్న నిర్ణయం అప్పటి సీఎం కేసీఆర్, మంత్రివర్గం కలిసి తీసుకున్నదేనని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా శుక్రవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఎదుట ఆయన హాజరయ్యారు. 18నిమిషాల పాటు కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఆయన జవాబులు ఇచ్చారు. "రూ.38వేల కోట్లతో నిర్మించ తల పెట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మిస్తే ముంపు సమస్యతోపాటు అభయారణ్యానికి ఇబ్బందులు ఏర్పడతాయంటూ మహారాష్ట్ర అభ్యంతరాలు తెలిపింది. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అప్పట్లో

మిగతా 12వ పేజీలో...





యాదాద్రి భువనగిరి జిల్లా తిరుమలాపురంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం; ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్
దయ్యాల రాజ్య సమితితో ప్రమాదం

అప్పట్లో మాజీ ప్రధానమంత్రి (పీవీ నరసింహారావు)కి సెషన్స్ కోర్టు నోటీసు ఇస్తే కోర్టు ఎదుట ఆయన హాజరయ్యారు. నువ్వు అంతకంటే గొప్పవాడివా? గతంలో నన్ను జైలులో పెడితే తొడగొట్టి పడగొట్టా. ఆ కుర్చీలో కూర్చున్నా. పట్టుబట్టి నా లక్ష్యం నెరవేర్చుకున్నా.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కొరివి దెయ్యాలు వచ్చాయని జనానికి చెప్పి తరిమికొట్టించాలి
- ఒక్క నోటీసుకే కేసీఆర్ ఆగమాగం.. నన్ను జైల్లో పెడితే తొడగొట్టి పడగొట్టా
- మూసీ పునరుజ్జీవం చేసి తీరుతాం.. నన్ను పడగొట్టాలని చూస్తున్నారు
- ప్రజలు పదేళ్లు అధికారం ఇవ్వాలి.. టీడీపీ తరహాలో వైటీడీపీ పాలకవర్గం
- యాదగిరిగుట్టలో యూనివర్సిటీ, గొప్ప విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తాం
- స్వామివారికి అపచారం చేస్తే మూల్యం చెల్లించక తప్పదు: సీఎం రేవంత్
- యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో రూ.1051 కోట్ల పనులకు శ్రీకారం

యాదాద్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి కాదని, దయ్యాల రాజ్య సమితి (డీఆర్ఎస్) అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక నుంచి ఆ పార్టీ నాయకులు ఎక్కడికి వెళ్లినా.. కొరివి దయ్యాలు వచ్చాయని జనానికి చెప్పి తరిమికొట్టించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆ దయ్యాలతో చాలా ప్రమాదమని, తరిమికొట్టేందుకు ప్రజలంతా తనకు అండగా నిలవాలని అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం తిరుమలాపురంలో చేపట్టనున్న తొమ్మిది శాఖలకు చెందిన రూ.1,051.45 కోట్ల అభివృద్ధి

మిగతా 13వ పేజీలో...

నెలకు రెండుసార్లు క్యాబినెట్ భేటీ
- మొదటి, మూడో శనివారం..
- ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయికి చేరేలా చూసేందుకే నిర్ణయం
- ఏర్పాట్లపై అధికారులకు ఆదేశం

13

ఈ నెల్లోనే విస్తరణ
- పీసీసీ కొత్త కార్యవర్గం కూడా..
- ఎమ్మెల్యేలు పనితీరుపై స్వీయసమీక్ష చేసుకోవాలి: మహేశ్ గౌడ్
- కేసీఆర్‌ను కాపాడేందుకు ఈటల వకాల్తా పుచ్చుకున్నారని ధ్వజం

12

సీఎంతో మీనాక్షి భేటీ
- మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కమిటీ నియామకంపై ప్రధానంగా చర్చ

13

ఆర్బీఐ డబుల్ బొనాంజా
- రెపో, సీఆర్ఆర్‌లో భారీ కోత
- ఇక రుణాలు మరింత చౌక!
- తగ్గనున్న ఈఎంఐల భారం
- వడ్డీరేట్లు తగ్గించిన పీఎన్‌బీ, బీవోఐ

11

మాపైనే దర్యాప్తునకు ఆదేశిస్తారా?
- మమ్మల్ని, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు
- అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై అమెరికా ఆగ్రహం
- ఇజ్రాయెల్ యుద్ధ నేరాలపై దర్యాప్తునకు ఆదేశించిన నలుగురు జడ్జిలపై ఆంక్షలు
- అమెరికాలో వారికి ఆస్తులుంటే స్తంభింపజేస్తామని హెచ్చరిక

11

STARLINK

స్టార్‌లింక్‌కు గ్రీన్‌సిగ్నల్
భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ఆరంభించేందుకు లైసెన్స్ మంజూరు


11

ట్రంప్ నిర్ణయానికి కోర్టు బ్రేక్
హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశాలపై ఆంక్షలు తాత్కాలికంగా నిలిపివేత

11

రూ. 5 పార్లే-జీ బిస్కెట్ ప్యాకెట్ గాజాలో రూ.2,400
- తీవ్ర ఆహార కొరతతో చుక్కలను తాకుతున్న నిత్యావసరాల ధరలు
- నూనె, చక్కెర కిలో 4 వేలకు పైనే..

2



కశ్మీర్‌లో మోదీ ప్రారంభించిన చినాబ్ వంతెనపై వందేభారత్ పరుగులు

చినాబ్ నదిపై ఇంజనీరింగ్ అద్భుతం



- ప్రపంచంలోనే ఎత్తయిన రైలు బ్రిడ్జిని ప్రారంభించిన మోదీ
- రూ.1486 కోట్లతో.. ఎనిమిదేళ్లలో నిర్మాణం
- త్రివర్ణ పతాకంతో వంతెనపై ప్రధాని నడక
- దేశంలోనే తొలి కేబుల్ రైలు వంతెన కూడా ప్రారంభం
- రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమైన కశ్మీర్
- ఎవరెన్ని కుట్రలు చేసినా కశ్మీర్‌లో అభివృద్ధిని ఆపలేరు
- పొరుగు దేశం మానవత్వానికి వ్యతిరేకం: మోదీ
- బ్రిటిషర్లు చేయలేని పనిని మోదీ సర్కారు పూర్తి చేసింది
- నన్ను రాష్ట్ర సీఎంగా ప్రమోట్ చేస్తారని ఆశిస్తున్నా: ఒమర్

2

డీఎస్ఆర్ యాప్ మాకొద్దు
- కొత్త మార్గదర్శకాలతో మాకు మరిన్ని ఇబ్బందులు
- యాప్‌ను రద్దు చేయకుంటే మూకుమ్మడి సెలవులు
- ప్రభుత్వానికి పంచాయతీ కార్యదర్శుల అల్టిమేటం
- 20రోజులుగా యాప్‌లో వివరాల నమోదుకు దూరం



హైదరాబాద్, పెద్దపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ రూపొందించిన రోజువారీ పారిశుధ్య నివేదిక (డీఎస్ఆర్) యాప్ రద్దు కోసం పంచాయతీ కార్యదర్శులు పోరాట బాట పట్టారు. గత 20 రోజులుగా హాజరు, ప్రభుత్వం సూచించిన పథకాలు, ఇతర అంశాలకు సంబంధించిన వివరాలు, ఫొటోలను యాప్‌లో నమోదు చేయడం లేదు. దీంతో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ ఈ రోజులను సీఎల్‌గా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ తరుణంలో ఈ యాప్‌ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లేకుంటే మూకుమ్మడిగా సెలవులు పెడతామని కార్యదర్శులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9 వేల మంది పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. వీరు ఆందోళన బాట పట్టడంతో గ్రామాల్లో నిత్యం చేపట్టే పనులపై ప్రభావం పడుతోంది. తెలంగాణ పంచాయతీ సెక్రటరీల అసోసియేషన్, తెలంగాణ పంచాయతీ సెక్రటరీ సెంట్రల్ ఫోరం, తెలంగాణ పంచాయతీ సెక్రటరీల ఫోరం.. ఈ మూడు సంఘాలు జేఏసీగా ఏర్పడి

మిగతా 3వ పేజీలో...

భాయీ భాయీ.. బాహాబాహీ
ట్రంప్-మస్క్ స్నేహబంధానికి బీటలు





- మస్క్‌కు ఇచ్చిన కాంట్రాక్టులను రద్దు చేస్తానన్న ట్రంప్
- నాసాకు స్పేస్‌ఎక్స్ సేవలు నిలిపేస్తామని మస్క్ ప్రకటన
- బాలలపై లైంగిక వేధింపుల ఆరోపణలున్న వ్యక్తితో ట్రంప్ వీడియో విడుదల చేసిన మస్క్
- మస్క్‌ను బుర్ర లేని వ్యక్తిగా అభివర్ణించిన ట్రంప్

వాషింగ్టన్, జూన్ 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహిత మిత్రుడు, ఇప్పటి వరకూ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన బిలియనీర్ ఎలాన్‌మస్క్ మధ్య 'హనీమూన్' ముగిసింది. ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలై.. ఏకంగా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి దారి తీస్తోంది. ట్రంప్ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో...

గోదావరి బనకచర్ల అనుసంధానం అడ్డుకుంటాం
- కేంద్ర జలశక్తి, ఆర్థిక శాఖలకు లేఖలు రాశాం
- బచావత్ ప్రకారమే వెళ్తామని కేంద్రం బదులిచ్చింది
- జలాల్లో న్యాయమైన వాటాకు ఎక్కడిదాకైనా వెళ్తాం
- కృష్ణా జలాల్లో బీఆర్ఎస్ హయాంలోనే అన్యాయం
- విలేకరులతో ఉత్తమ్ చిట్‌చాట్.. జోసెఫ్ గోబెల్స్ రావులా పేరు మార్చుకోవాలని హరీశ్‌కు చురకలు

14



వచ్చే ఏడాది ఏప్రిల్‌లో బంగ్లాదేశ్ ఎన్నికలు
ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ యూనస్ ప్రకటన

ఢాకా, జూన్ 6: బంగ్లాదేశ్‌లో జాతీయ ఎన్నికలు నిర్వహించాలంటూ ప్రజల నుంచి వచ్చిన ఒత్తిళ్లకు తాత్కాలిక ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ యూనస్ తలొగ్గారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయని శుక్రవారం ఆయన ప్రకటించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం వెల్లడిస్తుందని తెలిపారు. ప్రధానిగా హసీనా బేగంను పదవీచ్యుతి చేసిన అనంతరం బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం తాత్కాలిక ప్రభుత్వం నడుస్తోంది.

సిమ్లా ఒప్పందం రద్దు కాలేదు
పాకిస్థాన్ విదేశాంగ శాఖ స్పష్టీకరణ

2

హెల్త్ కేర్ ట్రస్ట్‌కు ప్రతి నెలా
రూ.59 కోట్లు
- ఉద్యోగుల వాటాకు సమానంగా సర్కారు చెల్లింపు
- ట్రస్టు ఖాతాలో ఏటా రూ.720 కోట్లు జమ
- వచ్చే వారం ఉద్యోగ సంఘాలతో సీఎస్ సమావేశం



హైదరాబాద్, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆరోగ్య పథకం(న్యూ ఈహెచ్ఎస్)పై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం పథకం అమలుకు హెల్త్‌కేర్ ట్రస్టు ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై నెలాఖరుకు స్పష్టత వస్తుందని వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ లోగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉద్యోగ సంఘాల నేతలతో వచ్చే వారంలో సమావేశం కానున్నారు. కాగా, ఆరోగ్య భద్రత కోసం ఉద్యోగులు నెలకు రూ.500 చొప్పున వారి వాటా కింద చెల్లిస్తే. అందుకు సమాన వాటాను జత చేసి ఆ మొత్తంతో ఆరోగ్య ట్రస్టు ద్వారా ఉద్యోగులకు వైద్య సేవలు అందించనున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఉద్యోగులు (2,67,874), పెన్షనర్లు (2,56,556), పోలీసులు(70,018) కలిపి మొత్తం 5,94,448 మంది ఉన్నారు. ప్రభుత్వం చెప్పిన లెక్క ప్రకారం.. ఉద్యోగులు, సర్కారు వాటా కింద హెల్త్‌కేర్ ట్రస్టుకు ప్రతి నెలా రూ.59.44 కోట్లు జమ అవుతాయి. ఈ లెక్కన ఏడాదికి రూ.720 కోట్లు జమ అవుతాయి. ప్రతీనెలా 10వ తేదీన ఉద్యోగుల వాటా, ప్రభుత్వ

మిగతా 14వ పేజీలో...



ఇజ్రాయెల్ దాడులతో శిథిలాల గుట్టలుగా మిగిలిన గాజా

పార్లే-జి బిస్కెట్‌కు రూ.2,400

» ఉల్లి కిలో 4 వేలకు పైనే.. గాజాలో తీవ్ర ఆహార కొరత!

న్యూఢిల్లీ, జూన్ 6: యుద్ధ వాతావరణం నేపథ్యంలో గాజాలో తీవ్ర ఆహార కొరత నెలకొంది. నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతున్నాయి. మన దేశంలో రూ. 5కు దొరికే పార్లే-జి బిస్కెట్.. గాజాలో సుమారు రూ. 2,400కు అమ్ముతున్నారు. ఇది అక్కడి తీవ్ర ఆహార కొరతకు, ధరల మంటకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. దీనికి సంబంధించి గాజాకు చెందిన ఓ వ్యక్తి సోషల్‌మీడియాలో ఇటీవల పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. "చాలా కాలం ఎదురు చూసిన తర్వాత ఎట్టకేలకు ఈ రోజు కుమార్తె రఫీఫ్‌కు ఇష్టమైన పార్లే-జి బిస్కెట్లు కొన్నాను. గతంలో 1.5(రూ. 147) యూరోలు ఉండే దీని రేటు 24(రూ. 2,345)యూరోలకు పెరిగినా, ఆమెకు ఇష్టమైన దానిని కాదనలేకపోయాను" అంటూ ఆ పోస్టులో ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఇక 2023 అక్టోబర్ నుంచి ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత నుంచి ఇజ్రాయెల్ గాజాకు ఆహార సరఫరాను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. ఈ ఏడాది మార్చి 2 నుంచి మే 19 మధ్య అయితే పూర్తిగా నిలిపివేసింది. అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిడి నేపథ్యంలో సహాయక సామగ్రితో కూడిన కొన్ని ట్రక్కులకు మాత్రమే అనుమతి ఇస్తోంది. ఒక్క బిస్కెట్ల ప్యాకెట్లే కాకుండా నిత్యావసర సరుకుల ధరలు కూడా మండిపోతున్నాయని ఎన్‌డీటీవీ కథనం తెలిపింది. ఉత్తర గాజాలో కిలో చక్కెర రూ. 4,914, కిలో వంట నూనె రూ. 4,177, కిలో బంగాళాదుంపలు రూ. 1,965, కిలో ఉల్లిపాయలు రూ.4,423, కప్పు కాఫీ రూ.1,800కు అమ్ముతున్నారని వెల్లడించింది.

ఆగస్టు 3న నీట్-పీజీ.. ఒకే షిఫ్టులో నిర్వహణ

న్యూఢిల్లీ, జూన్ 6: దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ స్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-పీజీ 2025)ను ఆగస్టు 3న ఒకే షిఫ్ట్‌లో నిర్వహించడానికి సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతించింది. పరీక్ష నిర్వహణ కోసం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ) 2నెలల గడువు కోరడాన్ని తొలుత ప్రశ్నించిన ధర్మాసనం.. బోర్డు విజ్ఞప్తి నిజాయితీగా ఉందని అభిప్రాయపడింది. అయితే నీట్-పీజీ 2025 నిర్వహణకు ఎన్‌బీఈకి ఇకపై సమయం ఇవ్వబోమని స్పష్టం చేసింది. అంతకుముందు, ఎన్‌బీఈ తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ వాదనలు వినిపిస్తూ.. దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు చిన్న లోపం కూడా లేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. మొత్తం 2,42,679 మంది అభ్యర్థులకు ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించడానికి దాదాపు 1,000కి పైగా కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాల్సి ఉందని విన్నవించారు.

నీట్-యూజీ ఫలితాల విడుదలకు మార్గం సుగమం

చెన్నై, జూన్ 6: నీట్-యూజీ 2025 పరీక్ష ఫలితాల విడుదలకు మార్గం సుగమమైంది. ఫలితాలు ప్రకటించకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని నిరోధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 4న నీట్ యూజీ పరీక్షను నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో చెన్నైలోని నాలుగు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన తమకు మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఎన్‌టీఏను ఆదేశించాలని కోరుతూ ఎస్ సాయిప్రియ, మరో 15మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలను విచారించిన మద్రాసు హైకోర్టు... దాదాపు 22లక్షల మంది విద్యార్థులు నీట్-యూజీ రాశారని, చిన్నచిన్న కారణాలతో మరోసారి పరీక్ష నిర్వహణకు అనుమతిస్తే 20లక్షల మందికి పైగా అభ్యర్థులపై ప్రభావం పడుతుందని పేర్కొంది. పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నిర్వహించారని, ఆ సమయంలో విద్యుత్తు లేకపోయినా సహజంగా వెలుతురుగానే ఉంటుందని అడిషనల్ సొలిసిటర్ జనరల్ చేసిన వాదనలతో ఏకీభవించింది.

రాజ్యసభకు కమల్ హాసన్ నామినేషన్



చెన్నై, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు, 'మక్కల్ నీది మయ్యం' అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి వెంట రాగా, కమల్ నామినేషన్ పత్రాలను శుక్రవారం చెన్నైలో ఎన్నికల అధికారికి అందించారు. గత పార్లమెంటు ఎన్నికల సమయంలో తమ కూటమికి మద్దతు ప్రకటించిన కమల్‌కు రాజ్యసభ స్థానం ఇస్తామని ప్రకటించిన స్టాలిన్.. ఆ మేరకు అవకాశం కల్పించారు. త్వరలో తమిళనాడు నుంచి ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానుండగా, అసెంబ్లీలో బలాబలాలను బట్టి డీఎంకేకు 4, అన్నాడీఎంకే 2 స్థానాలు ఖాయమైంది.

రామ మందిర నిర్మాణంలో 45 కిలోల బంగారం

అయోధ్య, జూన్ 6: అయోధ్య శ్రీరామ మందిర నిర్మాణంలో 45 కిలోల స్వచ్ఛమైన బంగారాన్ని వినియోగించారు. దీని విలువ పన్నులు పోనూ రూ.50 కోట్ల వరకు ఉంటుంది. ఈ విషయాన్ని మందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్ర శుక్రవారం ఇక్కడ వెల్లడించారు. ఆలయ మొదటి అంతస్తులో రామ దర్బారు ప్రాణప్రతిష్ఠ గురువారం పూర్తయిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కింది అంతస్తులో ఉన్న రామ మందిర ద్వారాలకు, రాముడి సింహాసనానికి ఈ బంగారాన్ని ఉపయోగించినట్టు చెప్పారు. శేషావతార మందిరం వద్ద ప్రస్తుతం బంగారు తాపడం పనులు జరుగుతున్నాయని తెలిపారు. మందిరంలోని ప్రధాన పనులు పూర్తయ్యాయని, ఇంకా మ్యూజియం, ఆడిటోరియం, గెస్ట్‌హౌస్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవి డిసెంబరు నాటికి పూర్తవుతాయని వివరించారు. రామ దర్బారు దర్శనానికి ప్రస్తుతం కొంతమందికి మాత్రమే అనుమతి ఇస్తున్నామని తెలిపారు.

ఆర్సీబీ మార్కెటింగ్ మేనేజర్ నిఖిల్ అరెస్టు

బెంగళూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద 11 మందిని బలిగొన్న తొక్కిసలాట కేసులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మార్కెటింగ్ మేనేజర్ నిఖిల్ సొసలెను పోలీసులు అరెస్టు చేశారు. సుమంత్, డీఎన్‌ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌కు చెందిన కిరణ్, సునిల్ మాథ్యూను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిఖిల్ సొసలె అరెస్టు సమయంలో నాటకీయ పరిణామాలు జరిగాయి. ఆయన ముంబై వెళ్లేందుకు భార్యతోపాటు విమానాశ్రయంలో ఉండగా పోలీసులు ఒక్కసారిగా దాడి చేసి పట్టుకున్నారు. ఆ తర్వాత మిగతా ముగ్గురినీ అదుపులోకి తీసుకొన్నారు. వారిని విచారించారు. ఐపీఎల్ విజేత జట్టు అయిన ఆర్సీబీ కోసం బుధవారం బెంగళూరులో విజయోత్సవాలు జరుపుతున్నట్టు ప్రకటించింది ఎవరు.. పాస్‌ల మంజూరు, ఉచిత ప్రదేశాల గురించి ప్రచారం చేసింది ఎవరనేది పోలీసులు ఆరా తీశారు. అనంతరం నలుగురినీ పరప్పన అగ్రహార జైలుకు తరలించారు.

గెలిచిన చోటల్లా 50% పరిమితి ఎత్తేస్తాం: రాహుల్

రాజ్‌గిర్, జూన్ 6: దేశంలో ఎక్కడ అధికారంలోకి వచ్చినా ఆయా రాష్ట్రాల్లో రిజర్వేషన్లపై 50% పరిమితిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. దేశంలో అణగారిన వర్గాలు 90% ఉంటే రిజర్వేషన్లపై 50% పరిమితి విధించాలనే ఆలోచన ఎలా వచ్చిందో తనకు ఆశ్చర్యం వేస్తుందన్నారు. రిజర్వేషన్లపై 50% పరిమితి అనే అడ్డుగోడను తొలగించాలంటే కుల గణనే తొలి అడుగని చెప్పారు. కుల గణన చేయడం ద్వారా తాము అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణలో ఈ అడ్డుగోడను తొలగించామన్నారు.

చినాబ్ నదిపై

ఇంజనీరింగ్ అద్భుతం

ప్రపంచంలోనే ఎత్తయిన రైలు బ్రిడ్జి ప్రారంభించిన ప్రధాని మోదీ

» కశ్మీరులో అభివృద్ధిని ఎవరూ ఆపలేరు
» మత ఘర్షణలకే పహల్గాం ఉగ్రదాడి
» చినాబ్ వంతెన.. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీక: ప్రధాని మోదీ
» బ్రిటిషర్లు చేయలేని పనిని మోదీ సర్కారు పూర్తి చేసింది: ఒమర్ అబ్దుల్లా





చినాబ్ వంతెనపై వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న మోదీ, కశ్మీర్ సీఎం ఒమర్

కట్రా, జూన్ 6: జమ్మూకశ్మీరులో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఉక్కు వంతెనను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ బ్రిడ్జిని రూ.1,486 కోట్ల వ్యయంతో ఎనిమిదేళ్లపాటు శ్రమించి, నిర్మించారు. అత్యంత దుర్లభమైన శివాలిక్, పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ కశ్మీర్ లోయకు రైలును నడపాలన్న బ్రిటిష్ కాలం నాటి ప్రణాళిక దాదాపు శతాబ్దకాలం తర్వాత కార్యరూపం దాల్చింది. భారతదేశ ఇంజనీరింగ్ అద్భుతంగా పేర్కొంటున్న ఈ బ్రిడ్జిని శుక్రవారం మోదీ ప్రారంభించారు. త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని మోదీ ఈ అద్భుత వంతెనపై నడిచారు. కట్రా నుంచి కశ్మీరుకు వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించడంతో వంతెన అందుబాటులోకి వచ్చినట్లయింది. అలాగే అంజి నదిపై నిర్మించిన దేశంలోనే తొలి కేబుల్ రైలు వంతెనను కూడా మోదీ ప్రారంభించారు. దీంతో పాటు త్రికూట పర్వతాల్లోని వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే యాత్రికులకు బేస్ క్యాంపు అయిన కట్రాలో రూ.46 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధాని జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఉధంపూర్‌లోని వైమానిక కేంద్రంలో దిగిన మోదీ.. వంతెన ప్రారంభానికి ముందు దాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చినాబ్, అంజి వంతెనలపై పరుగులు తీసిన వందే భారత్ రైలులో మోదీ ప్రయాణించారు. అనంతరం కట్రాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. చినాబ్ వంతెన ప్రారంభోత్సవం జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ప్రతిబింబమని చెప్పారు. ఉధంపూర్- శ్రీనగర్- బారాముల్లా రైలు లింకు (యూఎస్‌బీఆర్‌ఎల్) ప్రాజెక్టు నవీన, సాధికార జమ్మూకశ్మీరుకు సంకేతమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తవడంతో దేశంలోని అన్ని ప్రాంతాలతో కశ్మీరుకు రైలు అనుసంధానం ఏర్పడిందన్నారు.

కశ్మీరులో అభివృద్ధిని ఎవరూ ఆపలేరు..

ఎవరెన్ని కుట్రలు పన్నినా కశ్మీరులో అభివృద్ధిని ఆపలేరని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పామన్నారు. "మన పొరుగు దేశం పర్యాటకానికి, మానవత్వానికి వ్యతిరేకం. మన పర్యాటకాన్ని దెబ్బతీసి, పేదల పొట్టగొట్టాలని చూస్తోంది. ఆదిల్ హుస్సేన్ గుర్రం మీద పర్యాటకులను తీసుకెళ్లే పోనీవాలా. కష్టపడి తన కుటుంబాన్ని పోషించుకునే ఆదిల్ ఆ రోజు (ఏప్రిల్ 22న) ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడాడు. అతడ్ని కూడా ముష్కరులు చంపేశారు. ఉగ్రవాదంపై పోరులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. పాక్ ఉగ్ర కుట్రలకు దీటుగా బదులిస్తున్నాం. కశ్మీరులో పర్యాటకాన్ని నాశనం చేయాలని, దేశంలో మత ఘర్షణలు సృష్టించాలనే ఉగ్రవాదులు పహల్గాంలో దాడికి పాల్పడ్డారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సత్తా ఏంటో వారికి చూపించాం" అని మోదీ పునరుద్ఘాటించారు.

చినాబ్ వంతెన.. ఒమర్ చిన్ననాటి కల

"ఈఫిల్ టవర్ కన్నా ఎత్తయిన వంతెనను నిర్మించుకున్నాం. భారత ఇంజనీరింగ్ నైపుణ్యానికి చినాబ్ బ్రిడ్జి నిలువెత్తు నిదర్శనం. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతం పర్యాటక ఆకర్షణగానూ నిలుస్తుంది. ఎన్నో సవాళ్లు ఎదురైనా మాతా వైష్ణోదేవి ఆశీర్వాదంతో విజయవంతంగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశాం. ఈ రోజు భారత రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్ కూడా అనుసంధానమైంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి.. అనేమాట నిజమైంది. ఈ రోజు కోసం అనేక తరాలు ఎదురుచూశాయి. సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా 8వ తరగతి నుంచే ఈ ప్రాజెక్ట్ కోసం కలలు కన్నారు" అని మోదీ తెలిపారు. ఇదే సభలో జమ్మూకశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. కశ్మీరుకు ప్రత్యేక రాష్ట్ర హోదా అంశాన్ని తనదైన శైలిలో ప్రస్తావించారు. చతురతతో ఈ అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాని మోదీ తనను త్వరలోనే ప్రమోట్ చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. "2014లో మీరు తొలిసారి ప్రధాని హోదాలో ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సీఎంగా ఉన్నా. ఆ తర్వాత మీరు వరసగా గెలిచి ప్రధానిగా ఉన్నారు. నేను ఇప్పుడు కేంద్రపాలిత ప్రాంత సీఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వే శాఖ సహాయమంత్రిగా ఉన్న మనోజ్ సిన్హాకు లెఫ్టినెంట్ గవర్నర్‌గా పదోన్నతి వచ్చింది. త్వరలో నాక్కూడా ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నా. జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నా" అని ఒమర్ పేర్కొన్నారు. తాను 8వ తరగతిలో ఉన్నప్పుడు చినాబ్ రైలు వంతెన గురించి కలలు కన్నానని.. ఇప్పుడు తనకు 55 ఏళ్లని, తన పిల్లలు కూడా కాలేజీ చదువు పూర్తి చేశారని ఒమర్ చెప్పారు. బ్రిటిషర్లు కూడా పూర్తి చేయలేకపోయిన ఈ ప్రాజెక్టును ఎట్టకేలకు మోదీ సర్కారు పూర్తి చేసిందని కొనియాడారు.

చినాబ్ వంతెన ప్రత్యేకతలివీ..

చినాబ్ నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో ఈ రైలు ఆర్చి వంతెనను నిర్మించారు. దీని పొడవు 1.315 కిలోమీటర్లు. ఇప్పటివరకు చైనాలో ఉన్న షుబాయ్ రైల్వే వంతెన (275 మీటర్ల ఎత్తు) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును చినాబ్ వంతెన అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ. అతి వేగమైన గాలులు, భూకంపాలు, వరదలు, బాంబు పేలుళ్లను సైతం తట్టుకునేలా అత్యాధునిక సాంకేతికతతో ఈ బ్రిడ్జిని నిర్మించారు. దీని ప్రారంభంతో జమ్మూ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణ సమయం దాదాపు 2-3 గంటలు తగ్గనుంది. ఈ వంతెన జీవితకాలం 120 ఏళ్లని ఇంజనీర్లు చెబుతున్నారు. దీనిపై గరిష్ఠంగా 100 కి.మీ. వేగంతో రైలు ప్రయాణించవచ్చు. ఈ వంతెన నిర్మాణంలో భాగంగా 600 కిలోమీటర్ల స్టీల్ వెల్డింగ్‌ను వినియోగించారు. ఇది ఢిల్లీ-జమ్మూ మధ్య రైల్వే మార్గం పొడవుతో సమానం. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేయగా.. 23 ఏళ్ల తర్వాత ఇది పూర్తయింది. వంతెనకు సంబంధించిన ఆసక్తికర విషయాలను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

లోకం తీరు



యాక్సిడెంట్ బాధితులకు రూ.1.50లక్షల వరకు వైద్యం ఫ్రీ

» ప్రమాదం జరిగిన 24 గంటల్లోగా ఆస్పత్రిలో చేరినవారు అర్హులు
» ఆయుష్మాన్ భారత్ వర్తించే ఆస్పత్రులన్నింటిలో పథకం అమలు

న్యూఢిల్లీ, జూన్ 6: రోడ్డు ప్రమాదంలో గాయపడినవారికి రూ.1.50లక్షల నగదురహిత(క్యాష్ లెస్) చికిత్స అందించడానికి వీలుగా కేంద్రప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మోటారు వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 162కింద ఈ గెజిట్‌ను విడుదల చేసింది. ప్రమాదం జరిగిన 24గంటల్లోగా ఆసుపత్రిలో చేరినవారు ఈ పథకానికి అర్హులు. అయితే, ప్రమాదం నిజమా.. కాదా.. అన్నది స్థానిక పోలీసులు యాక్సిడెంట్ జరిగిన 24గంటల్లోగా గుర్తించి ఆసుపత్రికి తెలియజేయాలి. లేకపోతే, కవరేజీ లభించదు. ఒకవేళ బాధితులు ప్రాణాపాయ స్థితిలో ఉంటే మాత్రం చికిత్స అందిస్తారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఈ పథకం కింద నగదు రహితంగా ఏడు రోజుల వరకు చికిత్స అందజేస్తారు. ఆయుష్మాన్ భారత్ పీఎం-జన్ ఆరోగ్య యోజన అమలయ్యే, నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ) నోటిఫై చేసిన ఆసుపత్రుల్లో ఈ పథకం అమలు అవుతుంది. ఒకవేళ బాధితులను యాక్సిడెంట్ ప్రదేశం నుంచి సమీపంలోని వేరే ఆస్పత్రులకు తరలిస్తే.. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి ఆ తర్వాత.. ఈ పథకం అమలయ్యే ఆసుపత్రులకు పంపించవచ్చు. రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స అందించే ఆసుపత్రులు ఆ వివరాలను ఆయా స్టేట్ హెల్త్ ఏజెన్సీ(ఎస్‌హెచ్‌ఏ)ల ఆమోదానికి పంపించాల్సి ఉంటుంది. కాగా, యాక్సిడెంట్ గురించి సమాచారం ఇవ్వాలనుకున్నవారు 112 నంబర్‌కు కాల్ చేయాలి. లేకపోతే ఈడీఏఆర్ మొబైల్ యాప్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చు. చికిత్స సమయంలో బాధితుడు చనిపోతే హాస్పిటల్‌కు రీయింబర్స్‌మెంట్ వస్తుంది.

జీ-7 సదస్సుకు రావాలని మోదీకి కెనడా ప్రధాని ఆహ్వానం

న్యూఢిల్లీ, జూన్ 6: జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందింది. కెనడా కొత్త ప్రధాని మార్క్ కెర్నీ ప్రధాని మోదీకి ఫోన్ చేసి సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు. కెనడాలో జరిగే జీ-7 సదస్సుకు హాజరవుతున్నానని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. కొత్తగా ఎన్నికైన సందర్భంగా కెర్నీకి శుభాకాంక్షలు తెలిపారు. కెర్నీతో సమావేశమయ్యేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ మోదీ పోస్ట్‌లో రాశారు. తనను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు చెప్పారు. ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, అమెరికా, యూకే, జపాన్, కెనడా దేశాలు జీ-7గా ఏర్పడ్డాయి. ఈ నెల 15 నుంచి 17 వరకు కెనడాలోని ఆల్బెర్టాలో జీ-7 సదస్సు జరగనుంది.

అధికారికంగా భరతమాత చిత్రమేదీ లేదు: కేరళ

తిరువనంతపురం, జూన్ 6: ప్రభుత్వ కార్యక్రమాల్లో భారతమాత చిత్రాన్ని అనుమతించబోమని శుక్రవారం కేరళ ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాంటి చిత్రానికి రాజ్యాంగం ద్వారాగానీ, భారత ప్రభుత్వం ద్వారాగానీ ఎలాంటి గుర్తింపు లేదని తెలిపింది. అందుకే పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారతమాత చిత్రం వినియోగించడాన్ని అంగీకరించలేదని పేర్కొంది. ఆ చిత్రం పెట్టినందుకు నిరసనగా రాష్ట్ర వ్యవసాయ మంత్రి పి.ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని బహిష్కరించడం గమనార్హం. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అధికారిక కార్యక్రమాలను రాజకీయ సమావేశాలుగా మార్చకూడదని కేరళ ప్రభుత్వం అభిప్రాయపడింది. రాజ్‌భవన్ కార్యక్రమంలో భారతమాత చేతిలో జాతీయ జెండా బదులు పార్టీ జెండా ఉందని, అందువల్ల అలాంటి చిత్రాలను అధికారిక కార్యక్రమాల్లో ఉపయోగించకూడదని తెలిపింది.

హవ్వ...ఉగ్రవాదికి తనిఖీల అధికారమా?!

భద్రతామండలిలో జరిగింది ఇదే.. పాక్‌కు ఉగ్రవాద వ్యతిరేక కమిటీ బాధ్యతలు

» వైస్ చైర్మన్ పోస్టులోకి దాయాదిదేశం
» మండలి ఎంపికలపై భారత్ తీవ్ర నిరసన



అమెరికా సెనేటర్ ఆండీ కిమ్‌తో థరూర్ బృందం సమావేశం

వాషింగ్టన్, జూన్ 6: దొంగ చేతికి తాళం, ఉగ్రవాదికి పౌరుల తనిఖీల అధికారం ఇస్తామా? కానీ, ఐక్యరాజ్యసమితిలోని భద్రతామండలిలో ఇదే జరిగింది. ప్రపంచమంతటా ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న ధూర్తదేశంగా తరచూ బోనెక్కే పాకిస్థాన్‌కు భద్రతామండలిలోని తాలిబన్ల ఆంక్షల కమిటీ చైర్మన్ పదవి, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల కమిటీ వైస్ చైర్మన్ పదవి లభించాయి. దీనిపై భారత్ తీవ్ర నిరసన తెలిపింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ ఉగ్ర పన్నాగాలపై భారత్ దౌత్య యుద్ధం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అఖిల పక్ష పార్టీల ఎంపీలను బృందాలుగా విదేశాలకు పంపించింది. ఈ బృందాలకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అమెరికాలో పర్యటిస్తుండగానే ఈ పరిణామం జరిగింది. అక్కడి భారత ఎంబసీలో శుక్రవారం ఆయన మీడియాతో దీనిపై మాట్లాడారు. ఇలాంటి నియామకాల వల్ల పెద్దగా కొంపలు మునిగిపోయేదేమీ ఉండదంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. "భద్రతామండలిలో ఒక సభ్యదేశంగా పాకిస్థాన్‌కు ఈ 'అవకాశం' దక్కి ఉండవచ్చు. కానీ, మండలిలో భారత్‌కు మిత్రులు లేకపోలేదు. అందువల్ల పెద్దగా విపరిణామాలేవీ ఉండవనే పూర్తిధీమా మాకు ఉంది" అని ఆయన తేల్చిచెప్పారు. పాక్‌కు తాలిబన్ల ఆంక్షల కమిటీ చైర్మన్ పోస్టు దక్కడంపై స్పందిస్తూ.. ఈ ఎంపికను అఫ్ఘానిస్థాన్ వాసులు ఎలా చూస్తారనేది చూడాలన్నారు. ఐక్యరాజ్యసమితిలో పలు వ్యవస్థలు, కమిటీలు పనిచేస్తుంటాయని, నెలవారీ రొటేషన్‌లో భాగంగా సభ్యదేశాలు వాటికి నేతృత్వం వహిస్తూ ఉంటాయని వివరించారు. అలా.. పాకిస్థాన్‌కూ ఈ విడత అవకాశం లభించి ఉంటుందన్నారు. అయితే, చైర్మన్ పదవి పాకిస్థాన్‌కు దక్కిఉంటే అంతకు మించిన పరిహారం ఉండేది కాదన్నారు. కాగా, ఉగ్రవాద వ్యతిరేక కమిటీ చైర్మన్ పదవి అల్జీరియాకు దక్కింది. ఇదిలా ఉండగా, అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు వింత అనుభవం ఎదురైంది. అక్కడ ఆయన నిర్వహించిన మీడియా సమావేశానికి వాషింగ్టన్ పోస్టు జర్నలిస్టుగా వచ్చిన సొంత కుమారుడు ఇషాన్ థరూర్ తన తండ్రికి ప్రశ్నలు వేయడం అందరినీ ఆకర్షించింది.

సిమ్లా ఒప్పందం రద్దు కాలేదు

» పాక్ విదేశాంగ శాఖ స్పష్టీకరణ

ఇస్లామాబాద్, జూన్ 6: భారత్‌తో 1972లో కుదిరిన చారిత్రక 'సిమ్లా ఒప్పందం' విషయంలో పాకిస్థాన్‌లో గందరగోళం నెలకొన్నట్లు కనిపిస్తోంది. సిమ్లా ఒప్పందానికి ఇక విలువ లేదని, అది 'డెడ్ డాక్యుమెంట్' అంటూ పాక్ రక్షణ మంత్రి ఖాజా ఆసిఫ్ గురువారం సంచలన వ్యాఖ్యలు చేయగా.. పాక్ విదేశాంగ శాఖ మాత్రం ఈ వ్యాఖ్యలను తోసిపుచ్చింది. సిమ్లా ఒప్పందం సహా భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్నీ రద్దు చేసుకునే నిర్ణయం తాము తీసుకోలేదని పాక్ విదేశాంగ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అన్ని ఒప్పందాలూ అమల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాక్‌తో 'సింధు' జలాల ఒప్పందాన్ని తాము రద్దు చేసుకుంటున్నట్లు భారత్ ప్రకటించడం తెలిసిందే. కాగా, భారత్ నిర్ణయంపై పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ స్పందిస్తూ, "సింధు జలాల ఒప్పందం రద్దయిందో, లేదో తెలియదు. కానీ, సిమ్లా ఒప్పందం మాత్రం ముగిసినట్లే. మేం తిరిగి 1948 నాటి పరిస్థితులకు వచ్చేశాం. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన నియంత్రణ రేఖ ఇక కాల్పుల విరమణ రేఖ మాత్రమే" అన్నారు.

భాయియా భాయియా.. బాహాబాహీ

(మొదటి పేజీ తరువాయి)



ఇటీవల తీసుకొచ్చిన ఫెడరల్ ప్రభుత్వ వ్యయ నియంత్రణ బిల్లును మస్క్ వ్యతిరేకించి.. ప్రభుత్వ వ్యయ నియంత్రణ విభాగ (డోజ్) అధిపతి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీనిపై ట్రంప్ విలేకర్లతో మాట్లాడుతూ, మస్క్‌కు ఎంతో చేశానని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి మస్క్ స్పందిస్తూ.. తన సహకారం లేకుంటే ట్రంప్ మొన్నటి ఎన్నికల్లో గెలిచేవారే కాదన్నారు. దీనిపై ట్రంప్ తిరిగి స్పందిస్తూ.. ఇంత కృతజ్ఞతారాహిత్యమా? అని పేర్కొన్నారు. వివాదం ఈ విధంగా కొనసాగుతుండగానే.. ట్రంప్ శుక్రవారం మస్క్‌కు మరో హెచ్చరిక జారీ చేశారు. ఎలాన్ మస్క్ సంస్థలకు ఉన్న ప్రభుత్వ కాంట్రాక్టులను రద్దు చేస్తానని తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. 'మస్క్‌కు ప్రభుత్వం ఇస్తున్న కాంట్రాక్టులను, సబ్సిడీలను రద్దు చేయటం ద్వారా వందల కోట్ల డాలర్లను ఆదా చేయవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు. దీనిపై మస్క్ వెంటనే స్పందించారు. 'మీరు మీ నిర్ణయం ప్రకారం ముందుకెళ్లవచ్చు' అంటూ ప్రతి సవాల్ విసిరారు. అంతేకాదు, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్‌ఎస్‌కు) వ్యోమగాములను తీసుకెళ్లటానికి, తిరిగి తీసుకురావటానికి అమెరికా నాసా ఉపయోగిస్తున్న తమ స్పేస్ ఎక్స్ కంపెనీకి చెందిన డ్రాగన్ వ్యోమనౌక సేవలను నాసాకు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, కొన్నిగంటల్లోనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. అంతకుముందు, ఏబీసీ న్యూస్ అనే మీడియా సంస్థ ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేసినప్పుడు.. మస్క్‌తో విబేధాల పరిష్కారానికి ఫోన్‌లో మాట్లాడతారా అని ప్రశ్నించగా.. 'ఆ మెదడు లేని వ్యక్తితోనా? నాకు ఆసక్తి లేదు. వాస్తవానికి, మస్క్ నాతో ఫోన్‌లో మాట్లాడాలని భావించారు. కానీ, నేనే అందుకు అంగీకరించలేదు' అని తెలిపారు.

కొనసాగుతున్న మస్క్ దాడి

ట్రంప్ మీద మస్క్ తన దాడిని కొనసాగించారు. అమెరికన్లు కడుతున్న పన్నులను ప్రభుత్వాలు వృథా చేస్తున్నాయంటూ గతంలో ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు, పోస్టులను ఎత్తిచూపుతూ.. ఆ ట్రంప్, ఈ ట్రంప్ ఒక్కరేనా అంటూ ప్రశ్నలు సంధించారు. చిన్నారుల మీద లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు ఉన్న సంబంధాల గురించి ప్రభుత్వం సమాచారాన్ని తొక్కిపెడుతోందని ఆరోపించారు. ఈ మేరకు ట్రంప్, జెఫ్రీ కలిసి ఓ విందులో పాల్గొన్న 1992 నాటి వీడియోను షేర్ చేశారు. ట్రంప్‌ను అభిశంసించి అధ్యక్ష పదవి నుంచి తొలగించాలంటూ ఎక్స్‌లో వచ్చిన ఓ పోస్టును షేర్ చేశారు. వీటిపై ట్రంప్ కూడా ఊరుకోలేదు. ప్రభుత్వం నుంచి వైదొలగాలని మస్క్‌ను తానే ఆదేశించానని, దాంతో ఆయన వెర్రివాడిలా మారి అవాకులు చెవాకులు పేలుతున్నాడని ఎద్దేవా చేశారు. ట్రంప్‌తో మస్క్ సంబంధాలు క్షీణించటంతో ఆయన కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతోంది. టెస్లా షేర్ల ధరలు మార్కెట్లో గురువారం 14% మేర పడిపోయాయి. ఫలితంగా ఆ కంపెనీ 15,200 కోట్ల డాలర్ల (రూ.13,03,194 కోట్లు) నష్టాన్ని చవిచూసింది.

ఇదీ నేపథ్యం

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ కోసం మస్క్ 30 కోట్ల డాలర్లు (రూ.2,500 కోట్లు) ఖర్చు చేశారు. ట్రంప్ విజయంలో కీలకపాత్ర పోషించారు. అందువల్లే, ట్రంప్ కూడా మస్క్‌ను ఆదరించారు. డోజ్ విభాగానికి మస్క్‌ను అధిపతిగా నియమించారు. అయితే, ప్రభుత్వ వ్యయ నియంత్రణ కోసం ఇటీవల ట్రంప్ తీసుకొచ్చిన బిల్లును మస్క్ వ్యతిరేకించటంతో వారి స్నేహబంధం బీటలువారటం మొదలైంది. ఈ బిల్లును అమలు చేస్తే ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థికవ్యవస్థ దెబ్బతింటుందని మస్క్ విమర్శించారు. దీన్ని ట్రంప్ తిప్పికొట్టారు.విద్యుత్ వాహనాలకు ఇస్తున్న పన్ను రాయితీలను ఉపసంహరిస్తున్నందువల్లనే బిల్లును మస్క్ వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు.

డీఎస్ఆర్ యాప్ మాకొద్దు!

(మొదటి పేజీ తరువాయి)



పోరాటానికి సిద్ధమవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శుల్లో పారదర్శకతను పెంచేందుకు గత ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది. అయి తే, ఇందులో కొన్ని లోపాల కారణంగా యాప్‌ను దుర్వినియోగం చేస్తూ కార్యదర్శులు విధులకు గైర్హాజరవుతున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. దీంతో గత నెల 24న కొన్ని మార్పులు, చేర్పులు చేసి ఫేస్ రికగ్నిజేషన్‌తో యాప్‌ను పకడ్బందీగా నిర్వహిస్తోంది. కార్యదర్శులు ఫేస్ రికగ్నిజేషన్‌తో ఫొటోను అప్‌లోడ్ చేయాలని, ఇతర వివరాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తూ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. గతంలో ఎక్కడి నుంచైనా వివరాలను ఆన్‌లైన్‌లో చేర్చే అవకాశం ఉండేది. ఇప్పుడు అలా కాకుండా.. ప్రతిరోజూ ఉదయం 11గంటలలోపు ఫేస్ రికగ్నిజేషన్ అటెండెన్స్ ఇతర నివేదికలతోపాటు రోజువారీగా ఇళ్ల నుంచి సేకరించే చెత్త ఎన్ని కిలోలన్న దానిపై వివరాలను చేర్చాలని నిర్ణయించారు. అయితే, కొత్త మార్గదర్శకాల వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలే పంచాయతీల్లో పాలకవర్గాలు లేక పని భారం అంతా తమ మీదనే పడుతున్నదని, చిన్న చిన్న పనులకు డబ్బులను సొంతంగా పెడుతున్నామని, ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీపరంగా 35 రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందని, దీనికి తోడు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన యాప్‌ల నిర్వహణ బాధ్యతలు కూడా తమపైనే ఉన్నాయని వారంటున్నారు. ఏ ప్రభుత్వ శాఖలో లేని విధంగా యాప్‌లో ఫేస్ రికగ్నైజ్ అటెండెన్స్ నిబంధన తమకే ఎందుకు పెట్టారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పైగా 2011 జనాభా లెక్కల ప్రకారమే కార్యదర్శులు ఉన్నారని, జనాభాకు తగ్గట్లుగా కార్యదర్శులను నియమించకపోవడంతో తమకు పని భారం పెరిగిపోయిందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శాఖాపరమైన నిర్ణయాల పట్ల నిర్లక్ష్యం తగదు

సచివాలయంలో ఉన్నతాధికారులు సైతం బయోమెట్రిక్ అటెండెన్స్ వేస్తారు.. అదేవిధానంలో గ్రామ సచివాయలంలో పనిచేసే కార్యదర్శులను కూడా డీఎస్ఆర్ యాప్ ద్వారా ఫేస్ రికగ్నిజేషన్ అటెండెన్స్ వేసేలా సాఫ్ట్‌వేర్ రూపొందించాం. ఇందులో సమాచారం ఇతరులకు చేరే అవకాశం లేనేలేదు. కానీ, కార్యదర్శులు పలు అపోహలతో యాప్‌ను వ్యతిరేకిస్తున్నారు. శాఖాపరంగా తీసుకున్న నిర్ణయాలను పాటించకుండా.. నిర్లక్ష్యం వహించడం మంచి పద్ధతి కాదు. డీఎస్ఆర్ యాప్‌లో వివరాల నమోదుకు మూడురోజులు గడువు ఇచ్చాం.. ఎలా స్పందిస్తారో చూడాలి.

- గుమ్మళ్ల సృజన, డైరెక్టర్- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ.

థర్డ్ పార్టీ ద్వారా యాప్ నిర్వహించడం భద్రతకు ముప్పు

డీఎస్ఆర్ యాప్‌ను థర్డ్ పార్టీ ద్వారా నిర్వహిస్తున్నారు. కార్యదర్శుల్లో 40 -50శాతం మహిళా కార్యదర్శులు పనిచేస్తున్నారు వారి వ్యక్తిగత వివరాలు థర్డ్ పార్టీ యాప్ ద్వారా సేకరిస్తే.. వారి భద్రతకే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. కొత్తగా తీసుకొచ్చిన ఫేస్ రికగ్నిజేషన్ యాప్ పంచాయతీ కార్యదర్శుల ఆత్మగౌరవం దెబ్బతినేలా ఉంది. అందుకే ఈ యాప్‌ను వ్యతిరేకిస్తున్నాం.

- శ్రీకాంత్‌గౌడ్, అధ్యక్షుడు, తెలంగాణ పంచాయతీ సెక్రటరీల ఫోరం



మంత్రి దామోదర రాజనర్సింహకు లక్ష్మీనృసింహుల చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన

- నృసింహుడి సేవలో మంత్రి రాజనర్సింహ

యాదగిరిగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి శుక్రవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్ప మాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో అలంకరించిన అర్చకస్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమ రీతిలో గంటపాటు పూజా పర్వం కొనసాగింది. లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. యాదగిరీశుని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ వేర్వేరుగా దర్శించుకున్నారు. మంత్రికి ఈవోతో పాటుగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈవో వెంకట్రావు లడ్డు ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

బీజాపూర్‌లో మరో ఎన్‌కౌంటర్!

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ మృతి.. ఏకే 47 స్వాధీనం

- అతని స్వస్థలం ఆదిలాబాద్

చర్ల/మంచిర్యాల/ఆసిఫాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. శుక్రవారం బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కు అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ మృతి చెందాడు. గురువారం ఇదే అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, బలగాల మధ్య అడపా దడపా ఎన్‌కౌంటర్లు జరిగాయని బీజాపూర్ పోలీసులు తెలిపారు. అలా జరిగిన ఎదురుకాల్పుల్లో భాస్కర్ మరణించాడని, అతని వద్ద నుంచి ఏకే47 తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అతను కొమురంభీం, మంచిర్యాల ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలం నుంచి భారీ సంఖ్యలో పేలుడు వస్తువులు, విప్లవ పుస్తకాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. నేషనల్ పార్కు అడవుల్లో కూంబింగ్ జరుగుతోందని పోలీసులు చెబుతున్నారు. ఆదిలాబాద్‌జిల్లా బోథ్ మండలం పొచ్చర్లకు చెందిన అడెల్లు అలియాస్ భాస్కర్ 1995లో సాయుధ పోరాటం వైపు అడుగులు వేశాడు. జిల్లాలోని రామకృష్ణాపూర్‌లో ఆర్ఎంపీ వైద్యుడిగా ఉన్నప్పుడే పీపుల్స్ వార్ పార్టీతో సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. ఉత్తర తెలంగాణలోని పలుప్రాంతాల్లో ఆ పార్టీలో పనిచేశాడు. అనంతరం మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నాడు. భాస్కర్‌పై 30కి పైగా కేసులు ఉన్నాయి. రూ.25 లక్షల రివార్డు ఉంది.



భాస్కర్ మృతదేహం; భాస్కర్ (ఫైల్)

ఇద్దరినీ పట్టుకొని చంపారా?

సుధాకర్, భాస్కర్‌లు వరుస ఎన్‌కౌంటర్లలో మరణించడం గమనార్హం. ఈ ఎన్‌కౌంటర్లలో ఇతర మావోయిస్టులు ఎవరూ మరణించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి రక్షణ వలయం ఉంటుంది. కేవలం ఈ ఇద్దరే చనిపోవడంపై పలువురు పట్టుకొని హత్య చేశారని ఆరోపిస్తున్నారు. మీడియాలో వచ్చిన అడెల్లు ఫొటోలను చూసి తమ తమ్ముడేనని నిర్ధారించుకున్నామని అడెల్లు సోదరుడు సీతారం తెలిపారు. ప్రభుత్వం మృతదేహాన్ని పంపిస్తే అంత్యక్రియలు చేసి, రుణం తీర్చుకుంటామన్నారు.

ఏడుగురి లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో శుక్రవారం ఏడుగురు మావోయిస్టులు లొంగిపోయారు. ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై వీరు లొంగిపోయినట్లు దంతెవాడ ఏఎస్పీ స్మితిక్ రాజనాల తెలిపారు.

చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- 8, 9 తేదీల్లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు ఆర్టీసీ 140 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, గోషామహల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈనెల 8, 9 తేదీల్లో జరిగే చేప ప్రసాదం పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. చేప ప్రసాదం నిర్వాహకుడు బత్తిని గౌరీశంకర్ గౌడ్‌తో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. రోగులు, వారి సహాయకుల కోసం భోజనం, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. చేప ప్రసాదం కోసం వచ్చే వారి కోసం ఆర్టీసీ 140 ప్రత్యేక బస్సులు నడుపుతుందని గ్రేటర్ హైదరాబాద్ రీజియన్ ఈడీ రాజశేఖర్ తెలిపారు. రైల్వేస్టేషన్లు, ముఖ్యమైన బస్టాండ్లతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

కడలిపాలయ్యే నీటినే వాడుకుంటాం: నిమ్మల

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నేతలు విజ్ఞులని.. సముద్రంలో కలుస్తున్న నీటినే వాడుతున్నామని గ్రహిస్తారని తాను వ్యక్తిగతంగా భావిస్తున్నట్లు ఏపీ జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వాస్తవాలేంటో వారికీ తెలుసని.. అయితే ఎన్నికలు, ఓట్ల వంటి రాజకీయ కారణాలతోనే వారు పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును వ్యతిరేకిస్తుండొచ్చని శుక్రవారం మీడియాతో అన్నారు. 'ప్రధాని మోదీ పోలవరం-బనకచర్ల అనుసంధానానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఏటా గోదావరి నుంచి 3,000 టీఎంసీల వరద సముద్రంలోకి వృధాగా పోతోంది. కడలి పాలవుతున్న ఈ3,000 టీఎంసీల్లో 200 టీఎంసీలను మాత్రమే నదుల అనుసంధానానికి ఉపయోగించుకుంటాం. దయచేసి దీనిని అర్థం చేసుకోవాలి' అని తెలంగాణ నేతలకు విజ్ఞప్తి చేశారు.

వృద్ధ దంపతుల దారుణ హత్య!

- ఫిజియోథెరఫీ కోసం వచ్చామంటూ వాచ్‌మన్‌కు చెప్పి ఇంట్లోకి వెళ్లిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు
- హత్యలు వారిపనే? మృతదేహాలపై కత్తిపోట్లు
- హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఘటన

రాజేంద్రనగర్, జూన్6 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లో ఘోరం జరిగింది. అపురూపంగా కట్టుకున్న ఇంట్లోకి మారిన నెలరోజుల్లోనే వృద్ధ దంపతులు దారుణహత్యకు గురయ్యారు. గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి వారిని విచక్షణారహితంగా పొడిచి చంపారు. రాజేంద్రనగర్ సర్కిల్ జనచైతన్య ఫేజ్-2లోని అబ్రిజ్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో ఈ దారుణ ఘటన జరిగింది. హతులు.. ఆ అపార్ట్‌మెంట్ యజమాని షేక్ అబ్దుల్లా (70), ఆయన భార్య రిజ్వానా (65). నెలక్రితం వరకు ఈ దంపతులు రెడ్‌హిల్స్‌లో నివాసం ఉండేవారు. షేక్ అబ్దుల్లా ఎస్బీఐలో మేనేజరుగా ఉద్యోగ విరమణ చేశారు. రిజ్వానా ఓ ప్రైవేటు కాలేజీలో హెడ్ ఆఫ్ ది ఇనిస్టిట్యూట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. జనచైతన్య ఫేజ్-2లో ఐదు వందల గజాల స్థలం కొనుగోలు చేసి ఐదంతస్తుల భవనాన్ని నిర్మించుకున్నారు. నెల రోజుల క్రితమే వారు ఇంట్లోకి మారారు. షేక్ అబ్దుల్లా దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఇద్దరు అమెరికాలో, మరో ఇద్దరు లండన్‌లో ఉంటున్నారు. గురువారం సాయంత్రం ఐదింటికి ఫిజియోథెరపీ చేయడానికి వచ్చామంటూ తలకు క్యాప్, ముఖానికి మాస్క్ ధరించి ఓ వ్యక్తి.. బురఖా ధరించి ఓ మహిళ షేక్ అబ్దుల్లా ఇంట్లోకి వెళ్లినట్లు వాచ్‌మన్ చెప్పాడు. దంపతుల హత్య వారిపనేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం రాత్రి 8గంటలకు వాచ్‌మన్ ఫోన్ చేసినా వృద్ధ దంపతులు తీయకపోవడంతో నిద్రపోయి ఉంటారని అతడు భావించాడు. మర్నాడు పదిగంటలకు వాచ్‌మన్ మంచినీళ్లు తెచ్చుకునేందుకు పైకి వెళ్లి చూడగా ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. అనుమానించిన అతడు అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే వారిని అప్రమత్తం చేయడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వారొచ్చి చూడగా రిజ్వానా బెడ్ మీద, షేక్ అబ్దుల్లా ఇంటి గడప వద్ద విగతజీవులుగా కనిపించారు. షేక్అబ్దుల్లా పొట్టలో ఏడు కత్తిపోట్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇంట్లో బీరువా తెరిచి ఉంది. ఆస్తి తాలూకు జిరాక్స్ పత్రాలు చిరిగిపోయి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దుండగులు దొంగతనం చేసేందుకు వచ్చి హత్యచేసి ఉంటారా? పథకం ప్రకారం హత్య చేసేందుకే వచ్చారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ చింతమనేని శ్రీనివాస్ చెప్పారు.

మావోయిస్టు నాయకులను కోర్టులో హాజరుపర్చాలి

- సుధాకర్, భాస్కర్‌లను పట్టుకుని హత్య చేశారు
- తెలంగాణ పౌర హక్కుల సంఘం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టు నాయకులు బండి ప్రకాష్, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్, మద్దెడు ఏరియా కార్యదర్శి సీటు రామన్న, డీసీ సభ్యులు మున్నా, సునీత, మహేష్‌లతోపాటు పదిమందికి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరుపరచాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ ప్రకటన విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని ఓ గ్రామంలో మావోయిస్టు నేతలు సుధాకర్, మైలారపు అడేళ్ల అలియాస్ భాస్కర్, బండి ప్రకాష్, దిలీప్, రామన్న, మున్నా, సునీత, మహేష్‌లతోపాటు పదిమందిని పోలీసులు ప్రాణాలతో పట్టుకున్నారన్నారు. సుధాకర్, భాస్కర్‌లను ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేశారని, పోలీసుల అదుపులో ఉన్నవారిని కూడా హత్య చేసే ప్రమాదముందని, వారికి ఎలాంటి హాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపర్చాలన్నారు. మావోయిస్టు పార్టీ ప్రకటించినట్టుగా కేంద్ర ప్రభుత్వం కూడా కాల్పుల విరమణ ప్రకటించి, శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు.

సుధాకర్‌ని పట్టుకొని చంపారు: బల్లా రవీంద్రనాథ్

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌ను బూటకపు ఎన్‌కౌంటర్లో చంపేశారని రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నేత బల్లా రవీంద్రనాథ్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'కేంద్రం బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపేయాలి. మావోయిస్టు నేతల మృత దేహాలను బంధువులకు అప్పగించాలి. కేంద్రం శాంతి చర్చలు జరపాలి' అని రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. కాగా, సుధాకర్ మృతదేహాన్ని భద్రపరిచేలా ఆదేశించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్(ఐఏపీఎల్) సభ్యుడు పిచ్చుక శ్రీనివాస్ ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం(ఏపీసీఎల్‌సీ) డిమాండ్ చేసింది.



నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఏడుగురి అరెస్టు

- రూ.63,62,000 విలువ చేసే విత్తనాలు సీజ్



సీజ్ చేసిన నకిలీ విత్తనాలను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందులను విక్రయిస్తున్న రెండు ముఠాల సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.63,62,000 విలువ చేసే నకిలీ విత్తనాలు, ఏడు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. పరకాల మండలంలోని నాగారంలో మాటోయిన తిరుపతి నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పరకాల పోలీసులు సంయుక్తంగా అతని ఇంటిపై దాడులు చేశారని తెలిపారు. తిరుపతి ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో నకిలీ పురుగుల మందులు తయారు చేస్తున్న గోదాంపై దాడి చేసి సుమారు రూ.57,44.000 విలువ చేసే నకిలీ విత్తనాలు, పురుగుల మందులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముఠా సభ్యులైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన జయదీప్ గౌతం, మెహదీపట్నానికి చెందిన ఆదిత్య, ములుగు జిల్లా గణపురానికి చెందిన అన్నం కుమారస్వామి, పరకాల మండలం నాగారానికి చెందిన తిరుపతిని అరెస్టు చేశామని తెలిపారు. దాంతోపాటు గీసుగొండలోని ఎలుకుర్తి హవేలి ప్రాంతంలో బెరిరెడ్డి మర్రిరెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేసి కిలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో సంగారెడ్డి జిల్లా చింతల చెరువు గ్రామానికి చెందిన తుమ్మ గండ్ల విజయ్, జోసెఫ్ ఇళ్లలో సోదాలు చేశారు. వారినుంచి రూ.6,18,000 విలువ చేసే 166 కిలోల నకిలీ విత్తనాలతో పాటు 800 లీటర్ల గడ్డి మందును స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశామని సీపీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, పరకాల, మామూనూరు పోలీసులను సీపీ అభినందించారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

కశ్మీర్ సందేశం

పహల్గాం ఉగ్రదాడి తరువాత, ప్రధాని నరేంద్రమోదీ తొలిసారిగా జమ్మూకశ్మీర్‌లో కాలూని, అనేక భారీ ప్రాజెక్టుల ఆరంభోత్సవాలతోపాటు పాకిస్థాన్‌కు ఘాటైన హెచ్చరికలు కూడా చేశారు. అంతర్జాతీయ మీడియా కూడా ఈ పర్యటనమీద ప్రత్యేక దృష్టిపెట్టినందువల్ల, మోదీ సందేశం ప్రపంచం నలుమూలలకూ చేరింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చీనాబ్ రైల్వేబ్రిడ్జిని ఆరంభించడంతోపాటు, మువ్వన్నెల జెండా చేతధరించి కదిలిన ఆ దృశ్యం శత్రువులకు ఒక బలమైన హెచ్చరిక. చినాబ్, అంజీ వంతెనలమీదుగా వందేభారత్ పరుగులు, అందులో ప్రధాని ప్రయాణం చూడచక్కని దృశ్యాలు.

రైలుమార్గం ద్వారా కశ్మీర్‌ను మిగతాదేశంతో అనుసంధానించే ఈ కృషిలో భాగంగా ఉదంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును ముప్పయ్యేళ్ళక్రితమే పి.వి. నరసింహారావు ప్రభుత్వం ఆమోదించిన విషయాన్ని కాంగ్రెస్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. కీర్తి మొత్తం తన ఖాతాలో వేసుకొనే లక్షణం మోదీకి ఉన్నది కనుకనే, కాంగ్రెస్ హయాంలో మొత్తం జమ్మూకాశ్మీర్‌లో జరిగిన రైల్వేలైన్ల అభివృద్ధినుంచి ఈ ప్రాజెక్టు అంకురార్పణవరకు ప్రతీదీ గుర్తుచేయాల్సివస్తున్నదని ఆ పార్టీ వాదన. 2002లో వాజపేయి ప్రభుత్వం దీనిని జాతీయప్రాజెక్టుగా ప్రకటించిన విషయాన్ని కూడా గుర్తుచేసింది. 2013నాటికే 135కిలోమీటర్ల రైల్వే లైన్ల నిర్మాణం జరిగిపోయిందని చెప్పుకుంది. ఇక, ప్రధాని తన ప్రసంగంలో జమ్మూకాశ్మీర్‌కోసం ఎన్నివేలకోట్లు ఖర్చుచేశామో, విద్యార్థులనుంచి రైతులవరకూ ప్రతీ ఒక్కరికీ ఎంత లబ్ధిని సమకూర్చామో చెప్పుకొచ్చారు. కశ్మీర్‌ను ఇకమీదట కూడా ఎంతో ప్రేమగా చూసుకోబోతున్నామని హామీ ఇవ్వడంతో పాటు, పాకిస్థాన్‌ను దులిపేయడానికి, హెచ్చరించడానికి ఈ పర్యటనను చక్కగా ఉపయోగించుకున్నారు. పొరుగుదేశం పర్యాటకానికి, పేదలకు వ్యతిరేకమని, ఎన్ని కుట్రలు చేసినా కశ్మీర్‌లో అభివృద్ధి ఆగదని మాటిచ్చారు.

భారీ ప్రాజెక్టుల ఆరంభోత్సవాలకంటే, ప్రధాని స్వయంగా పర్యటించడం, అభివృద్ధికీ సంక్షేమానికీ ఏ లోటూ ఉండదని హామీ ఇవ్వడం కశ్మీరీలకు ఉపశమనం కలిగించే విషయం. పహల్గాం దారుణం జరగగానే కశ్మీరీలను విలన్లుగా చిత్రీకరించే ఒక కుట్రపూరితమైన ప్రయత్నం జరిగింది. దాడిలో స్థానికుల సహకారం, భాగస్వామ్యం ఉన్నదన్న విపరీత దుష్ప్రచారం ద్వారా దేశప్రజలను కశ్మీరీలకు దూరం చేసే ప్రయత్నం జరిగింది. ఉగ్రదాడి వారి పొట్టగొడితే, ఈ వ్యతిరేక ప్రచారం వారిని మరింత కుంగదీసింది. మోదీ తన ప్రసంగంలో పోనీవాలా ఆదిల్ హుస్సేన్ పేరు ప్రత్యేకంగా ప్రస్తావించడం బాగుంది. పహల్గాంలో పర్యాటకులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలను వమ్ముచేయడానికి కొందరు సామాజిక మాధ్యమాల్లో ఈ పోనీవాలాలమీద కూడా విషం చిమ్మిన సంగతి తెలిసిందే.

ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన ప్రసంగంలో చిన్ననాటినుంచీ తాను కలలుగన్న చీనాబ్ వంతెన ఇప్పటికి సాకారమైనందుకు మోదీని ప్రశంసించడంతో పాటు, తన ప్రమోషన్ ప్రతిపాదనను కూడా ముందుకు తెచ్చారు. 2014లో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న తాను కేంద్రపాలిత ప్రాంత సిఎంగా డిమోట్ అయితే, రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న మనోజ్ సిన్హాకు లెఫ్టినెంట్ గవర్నర్‌గా ప్రమోషన్ వచ్చిందన్న చమత్కారం బాగుంది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా గురించి ఆయన అవకాశం దొరికినప్పుడల్లా కేంద్రానికి గుర్తుచేస్తూనే ఉన్నారు. వేదికమీద ఉన్న మోదీ ఈ మాటలు విననట్టు ఊరుకోవచ్చునుగానీ, సుప్రీంకోర్టులో తమ ప్రభుత్వమే ఈ మేరకు హామీపడిన విషయాన్ని విస్మరించకూడదు. మెహబూబ్ ముఫ్తీ ప్రభుత్వంతో తెగదెంపులు చేసుకోవడం నుంచి, 370అధికరణ రద్దుద్వారా ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చీల్చడం వరకూ తమ పదేళ్ళకాలంలో జమ్మూకశ్మీర్‌తో ఇష్టారీతిన వ్యవహరించిన విషయం మరిచిపోకూడదు. న్యాయస్థానానికి ఇచ్చిన హామీ మేరకు ఎన్నికలు నిర్వహించినప్పటికీ, పలు చట్టసవరణలతో గవర్నర్‌ను బలోపేతం చేయడమే తప్ప, రాష్ట్రహోదా ఊసెత్తడం లేదు. ఒమర్ ప్రభుత్వం గద్దెనెక్కేలోగా దాదాపు లక్షమందికి స్థానికతనివ్వడం, పెట్టుబడుల పేరిట సాగే వనరుల దోపిడీకి తలుపులు బార్లా తెరవడం స్థానికులకు ఆగ్రహం కలిగిస్తున్న విషయాన్ని గుర్తెరగాలి. పొరుగుదేశంమీద పైచేయి సాధించాలంటే ఇక్కడి ప్రజల మనసులు గెలవడం ముఖ్యం. అటల్‌జీ ప్రవచిత ఇన్‌సానియత్, కశ్మీరీయత్ వంటి ఉన్నతమైన పదాలు పునరుద్ఘాటిస్తున్నప్పుడు, స్థానికులతో వ్యవహారం కూడా సున్నితంగానే ఉండాలి. కశ్మీర్‌ను రైలుమార్గంతో మిగతాదేశానికి అనుసంధానించిన పాలకులు త్వరలోనే దానికి రాష్ట్రహోదా ఇచ్చి, స్థానికుల మనసులు గెలుచుకుంటారని ఆశిద్దాం.

ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడమెలా?

పార్లమెంటులో (3 ఫిబ్రవరి 2025న) నా ఉపన్యాసంలోను, అనంతరం విలేఖర్ల సమావేశంలోను గత ఏడాది నవంబర్‌లో మహారాష్ట్ర విధానసభ ఎన్నికలను నిర్వహించిన తీరు తెన్నుల పట్ల ఆందోళన వ్యక్తం చేశాను. మన దేశంలో ఎన్నికలు ఎప్పుడు, ఎక్కడ జరిగినా వాటి సక్రమ, నిష్పాక్షిక నిర్వహణను ప్రతిసారీ కానప్పటికీ అనేకసార్లు శంకించాను. చిన్నతరహా మోసం గురించి నేను మాట్లాడడం లేదు; మన జాతీయ సంస్థలను కైవసం చేసుకోవడంతో సహా సంభవిస్తున్న భారీ వంచనపై నా వ్యాకులతను వ్యక్తం చేస్తున్నాను. ఏమిటా వంచన? ఎన్నికల ఫలితాలను కుతంత్రంతో అనుకూలంగా మార్చుకోవడమే ఆ మోసం. అవును, మన ఎన్నికలలో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరుగుతోంది.



అంతకు ముందు కొన్ని ఎన్నికల ఫలితాలు విడ్డూరంగా ఉన్నా 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల ఫలితాలు అసాధారణంగా ఉన్నాయి. ఆ అనూహ్య ఫలితాలు నన్నూ, మరెందరినో దిగ్భ్రాంతి పరిచాయి. విజయంపై ఆశోపహతులయినవారు తెంపరితనంతో భారీ రిగ్గింగ్‌కు పాల్పడి సాధించిన ఫలితాలవి. ఆ వంచనను కప్పిపుచ్చేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ దాచిన వాస్తవాలు అన్నీ ఎలాంటి అనధికారిక మూలాధారాల ఆలంబనతో పనిలేకుండా అధికారిక గణాంకాల నుంచే బహిర్గతమయ్యాయి. అంచెలంచెలుగా ఆ అక్రమానికి పాల్పడేందుకు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలూ వెల్లడయ్యాయి.

ఆ ఎన్నికల అక్రమం ఎలా మొదలై, ఎలా పరిపూర్తి అయిందో విపులంగా చూద్దాం.

ప్రథమ పర్వం– ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించే అధికారులను నియమించే ప్యానెల్‌ను మార్చివేయడం: ఎన్నికల కమిషనర్లను ప్రధానమంత్రి, హోం మంత్రి 2:1 మెజారిటీతో ఫలప్రదంగా ఎంపిక చేయడాన్ని 2023 ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం సుసాధ్యం చేసింది. ఆ నియమకాలపై నిర్ణయం తీసుకునే త్రిసభ్య ప్యానెల్‌లో మూడో సభ్యుడు అయిన ప్రతిపక్ష నాయకుడి సూచన ప్రతిసారీ మెజారిటీ ఓట్లతో తిరస్కృతమవుతుంది. ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానెల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రికి స్థానం కల్పించిన నిర్ణయం న్యాయబద్ధమైనది కాదు. నైతిక సమంజసత్వం లోపించిన నిర్ణయమది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘంలో తటస్థ మధ్యవర్తిని తొలగించేందుకు ఉన్నత పదవులలో ఉన్నవారు సంబంధిత నియామకాల చట్టాన్ని మార్చేందుకు పనిగట్టుకుని ఎందుకు ప్రయత్నించారు?

ద్వితీయ పర్వం– నకిలీ ఓటర్లతో ఓటర్ల జాబితాను విస్తరించడం: 2019 విధానసభ ఎన్నికలలో మహారాష్ట్రలో నమోదైన ఓటర్ల సంఖ్య (ఎన్నికల సంఘం డేటా ప్రకారం) 8.98 కోట్లు. ఐదు సంవత్సరాల అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికలకు ఆ ఓటర్ల సంఖ్య 9.29 కోట్లకు పెరిగింది. అయితే కేవలం ఐదు నెలల తరువాత నవంబర్ 2024 విధానసభ ఎన్నికల నాటికి ఆ ఓటర్ల సంఖ్య 9.70 కోట్లకు పెరిగింది. ఐదు సంవత్సరాల పాటు అతి నెమ్మదిగా 31 లక్షలు పెరిగిన ఆ ఓటర్ల సంఖ్య కేవలం ఐదు నెలల్లో, అవును ఐదు నెలల్లోనే 41 లక్షలకు ఉరుకులు పరుగులు తీసింది! ఇదొక ఆశ్చర్యకరమైన పెరుగుదల. ఇదెంత అపురూపమైన విషయమంటే నమోదైన మొత్తం ఓటర్లు 9.70 కోట్ల మంది కాగా ప్రభుత్వ సొంత అంచనాల ప్రకారమే మహారాష్ట్రలోని మొత్తం వయోజనులు 9.54 కోట్ల మంది మాత్రమే!

తృతీయ పర్వం– జాబితాలో పెరిగిన ఓటర్ల సంఖ్య కంటే పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య ఎక్కువ కావడం: ఓటుహక్కు వినియోగించుకున్నవారికి, పరిశీలకులకు నవంబర్ 2024 మహారాష్ట్ర విధానసభ ఎన్నికల పోలింగ్ యథాప్రకారం మామూలుగానే కన్పించింది. ఎన్నికలు జరిగిన ప్రతిచోటా ఎప్పుడూ సంభవించినట్టుగానే ఆ దినం మహారాష్ట్రలో ఎల్లెడలా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఓటు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కేంద్రాలలోకి ప్రవేశించిన వారిని ఓటు వేసేంతవరకు అక్కడే ఉండిపోవడానికి అనుమతించారు. అయితే, ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద కొండవీడు చాంతాడులా బారులు తీరినట్లు గానీ, పెద్ద సంఖ్యలో గుమిగూడినట్లుగానీ పత్రికలు, ప్రసార సాధనాలు వెల్లడించనేలేదు. అయితే ఎన్నికల సంఘం భోగట్టా ప్రకారం ఓటు వేసేందుకు ఓటర్లు కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. సాయంత్రం 5 గంటల సమయానికి 58.22 శాతం మంది తమ ప్రజాస్వామ్య హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ వ్యవధి ముగిసిపోయినప్పటికీ ఓటు వేసేందుకు మరింత మంది పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు. మొత్తం ఓటర్లలో 66.05 శాతం మంది ఓటు వేశారని ఎన్నికల సంఘం ఆ మరుసటి ఉదయం వెల్లడించింది. పోలింగ్ వేళలు ముగిసిన తరువాత కూడా 7.83 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపింది. 7.83 శాతం పెరుగుదల 76 లక్షల ఓటర్లకు సమానం. మహారాష్ట్ర విధాన సభ ఎన్నికలలో అంతకు మునుపు ఎన్నడూ లేని విధంగా నవంబర్ 2024లో చాలా మంది నమోదిత ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ గడువు ముగిసే సమయానికి, ఆ తరువాత ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల సంఖ్య మధ్య తేడా 2009లో –0.50 శాతం; 2014లో 1.08 శాతం; 2019లో 0.54 శాతం కాగా 2024లో ఈ తేడా 7.83 శాతంగా ఉన్నది.

చతుర్థ పర్వం– బోగస్ ఓటింగ్‌తో బీజేపీకి సంఖ్యాధిక్యత: ఇంకా అనేక అవకతవకలు ఉన్నాయి. మహారాష్ట్రలో లక్ష పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే కేవలం 85 నియోజకవర్గాలలోని 12,000 పోలింగ్ బూత్‌లలో మాత్రమే అదనంగా పోలింగ్ జరిగింది. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ 85 నియోజకవర్గాలలోనే భారతీయ జనతా పార్టీ పరిస్థితి సజావుగా లేదు. ఈ మేరకు ఈ 12 వేల పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌లోను సాయంత్రం 5 గంటల తరువాత సగటున 600మందికి పైగా ఓటర్లు ఓటు వేశారు. ప్రతి ఓటరు ఓటు వేసేందుకు 1 నిమిషం సమయం అవసరమవుతుందనుకుంటే పోలింగ్ విధిగా పది గంటల పాటు కొనసాగవలసి ఉంటుంది. ఇలా ఎప్పుడూ జరగలేదు గనక ఈ పరిస్థితి ఒక ప్రశ్నకు తావిస్తున్నది. అదనపు ఓట్లు వేయడం ఎలా జరిగింది? ఈ 85 సీట్లలో అత్యధిక స్థానాలను ఎన్డీఏ కూటమి గెలుచుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎన్నికల సంఘం పేర్కొంది. యువజనులు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకున్నందునే పోలింగ్ శాతం పెరిగిందని, ఇదొక సానుకూల పరిణామమని వ్యాఖ్యానించింది. కావచ్చు. అయితే ఈ సానుకూల పరిణామం కేవలం 12,000 పోలింగ్ కేంద్రాలకే పరిమితమయింది. మిగతా 88,000 కేంద్రాలలో ఇది సంభవించలేదు. ఈ సానుకూల పరిణామానికి ఒక నిదర్శనాధ్యయనం (కేస్ స్టడీ) కమ్థీ నియోజకవర్గాన్ని తీసుకుందాం. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 1.36 లక్షల ఓట్లు రాగా బీజేపీకి 1.19 లక్షల ఓట్లు లభించాయి. 2024 విధానసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు 1.34 లక్షల ఓట్లు లభించాయి. లోక్‌సభ ఎన్నికలలో ఎన్ని ఓట్లువచ్చాయో విధానసభ ఎన్నికలలో ఇంచుమించు అదే సంఖ్యలో ఓట్లు లభించాయి. బీజేపీ సాధించిన ఓట్ల సంఖ్య 1.75 లక్షలు. లోక్‌సభ ఎన్నికలలో కంటే 56,000 ఓట్లు అధికంగా వచ్చాయి. లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య కాలంలో ఈ నియోజకవర్గంలో 35,000 మంది కొత్త ఓటర్లు అదనంగా నమోదయ్యారు. లోక్‌సభ ఎన్నికలలో ఓటువేయనివారు, 35 వేల మంది కొత్త ఓటర్లు అందరూ బీజేపీ పట్ల ఆకర్షితులయ్యారు. ప్రథమ పర్వం నుంచి చతుర్థ పర్వం దాకా చేపట్టిన చర్యల ఫలితంగా 2024 విధానసభ ఎన్నికలలో తాను పోటీ చేసిన 149 సీట్లలో 132ను బీజేపీ గెలుచుకున్నది విజయశాతం 89. విధానసభ ఎన్నికలకు ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ సాధించిన విజయశాతం 32 మాత్రమే.



మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్‌కు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలు చాలా సంవత్సరాలుగా అమలవుతున్నాయనే అనుమానాలు పలువురిలో ఉన్నాయి. రికార్డులను పరీక్షిస్తే రిగ్గింగ్ కార్యప్రణాళిక, దానిని అమలుపరచడంలో భాగస్వాములు అయిన వారి వివరాలు తప్పక బహిర్గతమవుతాయి. అయితే ఆ రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్షాలు, చైతన్యశీలురు అయిన పౌరులను అడుగడుగునా అడ్డుకోవడం జరుగుతోంది.

పంచమ పర్వం– సాక్ష్యాధారాలు రద్దు చేయడం! మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో అక్రమాలు జరిగినట్టు ప్రతిపక్షాలు ఘోషించాయి. న్యాయం చేయాలని కోరాయి. ఎన్నికల సంఘం మౌనం వహించింది. ఫిర్యాదు చేసిన విపక్షాల పట్ల దురుసుగా కూడా వ్యవహరించింది. 2024 లోక్‌సభ, విధానసభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ఓటర్ల ఫోటోలతో సహా అందుబాటులో ఉంచాలని అభ్యర్థించాయి. ఎన్నికల సంఘం ఈ విజ్ఞప్తులను వెన్వెంటనే త్రోసిపుచ్చింది. ఇంతకంటే ఘోరమైన విషయం మరొకటి ఉన్నది. విధానసభ ఎన్నికలు ముగిసిన నెల రోజుల అనంతరం ఒక పోలింగ్ కేంద్రంలో ఓటింగ్‌కు సంబంధించిన వీడియోలను, సీసీటీవీ ఫుటేజీని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని సంప్రదించిన తరువాత 1961 నాటి ఎన్నికల నిర్వహణ నియమావళిలోని సెక్షన్ 93(2)(ఎ)ను సవరించింది. ఈ సవరణతో సీసీటీవీ ఫుటేజీ, ఎలక్ట్రానిక్ రికార్డుల అందుబాటును పరిమితం చేసింది. ఇటీవల ఐడెంటికల్ / డూప్లికేట్ EPIC నంబర్లు బయటపడడంతో బోగస్ ఓటర్ల విషయమై ఆందోళన మరింత తీవ్రమయింది. ఇది, ఒక బృహత్ సమస్య సూచనప్రాయంగా వెల్లడి కావడమే.

మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్‌కు అనుసరించిన వ్యూహాలు, పద్ధతులు, ప్రక్రియలు చాలా సంవత్సరాలుగా అమలవుతున్నాయనే అనుమానాలు పలువురిలో ఉన్నాయి. రికార్డులను పరీక్షిస్తే రిగ్గింగ్ కార్యప్రణాళిక, దానిని అమలుపరచడంలో భాగస్వాములు అయిన వారి వివరాలు తప్పక బహిర్గతమవుతాయి. అయితే ఆ రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నించిన ప్రతిపక్షాలు, చైతన్యశీలురు అయిన పౌరులను అడుగడుగునా అడ్డుకోవడం జరుగుతోంది. మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో రిగ్గింగ్ అంత భారీగా ఎందుకు జరిగిందన్నది ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. పాలక, ప్రతిపక్ష కూటముల మధ్య పోటీ తీవ్రంగా ఉన్నది. విజయం అసాధ్యమేమోనని భయపడిన వారు ఎక్కడలేని తెంపరితనంతో అక్రమాలకు పాల్పడ్డారు. అయితే ఎన్నికలలో రిగ్గింగ్ క్రికెట్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ (పోటీని తారుమారు చేయడం) లాంటిదే. ఇటువంటి అక్రమాలకు పాల్పడినవారు ప్రజాస్వామిక సంస్థలకు ఎనలేని నష్టం చేస్తున్నారు. చక్కదిద్దలేని క్లిష్ట పరిస్థితులను కల్పిస్తున్నారు. ఎన్నికల ఫలితాలలో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు. ఇలా అయితే మన ప్రజాస్వామ్యం ఏమైపోను? రిగ్గింగ్‌తో ఎన్నికలలో గెలవడం ఏ ప్రజాస్వామ్య వ్యవస్థనూ దృఢతరం చేయదు.

■ రాహుల్‌గాంధీ
లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు

కులగణన ఎలా జరగాలి?

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయాన్ని అందించడంలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించనుంది. 2011లో జనగణనలో కులగణన చేస్తామని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించి, మరుసటి రోజే మళ్లీ అలా చేయబోమని, ప్రత్యేకించి సామాజిక, ఆర్థిక, కులగణన చేస్తామనీ చెప్పి, ఆ సోషల్ ఎకానమిక్ క్యాస్ట్ సెన్సెస్ రిపోర్టు కూడా బయటపెట్టలేదు. తర్వాత ఆ సెన్సెస్‌లో తప్పులున్నాయని చేతులు దులుపుకుని, రిపోర్ట్‌ను బుట్టదాఖలు చేసింది. అలా ఐదువేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఈసారైనా కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనను చిత్తశుద్ధితో చేయాలి. గత అనుభవాల దృష్ట్యా కులగణనను పారదర్శకంగా, నిజాయితీతో జరపాలి. ఈ దిశగా పలు పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంది.

1) కుల గణన సెన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోనే జరగాలి. గతంలో కాంగ్రెస్ సోషియో, ఎకానమిక్ కులగణన చేసినప్పుడు గ్రామీణ ప్రాంతంలో రూరల్ డెవలప్‌మెంట్ శాఖ, పట్టణ ప్రాంతంలో అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ వారు దాన్ని చేపట్టారు. వీరికి ఆ వృత్తి నైపుణ్యం లేక ఆ సెన్సెస్ తప్పుల తడకగా మారింది. సెన్సెస్ డిపార్ట్‌మెంట్‌లో శిక్షణ పొందిన అధికారుల ద్వారా జరిగితేనే ఈ ప్రక్రియకు ఒక విశ్వసనీయత ఏర్పడుతుంది. 2) కులగణన జనగణనలో అంతర్భాగం కావాలి. దీని కొరకు సెపరేట్ ఫారం ఉండకూడదు. ఉంటే కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. 3) ఈ సెన్సెస్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల లెక్కలు మాత్రమే గాక, అన్ని కులాల లెక్కలు తీయాలి. అదే విధంగా ముస్లింలలో, క్రిస్టియన్స్‌లో ఉన్న కులాల లెక్కలు కూడా గణించాలి. 4) ప్రతి కులానికి ఒక కోడ్ నంబర్ ఇవ్వాలి. లేదంటే అనేక కులాలు పుట్టుకు వచ్చి డాటా స్వచ్ఛత దెబ్బ తింటుంది. ఉదాహరణకు ఒకే కులాన్ని ఒకే రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఉదాహరణకు చాకలి వారిని కొన్ని ప్రాంతాల్లో రజక అంటారు, కొన్ని ప్రాంతాల్లో ధోబి అంటారు. వీరందరినీ ఒకే కోడ్ నంబర్‌లోకి తీసుకొచ్చినట్టయితే కులాల లెక్కలు సరిగ్గా వస్తాయి. అలాగే ఓసీ కులాలకు కూడా కోడ్ నంబర్ ఇవ్వాలి. రాష్ట్రాలవారీ కులాల లిస్టులను తయారుచేసి వాటికి కోడ్ నెంబర్ ఇచ్చి పేపర్ ప్రకటనలు ఇవ్వాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత తుది లిస్టును ప్రకటించాలి. ముస్లిం, క్రిస్టియన్ మతాలలోని కులాల క్రోడీకరణ జరగాలి. 5) ప్రస్తుతమున్న సెన్సెస్ ఫారంలో కాలం నెంబర్ 8లో కులాల వివరాలు తెలియపరచవలసి ఉంటుంది. కాలం నెంబర్ 8లో ఎస్సీ అయితే ఎస్సీ అని టిక్ చేసి కింద 8Aలో ఏ కులమో తెలియచేయాలి. అదేవిధంగా ఎస్టీ అయితే ఎస్టీ అని టిక్ చేసి క్రింద 8Bలో తెగ వివరాలు చెప్పాలి. ఇక్కడ బీసీ లేదా ఓబీసీ అనే కాలమ్ సృష్టించాలి. దాని కింద బీసీ, ఓబీసీ అనే కాలమ్స్ ఉండాలి. ఎందుకంటే, ఉదాహరణకు తెలంగాణలో 134 కులాలు బీసీ లిస్టులో ఉన్నాయి. కాని కేంద్ర ఓబీసీ లిస్టులో 86 కులాలు మాత్రమే ఉన్నాయి. మరి అక్కడ వ్యక్తి ఏ విధంగా సమాధానం ఇవ్వాలి అన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. రాజ్యాంగ రీత్యా ఆర్టికల్ 342A1 ప్రకారం కేంద్రం తన స్వంత ఓబీసీ లిస్ట్‌ను కలిగి ఉండవచ్చును. అదే విధంగా రాష్ట్రాలు ఆర్టికల్ 342A3 ప్రకారం తమ స్వంత లిస్ట్ కలిగి వుండవచ్చు. అందువలన ఈ రెండు కాలమ్స్ ఉండటం శ్రేయస్కరం. అయితే మొదట ఈ లిస్టులు పత్రికలలో ప్రకటించాలి. అలాగే ఓసీ కాలమ్ కూడా సృష్టించాలి. అక్కడ కూడా కింద కులాల లిస్ట్ కోడ్ నంబర్లతో ఉండాలి. ముస్లిం, క్రిస్టియన్ ఇతర మతాలకు కూడా కాలమ్స్ సృష్టించాలి. వారి కులాలను కూడా క్రోడీకరించి కోడ్ నంబర్స్ ఇవ్వాలి. 6) ప్రస్తుత సెన్సెస్ ఫార్మేట్‌లో 29 కాలమ్స్ మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆర్థికపరమైన డాటా పెద్దగా సేకరించడం లేదు. కేవలం కుల డాటా సేకరించి భూమి, ఆర్థిక వివరాల డాటా సేకరించకపోతే బీసీల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం తేటతెల్లం కాదు. కాబట్టి సెన్సెస్ కాలమ్స్ కొన్ని పెంచాలి. అదేవిధంగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్ సమాచారాన్ని కూడా సేకరించాలి. 7) ఈ సెన్సెస్‌ను జాతీయ జనాభా రిజిస్టర్‌కు లింక్ చేయకుండా ఉంటే మంచిది. లేనట్టయితే అనవసర రాజకీయాలకు దారితీసి డాటా సమగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. 8) సెన్సెస్‌లో డాటా సేకరణ డిజిటల్‌గాను, మాన్యువల్‌గాను కూడా జరగాలి. కొండ ప్రాంతాలలో సెల్ ఫోన్ సిగ్నల్స్ తక్కువ కాబట్టి మాన్యువల్ సెన్సెస్ ఉపయుక్తం. 9) సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచాలి. అది వ్యక్తి ప్రైవసీకి భంగం కలగకుండా భద్రపరచాలి. 10) సెన్సెస్ ఆఫ్ ఇండియా ఆక్ట్ 1948 ద్వారా సెన్సెస్ జరుగుతుంది. ఇప్పుడు అన్ని మతాలలోని కులాల జనగణన జరుగుతుంది కాబట్టి ఆ సెన్సెస్ చట్టాన్ని కూడా అవసరమైన మేరకు సవరించాలి. అదేవిధంగా ఒక స్వతంత్ర సెన్సెస్ కమిషన్ వేసి ప్రజాభిప్రాయం ద్వారా ఫార్మేట్స్‌ను రూపొందించి చట్టంలో కావాల్సిన మార్పులు చేర్పులు చేసి ఈ కులగణనను చేయాలి. 11) భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే అన్ని సర్వేలలో కూడా ఓబీసీ కాలమ్స్ చేర్చి వివరాలు సేకరించాలి. 12) కేంద్ర ప్రభుత్వం కులగణన షెడ్యూల్‌కు ఎంతోముందునుంచే తగు ప్రచారాన్ని కల్పించాలి, ప్రజలను సమాయత్త పరచాలి.



కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవికత. కులం ఎక్కడ ఉందో అక్కడ వివక్ష కూడా ఉంటుంది. అందుకే ఈ కులగణన ఒక రోగ నిర్ధారణ పరికరం. రోగం సరిగా తేలితే అప్పుడు చికిత్స సులభం. కాబట్టి ఈ ప్రక్రియ మొత్తం పారదర్శక విధానాలతో జరగాలి.

కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవికత. కులం ఎక్కడ ఉందో అక్కడ వివక్ష కూడా ఉంటుంది. అందుకే ఈ కులగణన ఒక రోగ నిర్ధారణ పరికరం. రోగం సరిగా తేలితే అప్పుడు చికిత్స సులభం. కాబట్టి ఈ ప్రక్రియ మొత్తం పారదర్శక విధానాలతో జరగాలి. భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా, మానవ అభివృద్ధి సూచీలో 130వ ర్యాంకులోనే మిగిలిపోయింది. ఈ కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక, అవసరమైతే రాజకీయ అంశాలను లెక్కించి రాబోయే కాలంలో తగు విధాన నిర్ణయాలు, ప్రణాళికలు రచించి మానవాభివృద్ధి సూచికలలో, ముఖ్యంగా విద్యా ఆరోగ్యాలలో మన స్థానాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

• టి. చిరంజీవులు
రిటైర్డ్ ఐఏఎస్, బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ ఛైర్మన్

దళితులను దళితులే ఎన్నుకోవాలి

భారతదేశ ప్రజాస్వామ్యం ప్రపంచంలో అతి పెద్దదిగా ప్రశంసలు అందుకుంటోంది. కానీ ఈ దేశపు అత్యంత పీడితులు అయిన దళితులకు ఇది నిజమైన రాజకీయ అధికారాన్ని ఇప్పటిదాకా నిరాకరించింది. ఈ నిరాకరణ మూలాల్లో ప్రధానమైనది డా. బి.ఆర్. అంబేడ్కర్ ప్రతిపాదించిన 'ప్రత్యేక ఎన్నికల నియోజకవర్గాలు'. ఈ ప్రతిపాదన గతంలో దళితులకు స్వీయ ప్రాతినిధ్యం, స్వయం నిర్ణయాధికారాన్ని హామీ ఇచ్చింది.

1930ల ప్రారంభంలో లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో 'డిప్రెస్డ్ క్లాసెస్' (ఇప్పటి షెడ్యూల్డ్ కులాలు లేదా దళితులు)కి రిజర్వుడు స్థానాలు కాకుండా ప్రత్యేక ఎన్నికల అవసరముందని అంబేడ్కర్ వాదించారు. ఈ విధానంలో దళిత ప్రతినిధులను కేవలం దళిత ఓటర్లే ఎన్నుకుంటారు. తద్వారా వారు తమ దళిత సమాజం పట్ల బాధ్యత, జవాబుదారీతనం కలిగిన నేతలవుతారు. ఇది విభజన కోసం కాదు– విముక్తి కోసం, శతాబ్దాలుగా కొనసాగుతున్న కుల ఆధిపత్య వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన మార్గంగా అంబేడ్కర్ వాదించారు.

1932లో బ్రిటిష్ ప్రభుత్వం 'కమ్యూనల్ అవార్డ్'లో ఈ ప్రతిపాదనను అంగీకరించింది. దాంతో ముస్లింలు, సిక్కులు, ఇండియన్ క్రిస్టియన్లు, ఆంగ్లో–ఇండియన్లు, యూరోపియన్లు, ముఖ్యంగా దళితులకు ప్రత్యేక ఎన్నికల హక్కు ఇచ్చింది. కానీ కొన్ని వారాల లోపే గాంధీజీ దీన్ని వ్యతిరేకిస్తూ ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించడంతో అంబేడ్కర్ ఒత్తిడికి లోనై పూనా పాక్ట్ అనే ఒప్పందానికి అంగీకరించారు. దళితులకు స్వతంత్ర రాజకీయ ప్రాతినిధ్యాన్ని, నిర్ణయాధికారాన్ని పొందటానికి అవకాశం ఉన్న ప్రత్యేక ఎన్నికల పద్ధతిని ఈ ఒప్పందం అంతమొందించింది.

ప్రత్యేక ఎన్నికల నియోజకవర్గాల పద్ధతిలో, నిర్దిష్ట సముదాయానికి చెందిన ఓటర్లు మాత్రమే తమ సముదాయానికి చెందిన ప్రతినిధులను ఎన్నుకుంటారు. దళిత సమాజం నుంచి వారే తమ నాయకులను ఎన్నుకునే అవకాశం కలిగేది. ఇలా ఎన్నికైన దళిత ప్రతినిధులు ఆ ఓటర్లకు మాత్రమే జవాబుదారీగా ఉండేలా చేస్తుంది, ఇది వారిలో నుంచి నిజమైన దళిత నాయకత్వాన్ని వెలికి తీయగలుగుతుంది.

దీనికి విరుద్ధంగా, స్వాతంత్ర్యానంతర భారత దేశంలో ఉమ్మడి ఓటర్ల వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఇది ఆధిపత్య కులాలతో సహా నియోజకవర్గంలోని ఓటర్లందరూ రిజర్వుడు స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థులకు ఓటు వేయడానికి అనుమతిస్తుంది. ఫలితంగా, దళిత ప్రతినిధులు తరచుగా తమ రాజకీయ మనుగడ కోసం దళితేతర ఓటర్లపై ఆధారపడుతూ, తమ సమాజానికి బదులుగా పార్టీల నాయకులకు విధేయులైపోతున్నారు. ఇది వారి స్వయంప్రతిపత్తిని గణనీయంగా తగ్గిస్తోంది.

శతాబ్దాల పాటు కులవ్యవస్థ ఆధిపత్యానికి, అణిచివేతకు లోనైన దళితుల విముక్తికి రాజకీయ అధికారమే మార్గమని డా. అంబేడ్కర్ విశ్వసించారు. ఈ దిశగా ఆయన ఐదు ప్రధాన సూత్రాల ఆధారంగా ప్రత్యేక ఎన్నికల పద్ధతిని ప్రతిపాదించారు.

రాజకీయ స్వాతంత్ర్యం– దళిత నాయకులు తమ ఓటర్లకు బాధ్యత కలిగి, జవాబుదారిగా ఉండాలి కాని చారిత్రకంగా రాజకీయ అధికారాన్ని నియంత్రించిన ఆధిపత్య కులాల పట్ల కాదు. లేనిపక్షంలో వారు కేవలం ఆధిపత్యాన్ని, అణిచివేతని కొనసాగించేవారే అవుతారు; నిజమైన ప్రాతినిధ్యం– అగ్ర కులాల అంచనాలను తీర్చడానికి ఎంపిక చేయబడిన నామమాత్ర (టోకెన్) దళిత అభ్యర్థులు కుల అన్యాయాన్ని సవాలు చేస్తారని ఆశించలేం. దళిత ప్రాతినిధ్యం అంటే దళిత ప్రజల జీవిత అనుభవాలను, పోరాటాలను దృఢంగా ప్రతిబింబిస్తూ, ప్రాతినిధ్యం వహించాలి; నాయకత్వ వికాసం– దళిత సమాజంలో ఇది అత్యంత ముఖ్యమైనది. ప్రత్యేక ఎన్నికల వ్యవస్థ ద్వారా నిజమైన దళిత గొంతులకు స్థానం కల్పించడం ద్వారా, సమాజ మార్పు పట్ల నిబద్ధత కలిగిన, ఆత్మవిశ్వాసంతో కూడిన, సమర్థవంతమైన నాయకులను అభివృద్ధి చేయడం దీనితో సాధ్యమవుతుంది; చట్టబద్ధ సాధికారత– కుల వివక్షను నిషేధించే బలమైన, అమలులో పెట్టగలిగే చట్టాలను రూపొందించేందుకు, పరిపాలన వ్యవస్థలో స్వతంత్ర దళిత నాయకత్వమే తోడ్పడగలదు; సాంస్కృతిక గౌరవం– అంబేడ్కర్ దీని మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. రాజకీయ అధికార సాధన ద్వారా దళిత సమాజాలు, తీవ్ర కుల వివక్షతో కూడిన సమాజం ద్వారా తమలో తాము పెంపొందించుకొని, జీర్ణించుకున్న ఆత్మన్యూనత భావాలను ఎదుర్కొని అధిగమించగలవు.



1909 నుంచి 1947 వరకు ముస్లింలు, సిక్కులు, ఆంగ్లో–ఇండియన్లు ప్రత్యేక ఎన్నికల ప్రయోజనాన్ని అనుభవించారు. 2020 వరకు కూడా ఆంగ్లో–ఇండియన్లకు నామినేటెడ్ సీట్లు ఉండేవి. దళితులకు మాత్రమే ఇచ్చిన హక్కును తొలగించి ఒక మంచి అవకాశాన్ని అందకుండా చేశారు.

అంబేడ్కర్ ప్రత్యేక నియోజకవర్గాల ప్రతిపాదన ఏ రకమైన విభజన కాదు. వాస్తవానికి అది శక్తివంతమైన విధానంగా అన్ని వర్గాలను కలుపుకునే లక్ష్యంతో కూడినది. దళిత ఓటర్లు ద్వంద్వ ఓటును వినియోగించుకుంటారు. ఒకటి– వారి స్వంత సమాజ ప్రతినిధిని ఎంచుకోవడానికి, మరొకటి– విస్తృత జాతీయ ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికలలో అందరితో పాటు పాల్గొంటారు. ఈ ప్రతిపాదన దళితులకు చాలా కాలంగా నిరాకరించబడిన అధికారం, గౌరవంతో దళితులను సమగ్ర ప్రజాస్వామ్యంలో చేర్చే ఒక సమన్వయ మార్గం.

1909 నుంచి 1947 వరకు ముస్లింలు, సిక్కులు, ఆంగ్లో–ఇండియన్లు ప్రత్యేక ఎన్నికల ప్రయోజనాన్ని అనుభవించారు. 2020 వరకు కూడా ఆంగ్లో–ఇండియన్లకు నామినేటెడ్ సీట్లు ఉండేవి. దళితులకు మాత్రమే ఇచ్చిన హక్కును తొలగించి ఒక మంచి అవకాశాన్ని అందకుండా చేశారు. ఆధిపత్య కులాలు సంయుక్త ఎన్నికల ద్వారా తమ ఆధిపత్యాన్ని, రాజకీయ నియంత్రణ శక్తిని నిలుపుకున్నాయి.

1950 తర్వాత ప్రత్యేక ఎన్నికలు పూర్తిగా రద్దయ్యాయి. రాజ్యాంగం ప్రకారం, ఆర్టికల్ 330 ద్వారా షెడ్యూల్డ్ కులాలకు, వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించారు. కానీ, సంయుక్త ఎన్నికల విధానం కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ సహా ప్రధాన పార్టీలన్నీ తమకు విధేయత చూపే దళిత అభ్యర్థులను ఎంపిక చేయడం ప్రారంభించాయి. ఆ విధంగా దళిత ప్రాతినిధ్యం నిజానికి దూరంగా, కేవలం ప్రతీకాత్మకంగా మారింది. అసలైన స్వయంప్రతిపత్తి కోల్పోయి, ఇప్పుడు కేవలం టోకెనిజం మాత్రమే మిగిలింది. అప్పట్లో ప్రతిపాదించిన రెండు దశల ఎన్నికల విధానాన్ని అమలు చేయకుండా వదిలేసిన భారత రాజ్యాంగ వ్యవస్థ, దళిత రాజకీయ స్వయం ప్రాతినిధ్యాన్ని ఎప్పటికీ కోల్పోయేలా చేసింది. నిజానికి, ముందుగా ప్రతిపాదించబడిన రెండు దశల ఎన్నికల ప్రక్రియ జాతీయ ఐక్యతను కాపాడుతూ దళిత రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడగలిగే ఒక రాజీ. అయినప్పటికీ, స్వతంత్ర భారత దేశంలో దీనిని ఎప్పుడూ ఆమోదించలేదు, దీనికి కారణం ఖర్చు, పరిపాలనా సంక్లిష్టత, రాజకీయ ప్రతిఘటనలను సాకుగా చూపెట్టారు. రాజకీయ పార్టీలు దళిత అభ్యర్థులను తామే ఎంపిక చేయడం ద్వారా రాజకీయ నియంత్రణను నిలుపుకున్నాయి.

దశాబ్దాలుగా రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, దళితుల గొంతులు అణగదొక్కబడ్డాయి. చాలా మంది దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయా పార్టీ శ్రేణులు, పద్ధతులతో నిర్బంధించబడ్డారు. వీరు దళిత ప్రయోజనాల కోసం స్వతంత్రంగా ఆలోచించలేరు, పనిచేయలేరు. పార్టీలచే దళిత నాయకత్వాలు కబ్జా చేయబడ్డాయి. అసలైన దళిత గొంతులు మూగబోయేలా చేశారు.

2030లో రాజకీయ రిజర్వేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో, అంబేడ్కర్ మౌలిక ప్రతిపాదనను పునఃపరిశీలించాల్సిన సమయం వచ్చింది. ప్రత్యేక నియోజకవర్గాలు లేదా కనీసం దళితుల నేతృత్వంలోని అభ్యర్థుల ముందస్తు ఎంపిక, దళితులకు రాజకీయ గౌరవం, దళిత నాయకులకు జవాబుదారీతనాన్ని పునరుద్ధరించగలదు.

◆ లెల్లే సురేష్
దళిత కవి, సాంస్కృతిక కార్యకర్త

నకిలీల ఆటకట్టు

- రూ.63 లక్షల విలువ చేసే విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందుల సీజ్
- ఏడుగురి అరెస్టు.. ఏడు సెల్‌ఫోన్ల స్వాధీనం



సీజ్ చేసిన నకిలీ విత్తనాలను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వివిధ కంపెనీల పేరుతో కాలంచెల్లిన పురుగు మందులతో పాటు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.63 లక్షల 62 వేల విలువ చేసే కాలం చెల్లిన పురుగు మందులు, నకిలీ విత్తనాలు, ఏడు సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా వున్నాయి.. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పరకాల పోలీసులు సంయుక్తంగా పరకాల మండలంలోని నాగారంలో మాబోయిన తిరుపతి ఇంటిపై దాడులు చేశారు. తిరుపతి ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో నకిలీ పురుగు మందులు తయారు చేస్తున్న గోదాముపై దాడి చేసి సుమారు రూ.57 లక్షల 44వేల విలువ చేసే నకిలీ, కాలంచెల్లిన పురుగుల మందులను స్వాధీనం చేసుకొని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన జయదీప్ గౌతం, మెహదీపట్నంకు చెందిన ఆదిత్య, ములుగు జిల్లా గణపురానికి చెందిన అన్నం కుమారస్వామి, పరకాల మండల నాగారానికి చెందిన తిరుపతిని అరెస్టు చేశారు. అదే విధంగా గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎలుకుర్తి హవేలి ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ స్థానిక పోలీసులు బెరిరెడ్డి మర్రిరెడ్డి ఇంటిపై దాడి చేసి కిలో నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకొని నిందితుడు ఇచ్చిన సమాచారంతో సంగారెడ్డి జిల్లా చింతల చెరువు గ్రామానికి చెందిన తుమ్మగండ్ల విజయ్, జోసెఫ్ ఇళ్లలో సోదాలు చేయగా రూ.6 లక్షల 18 వేల విలువ చేసే 166 కిలోల నకిలీ విత్తనాలతో పాటు 800 లీటర్ల గడ్డి మందును స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేశామని సీపీ వెల్లడించారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, పరకాల, మామునూరు ఏసీపీలు, ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులను సీపీ అభినందించారు.



కేయూలో నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ, ప్రజా సంఘాల నేతలు

కేయూలో ఉద్రిక్తత

- పౌరహక్కుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు
- తీవ్ర నిరసన తెలిపిన ప్రజాసంఘాల నేతలు
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి : పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

7

ఆటలు ఆడేది ఎలా!?

కలగానే మిగులుతున్న క్రీడా పాఠశాల ఏర్పాటు

- చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ప్రతిపాదన
- స్పోర్ట్స్ స్కూల్ లేక నష్టపోతున్న విద్యార్థులు
- ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన దుస్థితి
- రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌తోనే సరిపెట్టిన సర్కారు
- నీటిమూటలైన ప్రజాప్రతినిధుల హామీలు





హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రీడా పాఠశాల లేకపోవడం క్రీడాకారులకు లోటుగా మారింది. ఇక్కడ ప్రాంతీయ స్పోర్ట్స్ హాస్టల్ ఉన్నందువల్ల స్పోర్ట్స్ స్కూల్ అవసరం లేదనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉన్నట్టు కనిపిస్తోందని క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు. హనుమకొండలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు అన్ని అర్హతలున్నాయి. హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో రూ.8కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునికమైన సింథటిక్ ట్రాక్, జేఎన్‌ఎస్ స్టేడియంలో వివిధ ఆటల కోర్టులు, రీజినల్ స్పోర్ట్స్ బాలుర, బాలిక హాస్టల్, ఇండోర్‌స్టేడియం, జిమ్నాస్టిక్‌హాల్, బాక్సింగ్ సెంటర్, క్రికెట్ పిచ్ అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు స్టేడియంలో విజయవంతంగా నిర్వహించిన ట్రాక్ రికార్డు ఉంది. స్పోర్ట్స్‌హాస్టల్‌లోని పిల్లలు ఈ స్టేడియంలో నాణ్యమైన శిక్షణ పొందుతున్నారు. ఈస్టేడియంలో వివిధ ఆటల్లో శిక్షణ పొందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించారు. ఇన్ని సానుకూలతలను ఉన్నా ఇక్కడ క్రీడాపాఠశాల లేకపోవడం ఇబ్బందిగా కనిపిస్తోంది.

క్రీడా పాఠశాల ఏర్పాటుకు అవసరమైన సుమారు 25 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. జక్కలొద్దిలో 70 ఎకరాల విస్తీర్ణంలో క్రీడాగ్రామం ఏర్పాటుకు కృషి చేస్తామని, ఇందులో భాగంగానే ఇక్కడ క్రీడా పాఠశాల ఏర్పాటవుతుందని ఇచ్చిన హామీలు కూడా సాకారం కాలేదు. జక్కలొద్దిలోని ప్రభుత్వ భూమిలో పాఠశాలను ఏర్పాటు చేయడానికి అన్ని అనుకూలతలు ఉన్నాయి. నగరం నడిబొడ్డున అయితే కాస్తంత సర్దుబాటుతో జేఎన్‌ఎస్ స్టేడియంలో కూడా ఏర్పాటు చేయవచ్చునని క్రీడా సంఘాలు చెబుతున్నాయి. ప్రస్తుతం స్టేడియంలో అందుబాటులో ఉన్న

అందుబాటులో స్థలం

స్థలంలోనే జీప్లస్-4 భవనాన్ని నిర్మించి అందులో పాఠశాలను ఏర్పాటు చేయవచ్చు. స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఎలాగూ అందుబాటులో ఉంది. పక్కనే ఇండోర్ స్టేడియం, వివిధకోర్టులు కూడా ఉన్నాయి. అయితే స్టేడియంలోకి వర్తమాన క్రీడాకారులతో పాటు వాకర్లు, స్పోర్ట్స్ హాస్టల్ విద్యార్థులు వస్తుంటారు కనుక క్రీడాపాఠశాల విద్యార్థులకు కొంత అసౌకర్యంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ దృష్ట్యా నగరంలో లేదా, శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో, లేదా జక్కలొద్దిగానీ క్రీడాపాఠశాల ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

క్రీడా పాఠశాలలో..

క్రీడా పాఠశాలలో ఔట్‌డోర్ స్టేడియం మల్టీపర్పస్, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ హాస్టల్, హెల్త్ సెంటర్, తరగతి గదులు, జిమ్ సెంటర్, జిమ్నాస్టిక్ హాల్, వివిధ కోర్టులు, సింథటిక్ ట్రాక్ ఇతరత్రా సౌకర్యాలు ఉంటాయి. ప్రతీ సంవత్సరం 80 మందికి ప్రవేశాలు ఉంటాయి. 4వ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ వరకు ఇందులో క్రీడల్లో శిక్షణ ఇస్తారు. బాలురు, బాలికలకు విడివిడిగా బాకులు, కోచ్‌లకు స్టాఫ్‌క్వార్టర్లు, ఆధునాతనమైన కిచెన్, విశాలమైన డైనింగ్ హాల్, క్రీడల్లో మెళకువలు తెలుసుకునేందుకు ఆడియో లైబ్రరీ, జాతీయ, అంతర్జాతీయ క్రీడానిపుణులతో ఆన్‌లైన్‌క్లాసుల నిర్వహణకు డిజిటల్ తరగతులు ఉంటాయి. క్రీడా పాఠశాలలో చేరిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, వారిలోని క్రీడా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు గుర్తించే ట్రాక్ రికార్డుల నిర్వహణ వ్యవస్థ ఉంటుంది. మోటివేషన్‌పై ప్రధానంగా దృష్టి సారిస్తారు.

చదువుతోపాటు క్రీడలు

చదువుతో పాటు క్రీడల్లో మెరికల్లా తయారు కావాలనుకునే చిన్నారులకు (మిగతా 8వ పేజీలో)



కేయూ దూరవిద్యలో

16 కొత్త కోర్సులు

- ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు
- సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేస్తే పీజీ జియాలజీలో అడ్మిషన్లు
- కేయూ అకడమిక్ స్టాండింగ్ కమిటీ నిర్ణయాలు

కేయూ క్యాంపస్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సైన్స్ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణత సాధిస్తే జియాలజీ కోర్సులో పీజీ చదివేందుకు అవకాశం కల్పిస్తూ శుక్రవారం కేయూ అకడమిక్ స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పుల్లూరి సుధాకర్, మల్లం నవీన్, సుకుమారి, చిర్ర రాజుగౌడ్, డీన్లు ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, హన్మంతు, ఎం.శ్రీనివాస్, మంచాల సదానందం, కట్ల రాజేందర్, రాంనాథ్‌కిషన్‌లతో పాటు ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, నరసింహచారి, ప్రొఫెసర్ కృష్ణవేణి, అమరవేణి, రమణ, బిక్షాలుతో పాటు బీవోఎస్ చైర్మన్లు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకడమిక్ స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కేయూ దూరవిద్య కేంద్రంలో (ఎస్‌డీఎల్‌సీఈ) నూతనంగా తీసుకువస్తున్న 16 సర్టిఫికెట్స్, డిప్లొమా కోర్సులకు ఆమోద ముద్ర వేసింది.

బీఫార్మసీ నాన్ సీబీసీ సిలబస్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే ఇంజనీరింగ్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ప్రతిపాదించారు. యూజీ, పీజీతోపాటు న్యాయశాస్త్రం

మిగతా 8వ పేజీలో...

తహసిల్దార్ శ్రీపాల్‌రెడ్డి హఠాన్మరణం

- భూ భారతి సదస్సుకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు
- ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూత



రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ తహసీల్దార్ కర్ర శ్రీపాల్ రెడ్డి(46) గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. కుటుంబసభ్యులు, ఉద్యోగుల కథనం ప్రకారం.. హనుమకొండలోని 'కుడా' కాలనీలో నివాసం ఉండే శ్రీపాల్‌రెడ్డి ఉదయం నిద్రలేచిన అనంతరం భూ భారతి సదస్సుకు వెళ్లాలని బ్రేక్‌ఫాస్ట్ సిద్ధం చేయమని కుటుంబసభ్యులకు చెప్పాడు. అయితే అంతలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు సమీపంలో ఉండే వైద్యుడిని ఆశ్రయించి సీపీఆర్ చేసి సుబేదారిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీపాల్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన శ్రీపాల్‌రెడ్డి.. హనుమకొండ, వరంగల్ జిల్లాలల్లో ఆర్‌ఐ, డీటీగా విధులు నిర్వర్తించి తహసీల్ధార్‌గా పదోన్నతిపై అదిలాబాద్‌కు వెళ్లారు. ఎన్నికల సమయంలో హనుమకొండ తహసీల్ధార్‌గా బాధ్యతలు చేపట్టి విధుల్లో కొనసాగుతున్నారు. శ్రీపాల్ రెడ్డి మరణం విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు, నివాళులర్పించారు.

సాంకేతికతలో భారత్ ముందంజ

- రక్షణ రంగంలో శక్తిని ప్రపంచానికి చాటింది
- రక్షణరంగ నిపుణుడు జి.సతీష్‌రెడ్డి
- ఘనంగా ఎస్సార్ యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవం
- ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణికి గౌరవ డాక్టరేట్ ప్రదానం



ఎస్సార్‌యూ స్నాతకోత్సవంలో పాల్గొన్న సతీశ్‌రెడ్డి, వరదారెడ్డి, కీరవాణి..



ఎం.ఎం.కీరవాణికి డాక్టరేట్ అందజేస్తున్న రక్షణరంగ నిపుణుడు జి.సతీస్ రెడ్డి, ఛాన్సలర్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇండియాలో విద్యారంగం వేగంగా అభివృద్ధి చెందుతుండగా.. యేటా 1.4 మిలియన్ల ఇంజనీర్లు తయారవుతున్నారని,. పబ్లికేషన్స్, పీహెచ్‌డీలపరంగా భారత్ 3వ స్థానంలో ఉందని ఏపీ ఎయిరోస్పేస్, డిఫెన్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు జి.సతీష్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో 3వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఎస్సార్‌యూ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

క్వాంటం టెక్నాలజీ, కృత్రిమ మేధస్సులాంటి రంగాల్లో భారత్ అగ్రగామిగా ఉందని, రక్షణ రంగంలో డ్రోన్స్, రాడర్లు, మిస్సైల్ వ్యవస్థల ద్వారా భారత్ శక్తిని ప్రపంచానికి చాటిందని తెలిపారు. గత ఏడాది రూ.24 వేల కోట్ల విలువైన రక్షణ సామగ్రిని ఎగుమతి చేసిందని, త్వరలోనే అది రూ.50వేల కోట్లకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్నాతకోత్సవం విద్యార్థుల జీవితాలలో ఒక మైలురాయి క్షణమని అన్నారు. ఇంజనీర్లు, ఆవిష్కర్తలు, సమస్యల పరిష్కారకులుగా విద్యార్థులు ప్రపంచ సమస్యలను ఎదుర్కొనే శక్తిని సంతరించుకన్నారని అభినందించారు.

ఎస్సార్‌యూ చాన్స్‌లర్ వరదారెడ్డి మాట్లాడుతూ.. తెలుగు సినీ పరిశ్రమలో విశేష సేవల్ని అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి చేసిన విశేష సేవల్ని గుర్తించి ఎస్సార్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం పాటకు అస్కార్ పురస్కారంతో పాటు గోల్డెన్ గ్లోబ్ అవార్డు లభించడంతో ఆయన ప్రతిభ అంతర్జాతీయగా ప్రశంసలు పొందడం భారతదేశానికి గర్వకారణమన్నారు. అనంతరం ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి మాట్లాడుతూ.. ఎస్సార్ విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ తన నివేదికలో యూనివర్సిటీకి చెందిన ఐదు స్కూళ్లలో అందిస్తున్న విభిన్న ప్రోగ్రాములపై వివరించారు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంజనీరింగ్, బిజినెస్, వ్యవసాయం, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ వంటి రంగాలలో బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ స్థాయిలలో వరుసగా 17బ్యాచ్‌లర్, 16 మాస్టర్స్, 18 డాక్టరల్ ప్రోగ్రాంలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, ప్రొ చాన్స్‌లర్ మధుకర్‌రెడ్డి, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, వివిధ స్కూళ్ల డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకూ తప్పని కుల వివక్ష

- శ్రీరామనవమి నిర్వాహకులపై అట్రాసిటీ కేసు నమోదు
- ఏప్రిల్ 6న ఘటన.. వర్ధన్నపేటలో కలకలం

వర్ధన్నపేట జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేటలోని శ్రీరామచంద్ర స్వామి దేవాలయంలో గత ఏప్రిల్ 6న జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కొండేటి శ్రీధర్ వివక్షకు గురైన ఘటన మలుపు తిరిగింది. ఆయన ఫిర్యాదు మేరకు ఉత్సవ నిర్వాహకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిట్ కేసు నమోదైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం వివరాల్లోకి వెళ్లితే... వర్ధన్నపేట పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో గత ఏప్రిల్ 6న శ్రీరామనవమి కల్యాణవేడుక నిర్వహించారు. ఈ వేడుకకు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ హాజరయ్యారు. అయితే నిర్వాహకులు సమ్మెట శ్రీనివాస్, నిర్వహణ కమిటీ వారు ఉద్దేశపూర్వకంగా, రాజకీయ కుట్రతో తనను దళితుడు అనే కారణంతో వేదిక మీదకు ఆహ్వానించకుండా, కనీస మర్యాద పాటించకుండా తీవ్ర అవమానానికి గురి చేశారని శ్రీధర్ ఈ నెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్రవర్ణానికి చెందిన వ్యక్తులను కార్యక్రమానికి పిలిచి శాలువాలతో సన్మానించారని, దళిత వర్గానికి చెందిన తనకు కనీస గౌరవం ఇవ్వకుండా అహంకారాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు. నిర్వాహకులు సమ్మెట శ్రీనివాస్, కమిటీ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదును పరిశీలించిన అనంతరం వర్ధన్నపేట ఎస్సై చందర్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. కాగా, శ్రీరామ నవమి నిర్వాహకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం శుక్రవారం వెలుగులోకి రావడంతో భిన్న వర్గాల్లో చర్చకు దారి తీసింది.



శ్రీరామనవమి వేడుకల్లో దూరంగా కూర్చున్న శ్రీధర్ (ఫైల్)

మూత'బడి'కి మోక్షం లేదా!?

- వరంగల్ జిల్లాలో 171, హనుమకొండ జిల్లాలో 41 జీరో స్ట్రెంత్ స్కూళ్లు
- దృష్టి సారించని విద్యాశాఖ... ప్రారంభమైన బడిబాట



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో ఇప్పటికే వాటిని మూసివేసి అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను రేషనలైజేషన్ పేరిట ఇతర పాఠశాలలకు పంపించి వేశారు. గత ఏడాది వరకు వరంగల్ జిల్లాలో 171 పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడగా, హనుమకొండ జిల్లాలో 41 పాఠశాలలు మూతపడ్డాయి. అయితే శుక్రవారం నుంచి ప్రారంభమైన బడిబాట కార్యక్రమంలో మూతబడుల విషయంలో ఎలాంటి ప్రత్యేకమైన చర్యలను విద్యాశాఖ అధికారులు తీసుకోలేదు. పరిస్థితి ఇలానే కొనసాగితే మరిన్ని పాఠశాలలు మూతబడే ప్రమాదముందని విద్యానిపుణులు హెచ్చరిస్తున్నారు. మూతబడుల్లో ప్రాథమిక పాఠశాలలే అధికంగా ఉండటం గమనార్హం.

ఏడాదికేడాది ప్రభుత్వ పాఠశాలల్లో క్రమక్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ పాఠశాలలు మూతబడుతూనే ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం కానీ, విద్యాశాఖ గాని విద్యార్థుల తగ్గుదలకు గల కారణాలను అన్వేషించకుండా తూతూ మంత్రంగానే బడిబాట కార్యక్రమాన్ని ముగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీరో స్ట్రెంత్ కారణంతో మూతబడుతున్న పాఠశాలలను గుర్తిస్తున్న విద్యాశాఖ గణాంకాల్లో నమోదు చేస్తున్నాయే తప్ప వాటిల్లో విద్యార్థుల ప్రవేశాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మూతబడుతున్న పాఠశాలల ఆవాస ప్రాంతాల్లో విద్యార్థులు ఉంటున్నప్పటికీ వారు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులను ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా ప్రభుత్వం గాని, విద్యాశాఖ గాని సఫలీకృతం కావడం లేదనే విమర్శలు విద్యానిపుణులు వెల్లడిస్తున్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందు ప్రభుత్వ నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం అట్టహాసంగా 15 రోజుల పాటు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారులే పెదవి విరుస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో ఆవాస ప్రాంత ప్రజలు, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. 15 రోజులు పాటు వివిధ కార్యక్రమాల కలబోత ద్వారా బడిబాట కార్యక్రమం పూర్తవుతుందే తప్ప పెద్దగా విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరగడం లేదు. గత ఏడాది నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో వరంగల్, హనుమకొండల్లో ఒక్కో జిల్లాలో ప్రవేశాల సంఖ్య వందల్లోనే ఉండటం గమనార్హం. ఇక అప్పుడున్న జీరో స్ట్రెంత్ పాఠశాల్లో ఒక్క పాఠశాలలో కూడా విద్యార్థులు చేరలేదు సరికదా మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా పోయారు. శుక్రవారం నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభం అయ్యింది. జీరో స్ట్రెంత్ స్కూళ్లపై ఎలాంటి ప్రత్యేకణ కార్యాచరణ రూపొందించలేదు.

వరంగల్ జిల్లా...

మండలం	జీరోస్ట్రెంత్ పాఠశాలల సంఖ్య
చెన్నారావుపేట	16
దుగ్గొండి	8
గీసుగొండ	4
ఖానాపూర్	9
ఖిలావరంగల్	16
నల్లబెల్లి	11
నర్సంపేట	11
నెక్కొండ	29
పర్వతగిరి	13
రాయపర్తి	17
సంగెం	15
వరంగల్	21
వర్ధన్నపేట	1

హనుమకొండ జిల్లా...

మండలం	జీరోస్ట్రెంత్ పాఠశాలల సంఖ్య
హనుమకొండ	2
కాజీపేట	4
శాయంపేట	8
ఐనవోలు	5
హసన్‌పర్తి	2
కమలాపూర్	5
ఎల్కతుర్తి	1
వేలేరు	2
భీమదేవరపల్లి	6
నడికుడ	2
పరకాల	1
దామెర	1

ఆంధ్రజ్యోతి



మడికొండ ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించాలి

పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె. సత్యనారాయణరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బడిబాట కార్యక్రమం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైంది. శుక్రవారం కాజీపేటలోని మడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కలెక్టర్ డాక్టర్ సత్య శారద బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండు జిల్లాల్లో మండల కేంద్రాల్లో ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భద్రకాళి మాడవీధుల పనుల పరిశీలన



మాడవీధులను పరిశీలస్తున్న కమిషనర్, కుడా చైర్మన్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి మాడవీధులకు సంబంధించిన పనులను వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలో దొరికిన మాజీ కౌన్సిలర్లు

పట్టించిన భార్య.. ఇద్దరికి దేహశుద్ధి ● మానుకోటలో చర్చనీయాంశం

మహబూబాబాద్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్ల రాసలీలలు బట్టబయలయ్యాయి. పట్టణంలో వీరు ఓ లాడ్జిలో పట్టుబడ్డారు. వీరిని మాజీ కౌన్సిలర్ భార్య పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. మానుకోట పట్టణంలోని ఓ ప్రముఖ లాడ్జి గదిలో ఇద్దరు ఉన్నట్లు పక్కా సమాచారంలో మాజీ కౌన్సిలర్ భార్య తన బంధువులతో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం 100కు సమాచారం అందించగా పోలీసులు వచ్చి వారి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పట్టుబడ్డ మహిళ షీటీంలో సభ్యురాలిగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

హనుమకొండటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈనెల 24న నిర్వహించే ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు బీసీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్రరవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరవుతున్నారని చెప్పారు.

జోరుగా దరఖాస్తుల వెల్లువ

● రెవెన్యూ సదస్సులకు భారీ సంఖ్యలో రైతులు హాజరు ● ధరణిలో దొర్లిన తప్పులపైనే ఎక్కువ ఫిర్యాదులు

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నాలుగు రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు పలు సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గతంలో ఇదే సమస్యలపై తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేదని, కనీసం ఇప్పుడైనా పరిష్కారమైన తమకు న్యాయం జరుగుతుందా? అని అడుగుతున్నారు. సదస్సుల్లో పలువురు రైతులు కొత్త పాస్‌పుస్తకాల్లో భూ విస్తీర్ణంలో తప్పులు, సాదాబైనామాలపై దరఖాస్తులు చేసుకుంటున్నారు. లంచాలు తీసుకొని, ఒకరి భూమిని మరొకరి పేరిట పట్టా చేయడం, భూమి లేకపోయినా పాస్ పుస్తకాలు ఇవ్వడం, భూమి ఉన్నా పాస్ పుస్తకాలు జారీ చేయకపోవడం వంటి అనేక తప్పులపై కూడా ఎక్కువగా దరఖాస్తులు దాఖలవుతున్నాయి. పౌతి కేసులు, సర్వే నెంబర్ మిస్సింగ్‌లు, డిజిటల్ సైన్ పెండింగ్ వంటి సమస్యలపై కూడా రైతులు ఎక్కువగా పిటిషన్లను దాఖలు చేస్తున్నారు. దీంతోపాటు రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య వివాదాస్పదంగా ఉండడం వల్ల పట్టాలు రాని రైతులు సైతం ఆ విషయాన్ని అధికారులు దృష్టికి పిటిషన్ల రూపంలో తీసుకువస్తున్నారు. సదస్సుల్లో దాఖలైన పిటిషన్లలో పెండింగ్ మ్యుటేషన్లు, సక్సెషన్ విస్తీర్ణంలో తప్పులకు సంబంధించినవి కూడా ఉంటున్నాయి. లావణి పట్టాభూములు, బాగా పంపిణీ సమస్యలపై కూడా పిటిషన్లు అందుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సిబ్బంది నిర్లక్ష్యం, అధికారులు లాలూచీ వల్ల ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులపైన అధికంగా ఫిర్యాదులు దాఖలవుతున్నాయి. ధరణి పోర్టల్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు పలు సూచనలు చేస్తున్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గత ప్రభుత్వాలు బంచరాయి ఇనాం భూములు ఇచ్చాయని, వాటికి పట్టాలు ఇప్పించి, బ్యాంకు రుణాలు తీసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆ భూములను వారసత్వంగా వచ్చేలా చట్టంలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు రైతులు తమ గ్రామాల్లో కబ్జాకు గురైన చెరువులు, ప్రభుత్వ భూముల వివరాలను అధికారుల బృందం దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకువస్తున్నారు. ఈ భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని కోరుతున్నారు. ఆ వివరాలను ఇచ్చిన తమ పేర్లను గోప్యంగా ఉంచాలని కోరుతున్నారు. సాదాబైనామాలపై దరఖాస్తులు చేసుకున్న రైతులకు అధికారులు ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందువల్ల ఈ విషయంలో తామేమి చేయలేమని అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై పరిష్కారం ఉంటుందని చెబుతున్నారు.



రాయపర్తి మండలం గట్టికల్ గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నాలుగో రోజు

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు నాలుగో రోజు శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో జోరుగసాగాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. హనుమకొండ జిల్లాలోని 13 మండలాల్లోని 13 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం 1890 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ నాలుగు రోజుల్లో సదస్సుల్లో దాఖలైన మొత్తం దరఖాస్తుల సంఖ్య 5,607కు చేరుకున్నది. కాగా, వరంగల్ జిల్లాలో 13 మండలాలకుగాను పన్నెండింటిలో 24 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లాలో నాలుగోరోజు శుక్రవారం రెవెన్యూ సదస్సులు భీమదేవరపల్లి మండలంలో కొత్తకొండ, ధర్మసాగర్ మండలంలో క్యాతంపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్‌పేట, హనుమకొండ మండలంలో పలివేల్పుల, ఐనవోలు మండలంలో వెంకటాపూర్, కమలాపూర్ మండలంలో గుండేడు, వేలేరు మండలంలో పీచర, కాజీపేట మండలంలో మడికొండ, హసన్‌పర్తి మండలంలో చింతగట్టు, దామెర మండలంలో కోగిల్వాయి, ఆత్మకూరు మండలంలో చౌళ్లపల్లి, పరకాల మండలంలో పైడిపెల్లి, శాయంపేట మండలంలో కాట్రపల్లిలో జరిగాయి.

వరంగల్ జిల్లా

రాయపర్తి మండలంలో గట్టికల్, ఊకల్, పర్వతగిరి మండలంలో అన్నారం షరీఫ్, ఖిలా వరంగల్ మండలంలో స్తంభంపల్లి, గాడెపల్లి, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో రామచంద్రాపూర్, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో అమీనాబాద్, ఎల్లయ్యగూడెం, దుగ్గొండి మండలంలో నాచినపల్లి, పొనకల్, నర్సంపేట మండలంలో నర్సంపేట, ముగ్దుంపురం, నల్లబెల్లి మండలంలో గోవిందాపూర్, రేలకుంట, గీసుకొండ మండలంలో వంచనగిరి, ఊకల్ హవేలి, నెక్కొండ మండలంలో ముదిగొండ, తోపనపల్లి, ఖానాపూర్ మండలంలో డబీర్‌పేట, మంగళవారిపేట గ్రామాల్లో సదస్సులు జరిగాయి. శనివారం బక్రీద్, ఆదివారం సెలవు అయినందు వల్ల 7,8 తేదీల్లో రెవెన్యూ సదస్సులు ఉండవు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి



వంశీతరుణ్

దుగ్గొండి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని తిమ్మంపేటలో శుక్రవారం తెల్లవారుజా మున చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తిమ్మంపేటకు చెందిన దండు అన్వర్, హేమలత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దండు వంశీతరుణ్(22) వరంగల్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు, పేద కుటుంబం కావడంతో వంశీతరుణ్ వరంగల్‌లోని ఓ హోటల్‌లో పార్టుటైం పనిచేస్తూ చదువుకుంటున్నాడు. సంగెం మండలంలోని తిమ్మాపూర్‌లో శుభకార్యం ఉండగా ద్విచక్రవాహనంపై వెళ్లివస్తున్న క్రమంలో మామునూరు క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారు జాము న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వంశీతరుణ్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఉన్నత చదువు కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో వంశీతరుణ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదం చెలకొంది. వంశీతరుణ్ మృతికి మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, మండల అధ్యక్షుడు ఒరంగటి తిరుపతిలు సంతాపం తెలిపి నివాళులర్పించారు.

9 నుంచి డీసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2025లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 9 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు 64 మంది ఎంపిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నిర్వహించిన నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో జిల్లాకు చెందిన 64 మంది ఎంపికైనట్లు ఇన్‌చార్జి డీఈవో మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 628 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 64 మంది ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఎంపికైన విద్యార్థులకు సాలీనా రూ.12వేలు సదరు విద్యార్థికి ఇప్పటి నుంచి ఇంటర్మీడియెట్ రెండేళ్లు పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

బాలుడి కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

వరంగల్ క్రైం, జూన్ 06 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు గురైన 3 ఏళ్ల బాలుడి ఆచూకీ కనిపెట్టి తల్లితండ్రులకు అప్పగించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యాదవనగర్‌కు చెందిన రుద్రవేణి నరేశ్, జ్యోతి దంపతుల 3 ఏళ్ల బాబు ఆడుకుంటా కనిపించకుండా పోయాడని బాలుడి తల్లితండ్రులు ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టగా భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మంథనికి చెందిన బాలుడి మేనమామ తాండ్ర ప్రశాంత్ కుటుంబ ఘర్షణల మధ్య కిడ్నాప్ చేశాడని తెలియడంతో అదుపులోకి తీసుకొని తల్లితండ్రులకు అప్పగించామన్నారు.



బాలుడిని తల్లితండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రముఖుల పేర్లతో సైబర్ మోసం

● డబ్బులున్నాయి.. ఫోన్ పే చేయండని వల ● మోసపోతున్న అమాయకులు ● ఏటూరునాగారం ప్రాంతంలో సరికొత్త దందా

ఏటూరునాగారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు పాల్పడుతూ వ్యాపారులు, ప్రముఖ వైద్యులను ఆందోళనకు గురిచేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు చేస్తున్న ఫోన్ కాల్స్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. స్థానికంగా పేరున్న వైద్యుల పేరు చెప్పి, అత్యవసరంగా డబ్బులు కావాలంటూ.. నీకు క్యాష్ ఇస్తా.. నాకు ఫోన్‌పే చేస్తావా.. అంటూ ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు వారి అకౌంట్‌లోకి బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆరాధ్య హాస్పిటల్ డాక్టర్ పేరుతో, ఆస్పత్రి పక్కనే ఉన్న ఓ గ్రాఫిక్స్ సెంటర్ యజమానికి సైబర్ నేరగాళ్ల నుంచి కాల్ వచ్చింది. 'హలో, నేను ఫలానా వైద్యశాల నుంచి కాల్ చేస్తున్నాను. నీకు క్యాష్ ఇస్తాను.. నాకు మూడు వేలు ఫోన్‌పే చేయండి..' ఇలాంటి మాటలతో సైబర్ నేరగాళ్లు వ్యాపారులకు కాల్స్ చేస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో రెండు, మూడు రోజులుగా ఇలాంటి కాల్స్ చేసి సైబర్ నేరగాళ్లు డబ్బులు వసూలు చేస్తున్న సంఘటనలు కలకలం రేపుతున్నాయి.

మూడు రోజుల కిందట..

మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాల డాక్టర్ పేరు చెప్పి సైబర్‌నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ జువెలరీ షాప్‌కు చెందిన మహిళకు కాల్ వచ్చింది. 'మా దగ్గర నగదు ఉంది.. ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించండి' అని సైబర్ నేరగాళ్లు ఆ మహిళను కోరారు. ఎదురుగా ఉన్న వైద్యశాల డాక్టర్ ఫోన్ చేసినప్పుడు డబ్బులు పంపించకుంటే ఏమనుకుంటాడోనని భావించిన ఆ మహిళ.. వెంటనే ఫోన్‌పే ద్వారా వారు చెప్పిన నంబరుకు డబ్బులు పంపించింది. కొద్దిసేపు వేచి చూసిన తర్వాత, సదరు డాక్టర్ నంబర్‌కు ఆ మహిళ తిరిగి కాల్ చేసింది. అయితే, తాను కాల్ చేయలేదని, ఎవరు చేశారో తెలియదని డాక్టర్ సమాధానం ఇచ్చాడు. దీంతో ఆ మహిళ ఖంగుతింది. అంతేకాకుండా, తాను డబ్బులు పంపిన ఫోన్‌పే నంబర్ కూడా తమది కాదని డాక్టర్ చెప్పడంతో, తాను మోసపోయినట్లు ఆ మహిళ గుర్తించింది. వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు చేస్తున్న ఈ కొత్తరకం మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

మోదీ విధానాలతో తీవ్ర ఆర్థిక అసమానతలు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

హనుమకొండ చౌరస్తా, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ విధానాలతో సమాజంలో తీవ్ర ఆర్థిక అసమానతలు ఏర్పడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో కార్మికవర్గంపై దాడి జరుగుతోందన్నారు. దానిని ప్రతిఘటించేందుకు జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక లోకం పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయని, కొందరి చేతుల్లోనే సంపద కేంద్రీకరణ కావడంతో, దేశంలో సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రేలాపనలు, టారీఫ్‌ల పెంపులు కూడా పెట్టుబడిదారీ విధాన సంక్షోభంలో భాగమేనన్నారు. ఇతర దేశాల సరుకులపై పన్నుల భారం మోపడం ద్వారా తన సంక్షోభాన్ని తప్పించుకునే పనిలో అమెరికా ఉందని తెలిపారు. 30, 40 ఏళ్లుగా అమెరికా ఉత్పత్తి ప్రక్రియను ఆపేసి చౌకగా కార్మిక శక్తి దొరికే ప్రాంతాలకు మళ్లించిన తీరును వెంకటేష్ వివరించారు. మోదీ సర్కారు లేబర్‌కోడ్‌లను తీసుకవచ్చి కార్మిక వర్గంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్ర ఘటన నేపథ్యంలో సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేయాలని అన్ని కార్మిక సంఘాలు సమష్టి నిర్ణయం తీసుకున్నాయని వెంకటేష్ తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. గుజరాత్ రాష్ట్రంలో కార్మికవర్గంపై దాడి దుర్మార్గమన్నారు. కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని బేఖాతరు చేస్తూ రాత్రి షిఫ్టులోనూ మహిళలను పని చేయాలని ఆదేశాలు జారీచేయడం సరికాదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్లు జి.ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పుల్ల అశోక్, బి.మహేష్, కె.ఐలయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాకయ్య, యాస బాబు, మందల శ్రీనివాస్, కల్పన, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు

కాజీపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగించినందుకు పలువురిపై ఆర్పీఎఫ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేట్ మూసి ఉన్నా ఎమ్మెల్సీ సిరికొండ మదుసూధనాచారి తనయుడు ప్రశాంత్ అతడి బృందం రైల్వే గేట్ తెరవాలని గేటు ముందు ఆందోళనకు దిగారు. దీంతో రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఆ 14మందిపై ఆర్పీఎఫ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు సిరికొండ ప్రశాంత్, తాటి జనార్దన్, గురుకుంట్ల కిరణ్, ఎర్రరాజు, కంచెర్ల ప్రకాశ్, శశికాంత్ గౌడ్, బియాని పూర్ణను అరెస్ట్ చేసి వారి పూచికత్తుపై వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

పట్టాలు దాటిన వారిపై కేసు

రైల్వే నిషేధిత ప్రాంతం వద్ద పట్టాలు దాటిన 10 మందిపై ఆర్పీఎఫ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్ మధ్య శుక్రవారం రైల్వే గేటు మీదుగా రైలు పట్టాలు దాటిన 10 మంది పాదచారులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వారిని రైల్వే కోర్టుకు హాజరుపర్చనున్నట్లు తెలిపారు. రైళ్లపై రాళ్లు విసిరినా, రైలు పట్టాలపై రాళ్లు పెట్టినా చర్యలు తప్పవన్నారు. అనంతరం రైల్వే గేట్ వద్ద పాదచారులకు అవగాహన కల్పించారు. అనంతరం పెండ్యాల- కాజీపేట మధ్య నడిచే రైళ్లకు బందోబస్త్ నిర్వహించారు.



బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ సీ చటర్జీ



వరంగల్ రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆయకార్ భవన్

ఆపదలో 'ఆదాయ శాఖ'

● శిథిలావస్థకు చేరిన ఇన్‌కామ్‌టాక్స్ భవనం
● నైజాం కాలంలో నిర్మాణం
● నూతన భవనం నిర్మించాలంటున్న ప్రజలు

వరంగల్ చౌరస్తా, జూన్6 (ఆంధ్రజ్యోతి): నైజాం కాలంలో వరంగల్‌లో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల్లో 'ఆయకర్ భవనం ఒకటి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇందులోనే ఆదాయపు పన్ను శాఖ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కార్యాలయం ఇదే. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలపై చెట్లు మొలిచి వృక్షాలవుతున్నాయి. దీని స్థానంలో నూతన భవన నిర్మాణం కోసం కొన్నేళ్లక్రితమే ప్రతిపాదనలుపంపగా కేంద్ర ఆదాయపు పన్ను శాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధులు కూడా కేటాయించినట్లు సమాచారం. ఈకార్యాలయం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉండడంతో ఇక్కడ నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. జన సముద్రం ఎక్కువగా ఉంటుంది. ప్రమాదం జరగక ముందే పాలకులు స్పందించి పాత భవనాన్ని తొలగించాలని, నూతన నిర్మాణం చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

చెరువులన్నీ మట్టిదిబ్బల పాలు

సింగరేణి ఓసీలతో నీటి వనరుల ధ్వంసం

- ఇరిగేషన్ శాఖకు పరిహారం చెల్లించకుండానే చెరువుల ఆక్రమణ
- మట్టి కుప్పలు పోసిన చెరువుల్లో మిషన్ కాకతీయకు రూ. కోట్ల ఖర్చు
- భూపాలపల్లిలోని ఓపెన్‌కాస్ట్-3 పరిధిలో ఇష్టారాజ్యం


నగరంపల్లి శివారులోని రాజమ్మకుంటలో పోసిన ఓసీ-3 మట్టి కుప్పలు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బొగ్గు తవ్వకాల పేరుతో సింగరేణి అధికారులు నీటి వనరులను ఛిద్రం చేస్తున్నారు. బొగ్గు తవ్వకాల పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలను అక్రమంగా వాడకుంటు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్ట్-3 పరిధి బయట ఉన్న జలవనరులను సింగరేణి ధ్వంసం చేస్తోంది. ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, పరిహారం చెల్లించకుండా మట్టిదిబ్బలతో కుంటలను నింపేస్తున్నారు. ఓసీ- 3 పరిధిలోని గణపురం మండలం నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట,మాదిగకుంట,సుద్దకుంటలను మట్టితో నింపేశారు. ఈ కుంటలకు చెందిన దాదాపు 45 ఎకరాల భూముల్లో మట్టి పోశారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నా సంస్థ తన పద్ధతిని మార్చుకోవడం లేదు. ఒక వైపు ఓసీ(ఓపెన్ కాస్ట్)లతో భూగర్భ జలాలు అడుగంటుతుండగా, మరోవైపు తవ్వకాల పరిధి బయట ఉన్న నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఓసీ-3ని ఇప్పటికే ఏర్పాటుచేసి తవ్వకాలు చేస్తున్న సింగరేణి... తవ్విన మట్టిని పక్కనున్న చెరువుల్లో, కుంటల్లో డంప్ చేస్తోంది. తద్వారా నీటి వనరులు ధ్వంసం కావడంతో పాటు పర్యావరణంకు నష్టం జరుగుతోంది. ఓసీ-3 తవ్వకాలకు 3,201 ఎకరాలను భూసేకరణ చేయాలని నిర్ణయించిన సింగరేణి చాలా వరకు భూసేకరణ చేపట్టి పనులు ప్రారంభించింది. ఓసీ-3 పేరిట ఇప్పటికే చాలా చెరువులు, కుంటలను మింగిన సింగరేణి తన పరిధిలో లేని నీటి వనరులను ఇప్పుడు ధ్వంసం చేయడం ప్రారంభించింది.

మిషన్ కాకతీయతో రూ. కోట్లల్లో పనులు

ఓసీ-3 పేరిట సింగరేణి మట్టి కుప్పలుగా మార్చిన గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటల అభివృద్ధికి నీటిపారుదల శాఖ అధికారులు రూ. కోట్లు ఖర్చు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ మూడు కుంటల అభివృద్ధికి రూ. కోటికిపైగా వెచ్చించి, అభివృద్ధి పనులు చేయించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు ఈ కుంటల్లో స్థానిక మత్స్యకారులు చేపలు పట్టుకొని జీవనోపాధి పొందేవారు. సింగరేణి తీరుతో ప్రభుత్వానికి రూ. కోట్లల్లో నష్టం రావడంతో పాటు స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంది.

అనుమతులు లేకుండానే

గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటలకు చెందిన సుమారు 45 ఎకరాల్లో సింగరేణి ఓసీ-3 మట్టి నిల్వలను పోసింది. రాజమ్మ కుంట కింద 40 ఎకరాలు, మాదిగకుంట కింద 40 ఎకరాలు, సుద్దకుంట కింద 135 ఎకరాల ఆయకట్టు ఉంది. ఓసీ-3లో భూములు కోల్పోతున్న రైతులకు కొంత మందికి మాత్రమే పరిహారం అందగ మిగిలిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదు. ఓసీ-3 పరిధిలో లేని నీటి వనరుల్లో సింగరేణి అధికారులు వాల్టా చట్టం నిబంధనలు పక్కన పెట్టి మట్టి కుప్పలు పోశారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా, పరిహారం చెల్లించకుండా సింగరేణి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కుంటల కట్టలు, తూములను పరిశీలించే క్రమంలో ఈ మూడు కుంటల్లో సింగరేణి మట్టి కుప్పలు పోసిన వ్యవహారం బహిర్గతమైంది.


నగరంపల్లి శివారులోని రాజమ్మకుంటలో పోసిన ఓసీ-3 మట్టి కుప్పలు

హైకోర్టుకు

గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటల్లో అక్రమంగా మట్టి కుప్పలు పోసిన సింగరేణి అధికారుల తీరుపై ఇరిగేషన్ శాఖ అధికారులు హైకోర్టు మెట్లెక్కెందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే సింగరేణికి లేఖ ద్వారా అభ్యంతరాలు తెలిపిన అధికారులు.. సింగరేణి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో హైకోర్టుకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. భూనిర్వాసితులకు పరిహారం చెల్లించడంతో పాటు భూములు కోల్పోతున్న ప్రభుత్వ సంస్థల భూములకు పరిహారం చెల్లించడం, మరోచోట భూమిని అభివృద్ధి చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా ఓసీ-3లో మట్టి నిల్వలు పోసిన కుంటలకు కుడా సింగరేణి ఇరిగేషన్‌శాఖకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. పరిహారం చెల్లించాల్సి వస్తే మూడు కుంటలకు కలిపి రూ. 11 కోట్లు చెల్లించాలని ఇరిగేషన్ శాఖ కోరుతోంది. లేదంటే సింగరేణి ఎంత భూమి వాడుకుంటుందో అంత భూమితో మరోచోట చెరువులను తవ్వి ఇవ్వాల్సి ఉంటుందని ఇరిగేషన్‌శాఖ అధికారుల వాదన. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు సింగరేణికి చెరువుల ధ్వంసంపై లేఖ కుడా రాయడం జరిగింది. సింగరేణి ఇప్పటివరకు ఇరిగేషన్‌శాఖ లెటర్‌పై స్పందించిన దాఖలాలు లేవు. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు సింగరేణి ద్వారా కోల్పోతున్న కుంటలకు సంబంధించి న్యాయం చేయాలని హైకోర్టులో కేసు నమోదు చేసేందుకు సిద్ధం అయినట్లు సమాచారం.

అనుమతులు లేకుండానే..



అనుమతి లేకుండానే, ఎటువంటి పరిహారం చెల్లించకుండా సింగరేణి ఓసీ-3 మట్టి నిల్వలను నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటల్లో పోసింది. దీంతో కుంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. మట్టి నిల్వలపై ఇప్పటికే సింగరేణి యంత్రాంగంకు లేఖ రాయడం జరిగింది. త్వరలోనే సింగరేణి వైఖరిపై హైకోర్టులో కేసు నమోదు చేయనున్నాం.

- బసవ ప్రసాద్, ఈఈ భూపాలపల్లి డివిజన్


కాళేశ్వరం - మహదేవపూర్ జాతీయ రహదారి ఇదే

జాతీయ రహదారి.. ప్రమాదకరంగా మారి..

- పెండింగ్‌లోనే ఉంటున్న జాతీయ రహదారి 353 సీ పనులు
- కేంద్ర అటవీశాఖ అనుమతుల కోసం ఎదురుచూపులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

మహదేవపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి అంటే రయ్ రయ్ మంటూ ఎలాంటి అడ్డంకులు.. గుంతలు.. ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయొచ్చు.. ఇక్కడ మాత్రం అలా కాదు.. జాతీయ రహదారికి భిన్నంగా 353-సీ ఉంటుంది. వాహనదారులు ఏమరపాటుగా ఉన్నారంటే అంతే సంగతులు ప్రమాదం తప్పని సరి.. 17 కిలోమీటర్ల రహదారి వెడల్పు కోసం వంద కారణాలు అడ్డు వస్తున్నాయి. ఒక పని ముందుకు పడితే మరో పని వెనుకపడుతోంది. అనుమతులు వస్తాయని అటవీశాఖ కోసం ఎదురుచూడాల్సిన పని. సరస్వతి పుష్కరాల సమయంలో గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచినా సమస్య పరిష్కారానికి మార్గం చూపడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్- కాళేశ్వరం 353 సీ జాతీయ రహదారిలో 17 కిలోమీటర్ల మార్గం అధ్వానంగా మారింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు అయిన ఈ రహదారి మీదుగానే అంతరాష్ట్ర రాకపోకలు జరుగుతాయి. ఈ రహదారి విస్తరణకు ఏళ్లుగా ఎదురుచూపులే మిగులుతున్నాయి. 2022 నవంబరు 12న ప్రధాని మోదీ రామగుండం పర్యటనలో భాగంగా విస్తరణ పనులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేసినా అటవీశాఖ అభ్యంతరాలతో ముందడుగు పడడం లేదు. ఇటీవల జరిగిన సరస్వతి పుష్కరాలకు లక్షలాది మంది తరలిరావడంతో ఈ మార్గంలో రహదారి విస్తరణ జరగక కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామయింది. 2027లో గోదావరి పుష్కరాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో రహదారి విస్తరణ తప్పనిసరిగా మారింది.

అటవీశాఖ అడ్డంకి..

మహదేవపూర్- కాళేశ్వరం మధ్య మహారాష్ట్ర సిరొంచకు వెళ్లే మార్గంలో 17 కిలోమీటర్ల వరకు పనులు జరగడం లేదు. ఇందులో సుమారు 15 కిలోమీటర్లు అటవీశాఖ ఆధీనంలో ఉండడంతో అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో రహదారి విస్తరణ పనులు అటకెక్కాయి. ఈ మార్గంలో 109 రకాలకు చెందిన 7529 చెట్లను తీసివేయాల్సి ఉండగా వీటి విలువ సుమారు 2 కోట్లపైనే అధికారులు అంచనా వేశారు. జాతీయ రహదారి, అటవీశాఖ అధికారులు కలిసి తొలగించే వృక్షాలకు గుర్తులు వేశారు. యూజర్ ఏజన్సీ అటవీశాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అనుమతులు కోసం కేంద్ర అటవీశాఖకు లేఖ పంపి సంవత్సరం దాటినా ఇంతవరు అనుమతులు రాకపోవడం గమనార్హం. మరోవైపు కాళేశ్వరం నుంచి కన్నెపల్లి మూలమలుపు వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు నిర్మాణం చేయాల్సి ఉండగా రైతులు భూములు ఇవ్వడం లేదు. దీంతో ఈ పనులు అలాగే మిగిలిపోయాయి.

అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం..

మహదేవపూర్, కాళేశ్వరం జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంటుంది. ఇప్పటికే నివేదికలు పంపాం. అనుమతులు రాగానే టెండర్లు వేసి పనులు ప్రారంభిస్తాం.

- మనోహర్, ఈఈ, జాతీయ రహదారులు

కేయూలో ఉద్రిక్తత

- పౌరహక్కుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు
- తీవ్ర నిరసన తెలిపిన ప్రజాసంఘాల నేతలు
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి: పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

కేయూ క్యాంపస్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ నేతృత్వంలో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఉదయం 10గంటలకు ఫార్మసీ కళాశాల వద్దకు రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొనేందుకు ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న వర్సిటీ పోలీసులు ఫార్మసీ కళాశాల వద్దకు చేరుకుని సమావేశం వద్దంటూ నేతలను వెళ్లిపోవాలని సూచించారు. తాము రౌండ్ టేబుల్ సదస్సుకు వర్సిటీ ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందామని పోలీసులకు విన్నవించినప్పటికీ అనుమతి లేదంటూ సమావేశాన్ని జరగనివ్వకపోవడంతో ఫార్మసీ కళాశాల బిల్డింగ్ నుంచి ప్రజా సంఘాల నేతలు బయటకు వచ్చారు. పోలీసుల తీరును నిరసిస్తూ ప్రజా సంఘాల నేతలు వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి మొదటి గేటు వరకు నిరసన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశంలో శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్ సదస్సు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలు నిరసించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, పౌర ప్రజాస్వామిక సంఘాలు కార్యక్రమాలు చేపట్టాయని అన్నారు. రౌండ్ టేబుల్ సదస్సు నిర్వహించే హాల్‌కు పోలీసులు తాళాలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు తేడా ఏమీలేదన్నారు. మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాణి, నేతలు జయంత్, టీపీఎస్ రాష్ట్ర నేతలు బి.రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్‌రావు, భారత్ బచావో నేతలు వెంగల్‌రెడ్డి, ప్రవీణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజయ్, డీఎస్‌పీ నేతలు శివ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, ఉదయ్‌సింగ్, చార్వాక బాసిరెడ్డి, జనగాం కుమారస్వామి, హరిబాబుతో పాటు విద్యార్థి సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెర తీసి.. మొదటి కల్లు పోసి..

- ఘనంగా పండుతాళ్ల కల్లు పండుగ
- గ్రామ పెద్దలను తాటివనానికి ఆహ్వానించిన గీతకార్మికులు
- జనగామ జిల్లా ఇప్పగూడెంలో అనాదిగా వస్తున్న ఆచారం


కల్లు పండుగలో భాగంగా గ్రామ పెద్దలకు కల్లు వంచుతున్న గీతకార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో శుక్రవారం గీతకార్మికులు పండుతాళ్ల కల్లు పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ యేడు లాగానే తాటిచెట్ల నుంచి పండుతాళ్ల కల్లు రాగానే కులాలకు అతీతంగా గ్రామానికి చెందిన పెద్దలను తాటివనానికి గీతకార్మికులు ఆహ్వానించారు. అతిథులను ఒక దగ్గర కూర్చోబెట్టి చెట్ల నుంచి వచ్చిన మొదటి కల్లు పోయడంతో పాటు గుడాలను అందించారు. వివిధ కులాలకు చెందిన కుల పెద్దలకు, కల్లు ప్రియులకు గీతకార్మికులు ఏమి ఆశించకుండా కల్లుపోసి గుడాలు అందించి పండుతాళ్ల కల్లు పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా గీతకార్మికులు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పండుతాళ్ల పండుగను నిర్వహించే సంస్కృతి గ్రామంలో ఉందన్నారు. పూర్వకాలం నుంచి పండుతాళ్ల కల్లుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వేసవి కాలం మొదలు సమయంలో పరుపుతాళ్లు ఉంటాయన్నారు. అనంతరం కార్మికులం తాటిచెట్టుకు ఉన్న తాటికాయలను కోస్తూ కల్లు పారడానికి గాను కత్తులతో మెరలు తీస్తామని తెలిపారు. తాటిగెలల నుంచి కల్లు పారడానికి అనేక రోజులు శ్రమించాలని చెప్పారు. అనేక మార్లు వ్యయ ప్రయాసలకు ఓర్చి గెలలకు ఓపికతో మెరలు పెట్టినప్పుడు కల్లు పారుతుందన్నారు. మొదటిగా తాటిచెట్ల నుంచి తీసిన పండుతాళ్ల కల్లును వనం మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు సాక పోసి కల్లు పండుగను నిర్వహించడం జరిగిందన్నారు. ఆతిథ్యం స్వీకరించిన గ్రామ పెద్దలు తోసిన విధంగా కట్నాలుగా కార్మికులకు డబ్బులు అందిస్తారని పేర్కొన్నారు. గీతకార్మికులు జూలూరు వెంకటేశ్వర్లు, జూలూరు మహేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాస్కర్ గౌడ్, రాజుగౌడ్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల పనులు

ఇంకా పెండింగ్‌లోనే..!

పుష్కరాలు పూర్తయినా పూర్తి కాని పనులు

మహదేవపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో పుష్కరాలు విజయవంతంగా పూర్తయ్యాయి. కాని పుష్కరాల కోసం విడుదల చేసిన నిధులతో ఏర్పాటు చేసిన పనులు మాత్రం ఇంకా పూర్తి కాలేదు.. నిత్యం కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు గాను గోదావరి ఒడ్డున ప్రత్యేకంగా సరస్వతి ఘాట్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించి రూ.35 కోట్లు కేటాయించినా అందుకు సార్థకత ఉండడం లేదు. పుష్కరాల ముందు మొదలు పెట్టిన పనులు ఇంతవరకు పూర్తికాకపోవడం విడ్డూరమని పలువురు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ చేపట్టిన ఆర్చిగేటు, కళ్యాణకట్ట, బట్టలు మార్చుకునే గది, మూత్రశాలల, మరుగుదొడ్ల పనులు మాత్రం మధ్యలోనే ఆగిపోయాయి.

పనులు ఆలస్యంగా ప్రారంభించడం.. ఇంతలోనే పుష్కరాలు రావడంతో స్లాబ్ లెవల్ పనులు పూర్తి చేసి అలాగే వదిలేశారు. ప్రసాదశాల పనులు ఇంతవరకూ పూర్తికాలేదు. రూ.కోట్లు వృథాగా పోతున్నాయని, వెంటనే అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి భక్తులకు సౌకర్యంగా ఉండేలా పెండింగ్ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.


స్లాబ్‌కే పరిమితమైన కల్యాణ కట్ట పనులు

సాగుకోసం..సలహాదారుడు

- ప్లాంటిక్స్ యాప్ అందుబాటులోకి తెచ్చిన 'ఇక్రిసాట్'
- అన్ని సమస్యలకు పరిష్కారం చూపేలా రూపకల్పన
- చీడపీడల ఫొటో తీసి పంపితే క్షణాల్లో నివారణ చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

రైతుల కోసం ఓ యాప్ అందుబాటులోకి వచ్చింది. సాగులో ఎదురయ్యే అన్ని సమస్యలకు ఇది పరిష్కారం చూపుతుంది. తగిన సలహాలు సూచనలు అందిస్తుంది. పంట తెగుళ్లు, చీడపీడలు, క్రిమి కీటకాలకు సంబంధించిన ఫొటోలు పంపిస్తే నివారణ చర్యలను సూచిస్తుంది. వాతావరణ వివరాలు, గాలిలో తేమ, ఉష్ణోగ్రత వివరాలను తెలియజేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మీ స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్ ఉంటే ఒక శాస్త్రవేత్త మన దగ్గర ఉన్నట్టే..



ప్లాంటిక్స్ యాప్ సమాచార చిత్రాలు

వరంగల్ వ్యవసాయం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో వ్యవసాయానికి కొత్త హంగులు అద్దుతూ సాంకేతితను జోడిస్తూ హైదరాబాద్ ఇక్రిసాట్ విశ్వవిద్యాలయం వ్యవసాయదారుల కోసం ప్లాంటిక్స్ అనే యాప్‌ను రూపొందించింది. రాష్ట్రంలో, దేశంలో ఏ మూలన ఉన్నా సరే.. అరచేతిలోనే మీ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ఇందుకోసం గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ప్లాంటిక్స్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. ఇందులో అన్ని పంటలకు సబంధించిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్యపద్ధతులు, చీడపీడలు, తెగుళ్ల నివారణ, పోషకాలు, సూచనలు, సలహాలు ఒకటేమిటి రైతుకు సంబంధించిన సమస్త సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు. గతంలోనైతే పంట వేసిన అనుభవజ్ఞులైన రైతులు, లేదా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకునే వారు. ఇప్పుడు పంటకు పట్టిన చీడపురుగు, తెగుళ్లకు సంబంధించిన ఫొటోలు తీసి పంపితే చాలు దాని నివారణ కోసం ఏం చేయాలనేది యాప్ ద్వారా పూర్తిసమాచారం తెలుసుకోవచ్చు.

సమస్య ఏదయినా పరిష్కారం సూచిస్తుంది..

కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు దినుసులు, అపరాలు ఇలా ఏ పంట పండించినా వాటి సాగు విధానం, సస్యరక్షణ చర్యల గురించి ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో వేగం తదితర అన్ని అంశాలను ఇందులో పొందుపరిచారు. ఫోన్ జీపీఎస్ ఆన్ చేస్తే చాలు ఆ ప్రాంతానికి సంబంధించిన సమాచారమంతా వెల్లడిస్తుంది.

సమస్త సమాచారం..

ప్రాంతం, భాష ఏదయినా సరే మీ పంటకు సంబంధించిన సమస్యలకు ప్లాంటిక్స్ యాప్ పరిష్కారం చూపుతుంది. ఇక పంట తెగుళ్లు, చీడపీడల సమస్యలను నిపుణులకు తెలియజేయడంతో పాటు వాటి పరిష్కారాన్ని పొందే అవకాశం కూడా ఈ యాప్‌లో ఉంది. సమస్యలకు సంబంధించిన ఫొటోలను తీసి పంపితే వెంటనే ఆ పంటకు సోకిన వ్యాధి ఏమిటో వెల్లడిస్తుంది. అంతేకాదు ఆ వ్యాధికి వాడాల్సిన పురుగు మందులను కూడా సూచిస్తుంది. అవి ఏ మోతాదులో వాడాలో కూడా వివరిస్తుంది. యాప్‌లో కమ్యూనిటీ ఆప్షన్‌లోకి వెళితే.. సహచర రైతులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతుల అనుభవాలు, సందేహాలను పంచుకునే అవకాశం ఉంటుంది. పంటలాభాన్ని అంచనా వేసుకోవచ్చు. తనకు సమీపంలో ఏయే ఎరువులు, పురుగుమందుల దుకాణాలు అందుబాటులో ఉన్నాయో కూడా ఇది చూపిస్తుంది.

యాప్ చాలా అద్భుతంగా ఉంది..



పంటలకు సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ యాప్ ఉంటే ఒక శాస్త్రవేత్త మన వెంట ఉన్నట్టే. పంట చేల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఈ యాప్ రైతులందరికీ చేరితే బాగుంటుంది.

- భూక్యా బాలునాయక్, రైతు, మరిపెడ

కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలి

హసన్‌పర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలను వండి విద్యార్థులకు అందించాలని హనుమకొండ ఇన్‌చార్జి డీఈవో మధుసూదన్ వంట సిబ్బందికి సూచించారు. మండలంలోని చింతగట్టు కేజీబీవీ, టీఆర్ ఏఈఎస్, యూఆర్ఎస్, బాలికల గురుకులాల్లో పనిచేసే వంట సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సరైన పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని విద్యార్థినులకు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీఈసీవో సునీత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, డీఆర్పీ సునీత, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో మధుసూదన్


వేములపల్లి యాదగిరి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ నాయకుడు యాదగిరికి నివాళి

హసన్‌పర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో శుక్రవారం మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు వేముల యాదగిరి మృతదేహానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, సీపీఐ మండల కార్యదర్శి ఎం శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు బాబు, భద్రయ్య, సాంబయ్య, రజాక్, బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, అజయ్, సారయ్య తదితరులున్నారు.

ఆదివాసీ హక్కులను కాలరాస్తున్న పాలకులు

వడ్డెపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ సిద్ధబోయిన లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో తుడుందెబ్బ రాష్ట్ర నేత ఆగబోయిన రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లాను టైగర్ జోన్‌గా ప్రకటించడాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర నేతలు సోయం రాజేందర్, చంద రఘుపతి, కుర్ర నర్సింహరావు, పాయం కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కతో నష్టపోతున్న మత్స్యకారులు

వడ్డెపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి చెరువులో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క, తుంగ వల్ల తాము నష్టపోతున్నామని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వడ్డెపల్లి అధ్యక్షుడు మట్టెపల్లి నర్సింగం అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లిలోని చెరువులో మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో సొంత ఖర్చుతో ప్రొక్లెయినర్ ద్వారా గుర్రపు డెక్క ఆకు, తుంగతో, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా నర్సింగం మాట్లాడుతూ.. ప్రభుత్వమే గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం వడ్డెపల్లి ఉపాధ్యక్షుడు మట్టెపల్లి రాంకోటేశ్వర్, డైరెక్టర్లు మట్టెపల్లి సదానందం, పాల సారయ్య, మట్టెపల్లి కోటి, మట్టెపల్లి రమేష్, మట్టెపల్లి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా బొల్లం రమేశ్


బొల్లం రమేశ్

వరంగల్‌క్రైం, జూన్6(ఆంధ్రజ్యోతి): మిల్స్‌కాలనీ ఇన్స్‌పెక్టర్‌గా బొల్లం రమేశ్‌ను నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన బొల్లం రమేశ్ గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ధర్మసాగర్ సీఐగా పనిచేశాడు. ఆ తర్వాత కరీంనగర్‌లో పనిచేసి తిరిగి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అలాట్ కావడంతో మిల్స్‌కాలనీ ఇన్స్‌పెక్టర్‌గా నియమిస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వాన్ని అవమానించే వారిపై చర్యలు తీసుకోవాలి

హసన్‌పర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారంలో ప్రభుత్వాన్ని బదనాం చేస్తూ సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేసిన వారిపై పంచాయతీ అధికారులు సీరియస్ అయ్యారు. ఇటీవల ఓ దినపత్రికలో ఇందిరమ్మ ఇండ్లకు లక్ష డిమాండ్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని కథనాన్ని ప్రచురించడంపై ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి సీరియస్‌గా స్పందించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వాన్ని అవమానపరుస్తూ పోస్టులు పెట్టిన వారిపై, డబ్బులు డిమాండ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. సోషల్ మీడియాలో వీడియోను షేర్ చేసిన అనితతో పాటు లక్ష రూపాయలు డిమాండ్ చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

హసన్‌పర్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని బాధిత రైతులు శుక్రవారం గ్రేటర్ 65వ డివిజన్ చింతగట్టులో జరిగిన రెవెన్యూ సదస్సులో డీటీ రహీమ్‌ను కోరారు. చింతగట్టు రెవెన్యూ శివారు 468, 469బండి మెట్టుగుట్టకు సంబంధించిన ప్రభుత్వ భూమిని 1985లో అప్పటి ప్రభుత్వం శాశ్వత పట్టాలను దళితులకు ఇచ్చిందని తెలిపారు. భూభారతి ద్వారా పాసు పుస్తకాలు ఇవ్వాలని రైతులు కోరారు. ఆర్ఎస్‌ఏ కుమారస్వామి, ఆర్‌ఐ ఫాజిల్, రైతులు నాగరాజు, వైకుంఠం, సాగర్, సదానందం, యాదగిరి, భాస్కర్, బుచ్చమ్మ, శ్రీను పాల్గొన్నారు.

డీవైఎస్‌వోకు అభినందనల వెల్లువ

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో హనుమకొండ డీఎస్‌ఏలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొనే విధంగా విశేష కృషి చేసిన డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌ను ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ సొసైటీ వీసీ అండ్ ఎం.డి. సోనీబాలాదేవీ అభినందించారు. శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో వివిధ జిల్లాలకు చెందిన డీవైఎస్‌వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మహానగరం తరువాత ఆన్‌లైన్ ప్రక్రియలో ఎక్కువ మంది విద్యార్థులు హనుమకొండ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో తర్ఫీదు పొందడంతో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో శిక్షణ శిబిరంలో పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొనేందుకు కృషి చేసిన అశోక్‌కుమార్‌ను ప్రముఖులతో పాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సాట్ డీడీ చంద్రారెడ్డి, అధికారులు రవీందర్, కల్యాణి, వివిధ జిల్లాలకు చెందిన డీవైఎస్‌వోలు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్యలో 16 కొత్త కోర్సులు

5వ పేజీ తరువాయి

ఇతర ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కోర్సులన్నింటికీ ఇంప్రూవ్‌మెంట్, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల సౌకర్యాన్ని కల్పించనున్నారు. యూజీసీలో ఎన్‌ఈసీ ప్రకారం సిలబస్‌లో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించారు. వర్సిటీ పరిధిలో బీఏ బీఈడీ సెలబస్‌ను ఆమోదించారు. వర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల్లో అర్హులైన అధ్యాపకుల నుంచి పీహెచ్‌డీ గైడ్‌షిప్‌కు రూల్స్, రెగ్యులరేషన్స్ రూపొందించాలని ప్రతిపాదించారు. ఎంఎస్సీ జియాలజీ రెండేళ్ల కోర్సు సిలబస్‌కు ఆమోదముద్ర వేశారు. వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో అకడమిక్‌తోపాటు పరీక్షల నిర్వహణ కోసం కోఆర్డినేటర్లను ప్రతిపాదించారు. పీజీ కోర్సుల్లో డిస్‌కంటిన్యూ అభ్యర్థుల ఫీజుల చెల్లింపులపై చర్చించారు. 2025-26 ఏడాదికి డిగ్రీ కోర్సుల్లో బ్యాక్‌ల్యాగ్ అభ్యర్థులకు పరీక్షలు రాసుకునేందుకు మళ్లీ అవకాశం కల్పించాలని ప్రతిపాదించారు. అయితే ఎంఎస్సీ జియాలజీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం కేయూ అకడమిక్ స్టాండింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రఉన్నత విద్యామండలి ఆమోదముద్ర వేసిన తర్వాత అమల్లోకి రానుంది. ప్రైవేట్ కళాశాల షిఫ్టింగ్, మేనేజ్‌మెంట్ మార్పుతో పాటు లా, కెమిస్ట్రీ, ఎడ్యుకేషన్‌లో టైంబార్ పర్మిషన్‌లకు అవకాశం కల్పించారు.

పాలకులకు ప్రజారోగ్యం పట్టదా ?

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి
- మడికొండలో సంతకాల సేకరణ

మడికొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మడికొండ, రాంపూర్, పరిసర గ్రామాల ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్న చెత్త డంప్‌యార్డును ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మడికొండ చౌరస్తా వద్ద పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం డంపింగ్ యార్డు ఎత్తివేత కోసం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంప్‌యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువులతో ప్రజలు అనారోగ్యం పాలవుతుంటే పాలకులు, మున్సిపల్ అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. రాజకీయాలకతీతంగా ఈ ప్రాంత ప్రజలు సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారం చూపడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు వైఫల్యం చెందుతున్నారని విమర్శించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల భిక్షపతి, మండల కార్యదర్శి శంకర్‌నాయక్, వేల్పులసారంగపాణి, మడ్డి రాజారామ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



మడికొండ చౌరస్తాలో సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

చంద్ర రాజేశ్వర్‌రావు ఆశయాలను కొనసాగించాలి


రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

న్యూశాయంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావు ఆశయాలను కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. రాజేశ్వర్‌రావు 111వ జయంతిని శుక్రవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలో సీపీఐ నాయకులు ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, బత్తిని సదానందం, జక్కు రాజు గౌడ్, ఏదునూరి వెంకట్రాజం, కొట్టె వెంకటేష్, మాలోత్ శంకర్‌నాయక్, యెశబోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు


బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న కొండేటి శ్రీధర్, వేణుగోపాల్‌గౌడ్

హసన్‌పర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చర్లలో నాలుగు రోజుల పాటు జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ముగిశాయి. గ్రామస్థులు దేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అరుణ, జక్కుల రజిత, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్, కేయూ ఈసీ మెంబర్ చిర్ర రాజుగౌడ్, అనిల్‌కుమార్, బొడ్రాయి గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ స్వర్ణలత

సామాజిక శాస్త్ర పరిశోధనలలో నమూనా పద్ధతి కీలకం

కేయూ క్యాంపస్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక శాస్త్ర పరిశోధనలలో నమూనా పద్ధతి కీలకమని కేయూ సోషియాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ ఎం.స్వర్ణలత అన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో మూడు రోజులుగా స్కాలర్లకు పరిశోధన పద్ధతులపై తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్వర్ణలత హాజరై 'పరిశోధనలో నమూనా పద్ధతులు' అనే అంశంపై మాట్లాడారు. నమూనా పద్ధతిలో ఎక్కువ జనాభా నుంచి తనకు కావాల్సిన అభిప్రాయాన్ని సేకరిస్తారని తెలిపారు. శాంపిల్స్‌ను ఎన్నుకోవడం, పక్షపాతం లేకుండా ఫలితాలను రాబట్టడం ప్రధానమన్నారు. కేస్ స్టడీకి ప్రాధాన్యత ఉందన్నారు. ఇంటర్వ్యూలు, ప్రశ్నాలరూపంగా సమాచారాన్ని సేకరించాలని అన్నారు. సమస్యలను తేలుగా అధ్యయనం చేయాలన్నారు. పరిశోధన లక్ష్యాల్లో స్పష్టత ఉండాలని పేర్కొన్నారు. నిష్పాక్షికంగా సమాచారాన్ని రాబట్టాలని చెప్పారు. పరిశోధన సమాజానికి ఆదర్శవంతమైన సందేశాన్ని ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య, వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వోడపల్లి నాగరాజు, స్కాలర్లు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో భాగంగా 2025-26 విద్యాసంవత్సరానికి 3,5,8వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతం వారికి రూ.2లక్షల లోపు ఉండాలని తెలిపారు. స్కీంలో ప్రవేశం కోసం విద్యార్థులను లాటరీ పద్ధతిని ఎంపిక చేస్తామని తెలిపారు. హనుమకొండలోని జిల్లా గిరిజనాభివృద్ధి కార్యాలయంలో ఈ నెల9వతేదీ నుంచి 13వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు ఫారాలు నింపి కార్యాలయంలో అందజేయాలని ప్రేమకళారెడ్డి ఆ ప్రకటనలో కోరారు

9 నుంచి డీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2025లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 9 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కౌన్సిలింగ్ ప్రారంభం అవుతుందని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు.

కేయూలో పరిపాలన అధికారుల బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ఇటీవల అంతర్గత బదిలీలు పొందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఇతర ఉద్యోగులు నూతన స్థానాల్లో బాధ్యతలు చేపట్టారు. కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ ఎగ్జామ్ బ్రాంచ్‌లో బాధ్యతలు చేపట్టారు. అలాగే కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల సూపరింటెండెంట్ బొల్లేపాక ప్రభాకర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రమణతో పాటు ఇతర ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని
- బల్దియాలో శానిటేషన్, మెప్మా సిబ్బందికి వైద్య పరీక్షలు


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మెగా ఆరోగ్యం శిబిరాన్ని సద్దినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శుక్రవారం బల్దియా ఇండోర్ స్టేడియంలో శానిటేషన్, మెప్మా సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ గుండు సుధారాణి హాజరై బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మెడికవర్ హాస్పిటల్ సహకారంతో బల్దియా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని మున్సిపాలిటీలలో తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో పట్టణ, స్థానిక సంస్థల్లో జూన్ 2 నుంచి సెప్టెంబరు 10 వరకు వంద రోజుల ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. వంద రోజుల కార్యక్రమాల్లో పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యంతో పాటు శానిటేషన్‌పై దృష్టి సారిస్తామని చెప్పారు. 'ఒక చర్య..ఒక మార్పు' అనే నినాదంతో ముందుకు వెళతామని అన్నారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వంద రోజుల కార్యక్రమాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పారిశుధ్య, మెప్మా సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ డైరెక్టర్ వినోద్, కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, డాక్టర్లు, సూపర్‌వైజర్లు, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు

వరంగల్ మెడికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మునిసిపల్ కార్పొరేషన్ శానిటరీ వర్కర్లకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కమిషనర్ జోనా, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జారారె డ్డి, రాజేష్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కె.హిమబిందు, పెద్దమ్మగడ్డ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంజయ్, టీబీ కోఆర్డినేటర్లు సుస్మాకిరణ్, నగేష్, విజయ్, జనార్దన్, నరేశ్; సునీత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హాస్పిటల్‌కు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హనుమకొండలో సంకీర్తన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ తరువాత వరంగల్ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని, అన్ని రకాల సౌకర్యాలతో పేద ప్రజలకు అం దుబాటులో వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, జనరల్ సర్జన్ డాక్టర్ అమర్‌నాథ్, తేజావత్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ యాకూబ్, డాక్టర్ స్ఫూర్తిరావు, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ అర్చన, డాక్టర్ విజయచందర్‌రెడ్డి, డాక్టర్ రామారావు, భాస్కర్ నాయక్, లింగమూర్తి పాల్గొన్నారు.

ఉజ్వల భారతి ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం

హసన్‌పర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టుగుట్ట తిరుమల కాలనీలో ఉజ్వల భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉజ్వల భారతి సీఈవో ఆచార్య గడ్డం భాస్కర్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్, విశ్రాంత అధ్యాపకుడు బండ కాళిదాసు, విశ్రాంత ఇంజనీర్ వైద్యం రాజగోపాల్, కాంగ్రెస్ 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, వీసం సురేందర్‌రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.


పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న ఉజ్వల భారతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఆటలు ఆడేది ఎలా!?

5వ పేజీ తరువాయి

క్రీడా పాఠశాల ఒక అరుదైన అవకాశం. ఇందుకు క్రీడా పాఠశాల మంచి వేదిక. క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఏటా ఎంపిక పోటీలు నిర్వహిస్తుంది. ఎంపికైన విద్యార్థులకు ఆటల్లో శిక్షణ ఇస్తూనే ఇంటర్ మీడియట్ వరకు ఉచిత విద్య, వసతి కల్పిస్తుంది. ఇందుకు సంబంధించి నాలుగు, ఐదో తరగతుల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తుంది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అర్హత పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు.

ఒక్కో క్రీడా పాఠశాలలో 80సీట్లు ఉంటాయి. నాలుగో తరగతిలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు, ఐదో తరగతిలో 20మంది బాలురు, 20 మంది బాలికలకు అవకాశం కల్పిస్తారు. ఇందుకోసం అర్హత పరీక్షలను నిర్వహిస్తారు. విద్యార్థులకు కొన్ని శారీరక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు చేసి, ప్రతిభ చూపిన వారికి క్రీడా పాఠశాలల్లో అవకాశం ఇస్తారు. తర్వాత వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తారు.

ఎంపికైన విద్యార్థులకు రెండేళ్ల పాటు నాలుగు, ఐదు తరగతుల్లో ప్రత్యే వ్యాయామాలు నేర్పించి, వారి శరీరాలను క్రీడలకు అనువుగా మారుస్తారు. అనంతరం వారు ఏ ఆటలో రాణించే అవకాశముంటుందో అందులో నిపుణులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో హకీంపేట, కీరంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చేరగోరే విద్యార్థులకు ఎంపిక పోటీలు మండల స్థాయిలో జూన్ 16 నుంచి 25 వరకు, జిల్లా స్థాయిలో 27 నుంచి 30 వరకు, రాష్ట్ర స్థాయిలో జులై 8 నుంచి 12 వరకు జరుగుతాయి.

జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్‌కు 64 మంది విద్యార్థుల ఎంపిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నిర్వహించిన నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో జిల్లాకు చెందిన 64 మంది ఎంపికైనట్లు ఇన్‌చార్జి డీఈవో మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 628 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 64 మంది ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఎంపికైన విద్యార్థులకు సాలీనా రూ.12వేలు సదరు విద్యార్థికి ఇప్పటి నుంచి ఇంటర్మీడియెట్ రెండేళ్లు పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

మేకప్



ముడతలు దాచే మేకప్

వయసు పైబడేకొద్దీ ముఖం మీద ముడతలు, గీతలు పెరుగుతూ ఉంటాయి. వీటిని మేకప్‌తో దాచేసే వీలుంది. అయితే అందుకోసం కొన్ని మేకప్ మెలకువలు పాటించాలి. అవేంటంటే...

తేమ కోసం...

వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవాలంటే, ముందుగా ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలుపెట్టుకోవాలి.

ద్రవరూప ఫౌండేషన్

ఫౌండేషన్ ముఖం మీద సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండడం కోసం ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి, కాంపాక్ట్, బ్లష్‌ల అప్లికేషన్‌కు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపి, పిండిన స్పాంజ్‌తో...


ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరోడుతూ ఉండకూడదు. అందుకోసం గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్

బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజ్‌తోనే అద్దుకోవాలి.

స్ఫూర్తి

సాహసమే శ్వాసగా...



పుష్పా ప్రకాష్

పుష్పా ప్రకాష్, మాలా హోన్నతి... కర్ణాటకకు చెందిన వీరిద్దరూ వయసు అనేది కేవలం ఒక సంఖ్య అని... సంకల్ప బలం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తున్నారు. ఏడు పదుల వయసులో పర్వతాలు అధిరోహిస్తూ... స్కూబా డైవింగ్‌లు చేస్తూ... ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ ఇద్దరు బామ్మల సాహస గాథలు ఇవి.

నా కూతురే నాకు ప్రేరణ

నేను కర్ణాటకలోనే పుట్టి పెరిగాను. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. ఆ తరువాత పెళ్లి, పిల్లలు, కుటుంబ బాధ్యతలతో కొన్నేళ్ల పాటు గడిపేశాను. 50 ఏళ్ల వయసు వచ్చాక పిల్లలు పెద్దవారు అయిపోయారు. నాకు నచ్చినట్లు నా కోసం నా జీవితం గడపాలని నిశ్చయించుకున్నా. మానసిక ఆరోగ్య సలహాదారుగా కొత్త జీవితం ప్రారంభించి ఎంతో మందికి సహాయం చేశా. కొన్ని సంవత్సరాల తరువాత ఓసారి నా కూతురుతో కలిసి ఓ యాత్రకు వెళ్లా. ఆ యాత్ర నా జీవితాన్ని మార్చేసింది. సాహసయాత్రలు చేయాలనే ఆలోచన నాలో రేపింది. అలా 65 ఏళ్ల వయసులో ట్రెక్కింగ్ చేయడం ప్రారంభించా. 3 ఏళ్లలో దేశవ్యాప్తంగా 49 ట్రెక్కింగ్‌లు విజయవంతంగా పూర్తిచేశా. వీటిలో మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కూడా ఉంది. ట్రెక్కింగ్ మాత్రమే కాక విదేశాల్లో స్కైడైవింగ్, స్కూబా డైవింగ్, బంగీ జంప్‌లు కూడా చేశా. ఇలా 2024లో ట్రెక్కర్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ కూడా అందుకున్నా.

క్రమశిక్షణతోనే సాధ్యం

ఈ వయసులోనూ ఇలాంటి సాహస యాత్రలు చేయడానికి శారీరకంగా ఎన్నో సవాళ్లు ఉంటాయి. కానీ నేను శారీరంగానే కాక మానసికంగా కూడా చాలా దృఢంగా ఉన్నాను. జిమ్‌లకు వెళ్లకపోయినా నా శరీరం ఇంత బలంగా ఉండడానికి కారణం ఎన్నో ఏళ్లుగా నేను అనుసరిస్తున్న జీవనశైలి. తెల్లవారుజాము బ్రహ్మ ముహూర్తాన... నిద్ర లేచి యోగాసనాలు వేస్తాను. ధ్యానం చేస్తాను. జంక్ ఫుడ్ తినను.
ఇంట్లో వండిన ఆహారం మాత్రమే తీసుకుంటాను. దీని వలన బీపీ, షుగర్ వంటి సమస్యలు కూడా ఇంతవరకు నా దరి చేరలేదు. క్రమశిక్షణతో ఇలాంటి జీవన విధానం పాటించడం వలనే మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండి నేను అనుకున్నది సాధించగలుగుతున్నా.

నేను ఈ కొత్త ప్రయాణం మొదటు పెట్టడానికి కారణం నా కూతురే. ట్రెక్కింగ్ చేయవచ్చని తనే నన్ను ప్రోత్సహించింది. తన ప్రోత్సాహంతోనే ఇన్ని సాహస యాత్రలు పూర్తి చేయగలిగా.

నన్ను నేను తెలుసుకోవాలని...



మాలా హోన్నతి

కర్ణాటకలో నా బాల్యమంతా సాగింది. చదువు పూర్తయ్యాక బ్యాంకు ఉద్యోగం సంపాదించా. బదిలీ మీద ఢిల్లీకి వెళ్లి స్థిరపడ్డా. బ్యాంకులో పదోన్నతి కూడా పొందా. కానీ ఎందుకో నా ఉద్యోగం నాకు నచ్చలేదు. ఎప్పుడూ నిస్తేజంగా అనిపించేది. నన్ను నేను తెలుసకునేలా ఏదైనా చేయాలనిపించింది. దాంతో ఉద్యోగాన్ని వదిలేశా. మారథాన్‌లు, ట్రెక్కింగ్, పర్వతారోహణ.. వంటివి చేయాలని ప్రయత్నించా. 1984లో 31 ఏళ్ల వయసులో ట్రెక్కింగ్ చేయడం మొదలుపెట్టా. 1986లో డార్జిలింగ్‌లోని హిమాలయాన్ పర్వతారోహణ ఇన్‌స్టిట్యూట్‌లో చేరా. ఆ తరువాత మౌంట్ స్టోక్ కాంగ్రీ, మౌంట్ లడఖి, మౌంట్ సితిధర్, కిలిమాంజారో వంటి పర్వతాలను అధిరోహించా. దేశంలోనే కాక విదేశాల్లోనూ ఎన్నో మారథాన్లలో పాల్గొన్నా.

కలగానే ఎవరెస్ట్

చాలా పర్వతాలు ఎక్కా. కానీ ఎవరెస్ట్ ఎక్కేందుకు మూడు సార్లు ప్రయత్నించి విఫలమయ్యా. మొదటిసారి 1992లో ఎవరెస్ట్ అధిరోహించేందుకు మహిళా బృందంతో కలిసి బయలుదేరా. కానీ నిరంతర హిమానిపాతం కారణంగా ఆ యాత్ర ఆగిపోయింది. 2011లో మారథాన్ కోసం ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు బయటుదేరాం. కానీ నేను పూర్తిగా దానికి సిద్ధంగా లేక మధ్యలోనే వైదొలిగా. ఆ తరువాత మానసికంగా, శారీరకంగా నన్ను నేను సిద్ధం చేసుకున్న తర్వాత నా స్పాన్సర్లు వెనకడుగు వేశారు. దాంతో నా పదవీవిరమణ నిధులు, నా దగ్గర ఉన్న డబ్బు ఖర్చు చేసి 2015లో మళ్లీ ఎవరెస్ట్ ఎక్కేందుకు బయలు దేరా. కానీ దురదృష్టం నన్ను వెంటాడింది. ఆ సమ యంలో భూకంపం సంభవించి నా ఎవరెస్ట్ యాత్ర నిలిచిపోయింది.

ఇలా చేస్తే ఎగ్జాస్ట్ ఫ్యాన్ శుభ్రం!

ఎగ్జాస్ట్ ఫ్యాన్ మీద నూనె జిడ్డు, దుమ్ము లాంటివి చేరుతుంటాయి. దీంతో ఫ్యాన్ ప్రభావవంతంగా పనిచేయలేదు. విద్యుత్ వినియోగం కూడా అధికమవుతుంది. ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను సులువుగా శుభ్రం చేసే చిట్కాలివి...


- ఒక గిన్నెలో నాలుగు చెంచాల బేకింగ్ సోడా, అయిదు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఫ్యాన్ రెక్కలకు, వెనక ఉన్న గ్రిల్‌కు పట్టించాలి. అరగంటసేపు ఆరనివ్వాలి. తరవాత వేడినీళ్లలో ఒక గుడ్డను ముంచి దానితో ఫ్యాన్ మొత్తాన్ని తుడవాలి. నెలకు రెండు సార్లు ఇలా శుభ్రం చేస్తూ ఉంటే ఫ్యాన్ చక్కగా పని చేస్తుంది.



- ఒక్కోసారి ఫ్యాన్ మీద బాగా జిడ్డు పట్టి ఉంటుంది. దీనికి దుమ్ము కూడా చేరడంతో శుభ్రం చేయడం కష్టంగా అనిపిస్తుంది. అలాంటప్పుడు గిన్నెలో అర కప్పు వెనిగర్, పావు కప్పు డిటర్జెంట్ వేసి ఒక కప్పు వేడి నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పలుచని గుడ్డ సహాయంతో ఫ్యాన్ రెక్కలకు, వెనక ఉన్న గ్రిల్‌కు పట్టించాలి. పావు గంట తరవాత తడిగుడ్డతో తుడవాలి. అక్కడక్కడ జిడ్డు మరకలు కనిపిస్తే మరల వెనిగర్ మిశ్రమాన్ని పట్టించి పది నిమిషాల తరవాత తుడవాలి.

భోజనకుతూహలం

బంగారం లాంటి ఆకుకూర



సంస్కృతంలో పొన్నగంటి కూరను 'మత్స్యాక్షి' అని పిలుస్తారు. మత్స్యాక్షి అంటే బంగారపు కళ్లలాంటి ఆకులు కలిగిందని అర్థం. దీనికి కారణం దీనిలో ఉన్న విటమిన్ ఏ. ఇది ప్రతి గ్రామంలోను ఉచితంగా దొరుకుతుంది. 'భోజన కుతూహలం'లో రఘునాథ సూరి పొన్నగంటి కూరను అద్భుత శక్తిదాయినిగా వర్ణించాడు. రఘునాథ సూరి ప్రకారం- పొన్నగంటి కూర- చల్లదనం నిస్తుంది (శిశిరా), స్త్రీపురుష బంధాన్ని పెంచుతుంది (వృష్యా), క్షీణింపచేసే క్షయ వంటి వ్యాధులను తగ్గిస్తుంది (క్షయాపహా), పుండ్లపై ప్రభావం చూపుతుంది (వ్రణదోషాపహా). అందుకే ఆయుర్వేద వైద్యులు ఈ కూరను ఎక్కువగా తినమని సూచిస్తూ ఉంటారు. ఇక పొన్నగంటి కూర ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం.

- కాలేయ సమస్యలను పరిష్కరించటంలో పొన్నగంటి కూరకు ప్రత్యేక స్థానముంది. గతంలో కలుషితమైన నీళ్ల వల్ల ఊరంతా కామెర్లు వస్తే- పొన్నగంటి కూరను తినమని సూచించేవారు. చారు కాచుకొని తాగమని చెబుతారు.
- పొన్నగంటి కూర జలుబు, దగ్గు, జ్వరాలను తగ్గిస్తుంది. ఎసిడిటి తగ్గటానికి దీనిని వాడవచ్చు.
- దీనిలో ఎ,బి,సి విటమిన్లు అధికంగా ఉంటాయి. కాల్షియం, ఫాస్ఫరస్ కూడా తగినంత లభిస్తాయి. దీని వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- దీనిని పరిమితంగా మాత్రమే తినాలి. ఎక్కువ తింటే ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశముంది.

చింత చిగురు, పొన్నగంటి కూర కలిపే వండే కూర చాలా శక్తిమంతమైనది. దీనిని తయారుచేయటానికి- ముందు పొన్నగంటి ఆకులను సన్నగా తరగాలి. వీటిలో కొద్దిగా చింత చిగురు కలపాలి. ఈ ఆకులను మిరియాల పొడి, ఉప్పులతో కలిపిన పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని కొద్దిగా వేడి చేసి.. తాళింపు పెట్టాలి.

- పొన్నగంటి ఆకులను బాగా కడిగి మిక్సీలో వేయాలి. దీనిని రెండు గ్లాసుల నీళ్లలో వేసి బాగా మరిగించాలి. ఈ నీళ్లను ప్రతి రోజూ తాగితే కామెర్లు తగ్గుతాయి.

• గంగరాజు అరుణాదేవి

న్యూస్ మేకర్

తిరుగులేని నాయకురాలు



రాధా వెంబు... దేశ ఆర్థిక రంగంలో అత్యంత ప్రభావవంతమైన మహిళా నాయకురాలుగా 'హురున్' జాబితాలో స్థానం సంపాదించారు. భారత తొలి తరం సంపద సృష్టికర్తగా, 'జోహో' సహ వ్యవస్థాపకురాలిగా, సామాజిక కార్యకర్తగా ఆమె ప్రస్థానం అసాధారణం.

భారత దేశపు తొలి తరం సంపద సృష్టికర్తగా, జోహో సహ వ్యవస్థాపకురాలు, రాధా వెంబును హురున్ ఎంపిక చేసింది. ఈమె వ్యక్తిగత సంపద విలువ.. అక్షరాలా 55 వేల 300 కోట్లు. తమిళనాడులోని చెంగల్పట్టులో నివసించే రాధ, జోహో ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ విజయంలో కీలక పాత్ర పోషించారు. జోహో స్కూల్స్, గ్రామీణ అభివృద్ధి ద్వారా సామాజిక ప్రభావానికి దోహదపడుతూ, వ్యాపార నాయకత్వాన్ని సామాజిక సాధికారతతో సమర్థవంతంగా మేళవించారామె. జోహో కార్పొరేషన్‌లో చీఫ్ సైంటిస్ట్, వ్యాపార దిగ్గజమైన శ్రీధర్ వెంబు సోదరి అయిన రాధా వెంబు, ఐఐటి మద్రాసు పూర్వ విద్యార్థిని. ప్రస్తుతం ఆమె జోహో ఇమెయిల్ సర్వీసుకు ప్రొడక్ట్ మేనేజర్‌గా సేవలందిస్తున్నారు. 1972లో చెన్నైలో పుట్టిన రాధ, 1996లో సోదరుడు, శ్రీధర్‌తో కలిసి జోహో కార్పొరేషన్‌ను స్థాపించారు. కంపెనీని నడపడంతో పాటు, దాన్ని ప్రపంచస్థాయికి విస్తరించడంలో, క్లౌడ్‌బేస్డ్ సొల్యూషన్స్‌ను బలోపేతం చేయడంలో రాధ కీలకమైన, బాధ్యతాయుతమైన నాయకత్వ పాత్రను పోషించారు. రాధా వెంబు జోహో కంపెనీలో అతి పెద్ద వాటాదారు. కంపెనీలో ఈమె 47.8 శాతం వాటాను కలిగి ఉంటే, సోదరుడు శ్రీధర్ వెంబు కేవలం ఐదు శాతం వాటాను మాత్రమే కలిగి ఉన్నారు.

ఘనతలు ఎన్నో...

రాధా వెంబు లాంటి మహిళా వ్యాపారులు భారతదేశపు వ్యాపార రంగాన్ని మలుపు తిప్పారని చెప్పవచ్చు. సాంకేతిక రంగంలో పురోగమిస్తున్న రాధా వెంబు, జోహో కార్పొరేషన్‌ను గ్లోబల్ సాఫ్ట్‌వేర్ శక్తిగా విస్తరించడంలో కీలక పాత్రను పోషిస్తున్నారు. 52 ఏళ్ల ఈ మహిళా వ్యాపారి, అనేక విభాగాల్లో గుర్తింపు పొందారు. మరీ ముఖ్యంగా పది అగ్ర తొలితరం మహిళా సంపత్తి సృష్టికర్తలు, పి అగ్ర దాతల జాబితాలో చోటు దక్కించుకున్నారు. అలాగే 2025 హురున్ ఇండియా మహిళా నాయకురాళ్ల జాబితాలో, అనేక విభాగాల్లో అతి తక్కువ వయస్సున్న మహిళా నాయకురాలిగా రాధా వెంబు తొవిర్మదో స్థానాన్ని సంపాదించారు.

వంటిల్లు

వర్షాకాలం వచ్చేసింది. ఈ కాలంలో కారంగా, ఘాటుగా ఉండే పచ్చడి లేదంటే పొడిని వేడి వేడి అన్నంలో వేసుకుని నెయ్యి కలుపుకుని తింటే... ఆహా... ఆ రుచే వేరు. అలాంటి ఆరోగ్యకరమైన కమ్మని రుచులు మీ కోసం...





వానొచ్చే వేళ కారంగా.. ఘాటుగా



శొంఠి పొడి

కావాల్సిన పదార్థాలు

నెయ్యి- ఒక చెంచా, శొంఠి- 50 గ్రాములు, జీలకర్ర- రెండు చెంచాలు, ఎండు మిర్చి- రెండు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నెయ్యి వేసి వేడిచేయాలి. ఇందులో శొంఠి ముక్కలు వేసి కలుపుతూ చిన్న మంట మీద దోరగా వేపాలి. అయిదు నిమిషాల తరవాత శొంఠి ముక్కలు లోపలిదాకా వేగి కొద్దిగా ఉబ్బుతాయి. మంచి వాసన కూడా వస్తుంది. ఇప్పుడు జీలకర్ర, ఎండుమిర్చి ముక్కలు కూడా వేసి మరో రెండు నిమిషాలు వేపాలి. తరవాత స్టవ్ మీద నుంచి దించి ఈ మిశ్రమాన్ని రోట్లో వేసి కచ్చాపచ్చాగా దంచాలి. తరవాత శొంఠి ముక్కలను చేత్తో మరింత చిన్న ముక్కలుగా తుంచి తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేయాలి. ఇలా తయారు చేసిన శొంఠి పొడి ఆరు నెలలు నిల్వ ఉంటుంది.

ప్రయోజనాలు

ఈ శొంఠి పొడిని ఆర్నెల్ల పసి పిల్లల నుంచి అరవై ఏళ్ల పైబడిన పెద్దవారి వరకూ ఎవరైనా తినవచ్చు.
ఇది పొట్టను పూర్తిగా శుభ్రం చేస్తుంది. రోజూ ఈ పొడితో ఒక్క ముద్ద తింటే చాలు అజీర్తి తొలగి ఆకలి పెరుగుతుంది. వర్షాకాలంలో చలిగాలుల వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా స్థిరంగా ఉంటుంది. ఊబకాయం తగ్గుతుంది. తరచూ వాతంతో ఇబ్బంది పడే పిల్లలకు మంచి ఔషధంలా పనిచేస్తుంది. మజ్జిగ లేదా మజ్జిగ చారులో చిటికెడు శొంఠి పొడి కలుపుకుని తాగితే జీర్ణాశయ సమస్యలన్నీ మాయమవుతాయి.

జాగ్రత్తలు

- శొంఠిని పెద్ద మంట మీద వేపకూడదు. సన్నని సెగ మీద నిదానంగా వేయించాలి.
- ఎండు మిర్చికి బదులు ముప్పావు చెంచా మిరియాల పొడి కలుపుకోవచ్చు.
- ఈ పొడితో రోజుకు ఒక్క ముద్ద మాత్రమే తినాలి. ఎక్కువగా తింటే విరేచనాలు అవుతాయి.



వాము కారం

కావాల్సిన పదార్థాలు

వాము- పావు కప్పు, మినపగుండ్లు- రెండు చెంచాలు, ధనియాలు- రెండు చెంచాలు, జీలకర్ర- ఒక చెంచా, మిరియాలు- అర చెంచా, నూనె- ఒక చెంచా, ఎండు మిర్చి- అయిదు, కరివేపాకు- రెండు రెమ్మలు, చింతపండు- రెండు రెమ్మలు, వెల్లుల్లి- రెండు రెబ్బలు, ఉప్పు- అర చెంచా

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి వేడి చేయాలి. ఇందులో వాము, మినపగుండ్లు, ధనియాలు, జీలకర్ర, మిరియాలు వేసి విడివిడిగా వేయించుకోవాలి. ఇవి దోరగా వేగిన తరవాత ఒక పళ్లెంలోకి తీసుకోవాలి. తరవాత గిన్నెలో నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఎండు మిర్చి, కరివేపాకు, వెల్లుల్లి వేసి తేమ పోయే వరకూ వేయించి పళ్లెంలోకి తీసి చల్లార్చాలి.
- మిక్సీలో ముందుగా ఎండుమిర్చి, కరివేపాకు, చింతపండు, పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులో వాము, ధనియాలు, జీలకర్ర, మిరియాలు, మినపగుండ్ల మిశ్రమంతోపాటు ఉప్పు వేసి మరోసారి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇలా తయారుచేసిన వాము కారాన్ని బాగా కలిపి గాజు సీసాలో భద్రపరిస్తే నెల రోజులు నిల్వ ఉంటుంది.

ప్రయోజనాలు

భోజనానికి ముందు ఈ వాము కారంతో రెండు ముద్దలు తింటే వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు. ముఖ్యంగా జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ, అజీర్తి, కడుపులో మంట, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు తగ్గిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తలనొప్పితో బాధపడేవారికి, కడుపులో నులి పురుగులతో ఇబ్బంది పడే పిల్లలకు ఈ పొడి ఔషధంలా పనిచేస్తుంది.

జాగ్రత్తలు

- ఒక్కోసారి వాములో ఇసుక రేణువులు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తగా శుభ్రం చేసుకోవాలి.
- వామును చిన్న సెగమీద దోరగా వేపాలి. ఇది నల్లగా మారితే వాముకారం చేదుగా ఉంటుంది.
- వెల్లుల్లి తప్పనిసరి కాదు.



వెల్లుల్లి పచ్చడి

కావాల్సిన పదార్థాలు

వెల్లుల్లి రెబ్బలు- 40, జీలకర్ర- రెండు చెంచాలు, ఉప్పు- ఒక చెంచా, కారం- నాలుగు చెంచాలు, నూనె- మూడు చెంచాలు, ఆవాలు- అర చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, పసుపు- చిటికెడు, ఎండు మిర్చి- రెండు

తయారీ విధానం

- వెల్లుల్లి రెబ్బలకు రెండు చుక్కల నూనె పట్టించి కొద్దిసేపు ఎండలో పెట్టాలి. తరవాత ఒక పలుచని వస్త్రంలో మూటకట్టి అరచేతులతో నలిపితే పొట్టంతా ఊడి వచ్చేస్తుంది. వీటిని వెడల్పాటి పళ్లెం లేదా చాటలో పోసి చెరిగితే పొట్టు ఎగిరిపోయి వెల్లుల్లి పాయలు విడిగులుతాయి. వీటిని పళ్లెంలోకి తీసుకోవాలి. వెల్లుల్లిని కొద్దిగా నూనెలో వేయిస్తే పచ్చి వాసన పోతుంది.
- మిక్సీలో వెల్లుల్లి రెబ్బలు, రెండు రెమ్మల చింతపండు, ఒక చెంచా జీలకర్ర, ఉప్పు, కారం వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి ముక్కలు, కరివేపాకు, పసుపు వేసి వేపాలి. ఈ తాలింపుని వెల్లుల్లి మిశ్రమంలో వేసి బాగా కలపాలి. ఈ వెల్లుల్లి పచ్చడి ఒక వారం పాటు నిల్వ ఉంటుంది.

ప్రయోజనాలు

ఈ వెల్లుల్లి పచ్చడి కలుపుకుని ఒక ముద్ద అన్నం తింటే శరీరంలో చేరిన కఫం బయటికి వెళ్లిపోతుంది. వాతం తగ్గుతుంది. వర్షాకాలంలో నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్ సోకే ప్రమాదం తగ్గుతుంది. వాతావరణం చల్లబడడం వల్ల వచ్చే కీళ్ల నొప్పులు, ఎముకల వాపు, ఆస్తమా, మలబద్ధకం, కొలెస్ట్రాల్, నరాల సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

మొబైల్ భూతం

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండడంతో పిల్లలను అమ్మమ్మలు తాతయ్యలు చూసుకునేవారు. కానీ ఇప్పుడలా కాదు. చిన్న కుటుంబాలు కావడంతో ఇల్లు, ఆఫీసు పనులతో సతమతమవుతూ, మరోపక్క చిన్నారులను సముదాయించలేక వారికి మొబైల్ ఫోన్ ఇస్తున్నారు తల్లిదండ్రులు. దాంతో పిల్లలు ఫోన్‌కు బాగా అలవాటు పడుతున్నారు. దీనివల్ల వారికి తీరని నష్టం జరుగుతోంది.

- నిరంతరం ఫోన్‌లో మునిగిపోతుండడంతో పిల్లల్లో ఏకాగ్రత లోపిస్తోంది. దేనిపైనా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. సృజనాత్మకత కొరవడతోంది. కొత్తగా, సొంతంగా ఆలోచించలేకపోతున్నారు.
- ఫోన్ చూస్తూ పిల్లలు ఆటలు ఆడడం లేదు. దాంతో వారి శారీరక దారుఢ్యం దెబ్బ తింటోంది. ఊబకాయం బారిన పడుతున్నారు.



- మొబైల్ నుంచి వెలువడే నీలి కాంతివల్ల నిద్ర లేమితో బాధ పడుతున్నారు. ఇది పలు అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది.
- ఫోన్ వ్యసనంలో పడి తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఒంటరితనం, మానసిక సమస్యల బారిన పడుతున్నారు. కనుక పిల్లలను మొబైల్‌కు దూరంగా ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు.


విక్రమ్ సింగ్

రైలులో వైద్య సాయం అందక..

దివ్యాంగ క్రికెటర్ మృతి

న్యూఢిల్లీ: టోర్నమెంట్ ఆడేందుకు వెళ్తున్న దివ్యాంగ క్రికెటర్ ఒకరు రైలులో తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స అందక మరణించిన విషాద ఘటన ఇది. గ్వాలియర్‌లో జరిగే వీల్‌చైర్ క్రికెట్ టోర్నీలో పాల్గొనేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన పంజాబ్ జట్టు బుధవారం రాత్రి ఢిల్లీనుంచి ఛత్తీస్‌గఢ్ ఎక్స్‌ప్రెస్‌లో బయలు దేరింది. రైలు బయలుదేరిన కొద్దిసేపటికే జట్టు సభ్యుడైన 38 ఏళ్ల విక్రమ్‌సింగ్‌కు తీవ్రమైన తల నొప్పి వచ్చింది. దాంతో అతడి సహచరులు అత్యవసర వైద్య చికిత్స కోసం రైల్వే హెల్ప్‌లైన్ నెంబర్ 139కి పదేపదే ఫోన్ చేసినా స్పందన కానరాలేదు. మరోవైపు 90 నిమిషాలు ఆలస్యంగా గురువారం ఉదయం రైలు మథుర స్టేషన్‌కు చేరింది. కానీ అప్పటికే విక్రమ్‌సింగ్ ప్రాణాలు వదిలాడు. 'అతడు మా కళ్లెదుటే నొప్పితో విలవిల్లాడాడు. రైల్వే హెల్ప్‌లైన్‌కు పలుమార్లు ఫోన్ చేశాం. కానీ వారి నుంచి స్పందన లేదు' అని విక్రమ్ సింగ్ సహచరుడు కన్నీటి పర్యంతమయ్యాడు. మథుర స్టేషన్‌లో ప్రభుత్వ రైల్వే పోలీసులు విక్రమ్‌సింగ్ భౌతిక కాయాన్ని స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టానికి తరలించారు. 'ఇది కేవలం విషాదం కాదు. రైల్వే అత్యవసర విభాగం బాధ్యతారాహిత్యానికి అద్దంపడుతుంది' అని విక్రమ్ మరో సహచరుడు మండిపడ్డాడు.

అల్కారజ్ వచ్చేశాడు

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు స్పెయిన్ స్టార్


అల్కారజ్

పారిస్: డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్ ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో అల్కారజ్ ప్రత్యర్థి..ఎనిమిదో సీడ్ లొరెంజో ముసేటి (ఇటలీ) తొడ గాయంతో మ్యాచ్ నుంచి అర్ధంతరంగా వైదొలిగాడు. అప్పటికి రెండో సీడ్, స్పెయిన్ స్టార్ అల్కారజ్ 4-6, 7-6 (3), 6-0, 6-2తో ముందంజలో నిలిచాడు. రొలాండ్ గారోస్ తుది పోరులో చోటు ఖాయం చేసుకున్న దరిమిలా..ఓపెన్ ఎరాలో వరుసగా నాలుగేళ్ల ఏదేని గ్రాండ్‌స్లామ్ సింగిల్స్‌లో ఫైనల్‌కు చేరిన పిన్న వయసు ఆటగాడిగా 22 ఏళ్ల అల్కారజ్ రికార్డు సృష్టించాడు. ఈక్రమంలో మాట్స్ విలాండర్, జాన్ బోర్గ్, రఫెల్ నడాల్, బోరిస్ బెకర్ సరసన కార్లోస్ చేరాడు. అల్కారజ్‌తో సెమీఫైనల్లో తొలి సెట్‌ను ముసేటి గెలిచాడు. కానీ పుంజుకున్న అల్కారజ్ రెండో సెట్‌ను టై బ్రేకర్‌లో సొంతం చేసుకొని స్కోరును సమం చేశాడు. ఆపై విజృంభించి మూడో సెట్‌లో అలవోకగా నెగ్గాడు. నాలుగో సెట్‌లోనూ అల్కారజ్ ముందంజలో నిలవగా.. తొడ కండరాల గాయంతో విలవిల్లాడిన ముసేటి మ్యాచ్‌ను కొనసాగించ లేకపోయాడు. రెండున్నర గంటలు సాగిన ఈ పోరులో ముసేటి 2 ఏస్‌లు సంధించగా, అల్కారజ్ ఒకటికే పరిమితమయ్యాడు. అయితే ముసేటి మూడు డబుల్ ఫాల్ట్‌లు, అల్కారజ్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. అనవసర తప్పిదాలలో ముసేటి (33), అల్కారజ్ (32) దాదాపు సమంగా నిలిచారు.


'డబుల్' దిశగా సారా: ఇటలీ స్టార్ సారా ఎర్రాని ఫ్రెంచ్ ఓపెన్‌లో 'డబుల్' సాధించే దిశగా దూసుకెళుతోంది. గురువారం మిక్స్‌డ్ డబుల్స్‌లో చాంపియన్‌గా నిలిచిన సారా.. తన దేశానికే చెందిన ఆండ్రియా వవసోరితో కలిసి మహిళల డబుల్స్‌లోనూ ఫైనల్ చేరింది. సెమీఫైనల్లో మూడోసీడ్ సారా/ఆండ్రియా ద్వయం 6-0, 6-1తో రష్యాకు చెందిన నాలుగో సీడ్ జంట మిర్రా ఆండ్రీవా/ష్నిడెర్‌పై గెలిచింది. మరో సెమీస్‌లో అలెగ్జాండ్రా కూనిక్ (సెర్బియా)/అన్నా డానిలినా (రష్యా) జంట 6-7(7), 6-3, 7-5తో ఎకెరి (నార్వే)/హొజుమి (జపాన్) జోడీని ఓడించి సారా ద్వయంతో ఫైనల్‌ఫైట్‌కు సిద్ధమైంది.

1x2

సబలెంకతో గాఫ్ ఢీ

నేడు మహిళల ఫైనల్

సాయంత్రం 6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో


సబలెంక


గాఫ్

ఫ్రెంచ్ ఓపెన్‌లో శనివారం జరిగే మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నెం.1 సబలెంక, నెం.2 గాఫ్ అమీ తుమీ తేల్చుకోనున్నారు. ఇద్దరూ రొలాండ్ గారోస్‌లో ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయారు. 2022లో.. 18 ఏళ్ల వయస్సులో గాఫ్ ఇక్కడ తుదిపోరుకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ఈసారి మాత్రం ట్రోఫీని దక్కించుకోవాలని 21 ఏళ్ల ఈ అమెరికా స్టార్ పట్టుదలగా ఉంది. బెలారస్ భామ సబలెంకతో ముఖాముఖిలో 5-5తో సమంగా ఉండడంతో ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. గత నెలలో జరిగిన మాడ్రిడ్ ఓపెన్ ఫైనల్లో సబలెంక చేతిలో గాఫ్ ఓడిపోయింది. ఇక్కడ విజేతగా నిలవడం ద్వారా 'మాడ్రిడ్' ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని గాఫ్ భావిస్తోంది. ఇక ఫ్రెంచ్ ఓపెన్‌లో మూడుసార్లు డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్‌ను సెమీస్‌లో మట్టికరిపించిన సబలెంక రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఈ సీజన్‌లో 27 ఏళ్ల సబలెంక అద్భుత ఫామ్ కనబరుస్తోంది. సీజన్ రికార్డు 40-6గా ఉండడం ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది.

విరాట్ స్వార్థపరుడు..

అతడిని అరెస్ట్ చేయాలి

నెటిజన్ల డిమాండ్



న్యూఢిల్లీ: చిన్నస్వామి స్టేడియం బయట తొక్కిసలాట ఘటన తర్వాత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై సోషల్ మీడియాలో వ్యతిరేకత కనిపిస్తోంది. అలాగే ఎక్స్ వేదికపై 'హ్యాష్‌ట్యాగ్ అరెస్ట్ కోహ్లీ' అనే నినాదంతో హోరెత్తిస్తున్నారు. మైదానం బయట 11 మంది అభిమానులు చనిపోవడానికి కోహ్లీనే కారణమంటూ కామెంట్స్ పెడుతున్నారు. బయట అంత విషాదం చోటుచేసుకున్నా.. లోపల మాత్రం సంబరాలు జరుపుకోవడమెందుకంటూ ప్రశ్నించారు. 'తననెంతగానో అభిమానించి చనిపోయిన ఫ్యాన్స్ కుటుంబాలను కోహ్లీ పరామర్శించలేదా? ఇంతటి స్వార్థపరుడు స్టార్ ఎలా అవుతాడు?' అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

రాహుల్ సెంచరీ

భారత్ 'ఎ' 319/7



నార్తాంప్టన్: ఓపెనర్‌గా బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ (116) శతకంతో సత్తా చాటాడు. దీంతో ఇంగ్లండ్ 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో శుక్రవారం తొలిరోజు ఆట ముగిసే సరికి భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 319/7 స్కోరు చేసింది. ధ్రువ్ జురెల్ (52)తో కలిసి నాలుగో వికెట్‌కు రాహుల్ 121 రన్స్ జోడించాడు. ఇక కరుణ్ నాయర్ (40), నితీశ్ (34) పర్వాలేదనిపించారు. జైస్వాల్ (17), కెప్టెన్ ఈశ్వరన్ (11) విఫలం కాగా.. క్రీజులో తనుష్ కోటియన్ (5), అన్షుల్ కంబోజ్ (1) ఉన్నారు. వోక్స్‌కు 3, హిల్‌కు 2 వికెట్లు దక్కాయి.

సాత్విక్ జోడీకి చుక్కెదురు

'ఇండోనేసియా' క్వార్టర్స్‌లో ఓటమి

జకార్తా: బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టికి ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. రెండేళ్ల క్రితం ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన ఈ భారత ద్వయం ఈసారి అనూహ్యంగా క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. శుక్రవారం ఇక్కడ జరిగిన డబుల్స్ పోరులో ప్రపంచ మాజీ నెంబర్ వన్ జోడీ సాత్విక్/చిరాగ్ 19-21, 16-21తో మలేసియా జంట మన్ వీ చోంగ్/టీ కాయ్ వున్ చేతిలో పరాజయం పాలైంది. సాత్విక్ జోడీ నిష్క్రమణతో టోర్నీలో భారత్ కథ పూర్తిగా ముగిసింది.

టైటిల్ రేస్‌లో గుకేష్

నార్వే చెస్ తొమ్మిదో రౌండ్‌లో విజయం



స్టావంజర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్.. నార్వే చెస్ టోర్నీ టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. తొమ్మిదో రౌండ్‌లో చైనా గ్రాండ్‌మాస్టర్ వీ యిని చిత్తు చేసి మూడు పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. దాంతో మొత్తం 14.5 పాయింట్లతో గుకేష్ రెండో స్థానంలో నిలిచాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి టై బ్రేకర్ పోరులో హికారు నకమురా చేతిలో పరాజయం పాలయ్యాడు. మొత్తం 11.5 పాయింట్లతో అర్జున్ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక..తొమ్మిదో రౌండ్‌లో కరువానాపై గెలుపొందిన మాగ్నస్ కార్ల్‌సన్ (15) టాప్‌లో నిలిచాడు. మహిళల విభాగంలో గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తొమ్మిదో రౌండ్‌లో చైనా క్రీడాకారిణి లీ టింగ్‌జీ చేతిలో ఓడింది. ఇప్పటిదాకా టాప్‌లో ఉన్న హంపి (13.5) తాజా ఓటమితో రెండో స్థానానికి పడిపోయింది. ఈ రౌండ్‌లో విజయం అందుకున్న ఉక్రెయిన్ జీఎం అనా ముజిచుక్ (15.5) అగ్రస్థానంలో నిలిచింది. స్పెయిన్‌కు చెందిన సార ఖదెమ్ చేతిలో పరాజయం పాలైన జీఎం వైశాలీ (9.5) ఐదో స్థానంలో కొనసాగుతోంది.

మా సహనాన్ని పరీక్షించేవాడు

పుజారపై రోహిత్



ముంబై: జూనియర్ క్రికెట్ ఆడే రోజుల్లో చటేశ్వర్ పుజారను అవుట్ చేసేందుకు తమకు రోజులు పట్టేదని స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తెలిపాడు. పుజార భార్య పూజ రాసిన 'ది డెయిరీ ఆఫ్ ఎ క్రికెటర్స్ వైఫ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రోహిత్ మాట్లాడాడు. 'అప్పట్లో మా జట్టు చర్చలన్నీ పుజారను ఎలా అవుట్ చేయాలన్నదానిపైనే జరిగేవి. అతడి వికెట్ తీయకపోతే మ్యాచ్ ఓడినట్టే. నా 14 ఏళ్ల వయస్సులో ఉదయం క్రికెట్ ఆడేందుకు వెళ్లి సాయంత్రం వచ్చేసరికి నా ముఖం కందిపోయేది. ఎందుకంటే పుజార రోజంతా బ్యాటింగ్ చేసేవాడు. ఒక్కోసారి రెండు, మూడు రోజులు ఫీల్డింగ్ చేసేవాళ్లం. నా శరీర రంగు మార్పు విషయమై మా అమ్మ అడిగేది. మరి..నేనేం చేయను? పుజార అనే ఓ బ్యాటర్ మూడు రోజుల పాటు బ్యాటింగ్ చేస్తాడని చెప్పేవాణ్ని' అంటూ రోహిత్ నాటి సంఘటనలను గుర్తుచేసుకున్నాడు.

న్యూజిలాండ్ క్రికెట్ చీఫ్ కోచ్.. రాబ్ వాల్టర్



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పురుషుల క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌గా రాబ్ వాల్టర్ నియమితుడయ్యాడు. గ్యారీ స్టెడ్ స్థానంలో మూడు ఫార్మాట్లకు వాల్టర్‌ను ఎంపిక చేసినట్టు న్యూజిలాండ్ క్రికెట్ ప్రకటించింది. దక్షిణాఫ్రికాకు చెందిన 49 ఏళ్ల వాల్టర్ ఇప్పటిదాకా ఆ దేశ పరిమిత ఓవర్ల జట్టు కోచ్‌గా పనిచేశాడు. వాల్టర్ ఆధ్వర్యంలోనే సఫారీలు 2023 వన్డే వరల్డ్ కప్, ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో సెమీస్ చేరారు. నిరుడు టీ20 వరల్డ్ కప్‌లోనూ ఫైనల్‌కు దూసుకెళ్లారు. వాల్టర్‌తో కివీస్ బోర్డు మూడేళ్ల పాటు ఒప్పందం కుదుర్చుకొంది.

పీయూష్ చావ్లా రిటైర్మెంట్



న్యూఢిల్లీ: వెటరన్ స్పిన్నర్ పీయూష్ చావ్లా దాదాపు రెండు దశాబ్దాల క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 36 ఏళ్ల చావ్లా భారత క్రికెట్ జట్టు గెలిచిన 2007 టీ20 వరల్డ్‌కప్, 2011 వన్డే వరల్డ్‌కప్‌ల్లోనూ సభ్యుడిగా ఉన్నాడు. 2006లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన చావ్లా భారత్ తరఫున 3 టెస్టుల్లో ఏడు వికెట్లు, 25 వన్డేల్లో 32 వికెట్లు, 7 టీ20ల్లో నాలుగు వికెట్లు తీశాడు. 2012లోనే అతను చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. దేశవాళీల్లో ఉత్తరప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించి, 137 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 446 వికెట్లు తీశాడు. అలాగే ఆరంభ ఐపీఎల్ (2008) నుంచి గతేడాది వరకు పంజాబ్, కేకేఆర్, సీఎస్‌కే, ముంబై ఫ్రాంచైజీల తరఫున మొత్తంగా 192 మ్యాచ్‌ల్లో 192 వికెట్లు తీశాడు. దీనికి తోడు 2012, 2014లో కోల్‌కతా నైట్‌రైడర్స్ చాంపియన్‌గా నిలిచిన సందర్భాల్లోనూ చావ్లా ఆ టీమ్ సభ్యుడిగానే ఉన్నాడు.

చిత్రజ్యోతి

SINCE 1965


గర్ల్‌ఫ్రెండ్‌తో అఖిల్ వివాహం





యువ కథానాయకుడు అక్కినేని అఖిల్ బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. రెండేళ్ల నుంచి ప్రేమలో ఉన్న జైనబ్‌తో ఆయన వివాహం శుక్రవారం తెల్లవారు జామున మూడున్నర గంటలకు జరిగింది. నాగార్జున నివాసంలో తెలుగు సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ వివాహానికి పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. గత ఏడాది నవంబర్‌లో అఖిల్, జైనబ్‌ల నిశ్చితార్థం జరిగిన విషయం విదితమే. తన కుమారుడి పెళ్లి విషయాన్ని వెల్లడిస్తూ నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. అలాగే కుమారుడి పెళ్లి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆనందం పట్టలేక నాగార్జున డ్యాన్స్ చేసిన వీడియో కూడా వైరల్ అయింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపార కుటుంబానికి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్. జైనబ్ తండ్రి జుల్ఫీరవ్‌జీ వ్యాపారవేత్త. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఆయన సన్నిహితుడనే వార్తలు వినిపించాయి. జైనబ్ నటి కూడా. 2004లో వచ్చిన 'మీనాక్షి.. ద టేల్ ఆఫ్ త్రీ సిటీస్' చిత్రంలో ఆమె నటించారు. ఆ చిత్రానికి ఎఫ్ హుస్సేన్ దర్శకుడు. అఖిల్ కంటే వయసులో ఆమె తొమ్మిదేళ్ల పెద్ద. రెండేళ్ల క్రితం పరిచయమై ప్రేమలో పడిన అఖిల్, జైనబ్ పెద్దల అనుమతితో ఇప్పుడు వివాహం చేసుకున్నారు. ఆదివారం గ్రాండ్‌గా ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. అఖిల్‌కు 2016లో వ్యాపార దిగ్గజం జీ.వి. కృష్ణారెడ్డి మనవరాలు శ్రియా భూపాల్‌తో నిశ్చితార్థం జరిగింది. 2017లో వీరి వివాహం జరగాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల రద్దయింది.

వీరమల్లు రాక వాయిదా



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం విడుదల మరోమారు వాయిదా పడింది. ఈ నెల 12న ఈ చిత్రం విడుదలవ్వాల్సి ఉండగా, మరోసారి వాయిదావేస్తున్నట్లు నిర్మాత ఏ.ఎం.రత్నం తెలిపారు. 'ఎంతో సహనం, నమ్మకంతో 'హరిహర వీరమల్లు' సినిమాకు అండగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ ప్రేమికులకు ధన్యవాదాలు. గతంలో ప్రకటించిన తేదీకే ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావాలని తీవ్ర ప్రయత్నం చేశాం. అయితే ఎంత శ్రమించినా ఆ తేదీకల్లా సినిమాను విడుదలకు సిద్ధం చేయలేకపోతున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో విడుదలను వాయిదా వేయాల్సి వచ్చింది. పవన్ కల్యాణ్ ఇమేజ్‌కు తగ్గట్లుగా 'హరిహర వీరమల్లు'ను మరింత గొప్పగా తీర్చిదిద్దాలనేదే మా ఆలోచన. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాం. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం' అని ఏ. ఎం రత్నం తెలిపారు. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేసి, కొత్త విడుదల తేదీని వెల్లడిస్తామని ఆయన చెప్పారు. జ్యోతికృష్ణ, క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయిక. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

యాక్షన్ షెడ్యూల్ పూర్తి



'బబుల్‌గమ్' చిత్రంతో కథానాయకుడిగా అలరించిన రోషన్ కనకాల నటిస్తున్న తాజా చిత్రం 'మోగ్లీ 2025'. సాక్షి సాగర్ మడోల్కర్ హీరోయిన్. 'కలర్ ఫొటో' ఫేం సందీప్‌రాజ్ దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. తాజాగా భారీ క్లైమాక్స్ యాక్షన్ షెడ్యూల్ పూర్తయినట్లు యూనిట్ తెలిపింది. మారేడుమిల్లిలో 15 రోజులపాటు సాగిన షెడ్యూల్‌లో రోషన్‌పై యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ పూర్తి చేశారు. 'ఇంకో షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తిచేసి, ఈ నెలలో టీజర్‌ను, ఏడాది చివర్లో సినిమాను విడుదల చేస్తాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, సినిమాటోగ్రఫీ: రామమారుతి ఎం.

'డెకాయిట్' డబ్బింగ్



అడవి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా షానియెల్ డియో దర్శకత్వంలో 'డెకాయిట్' అనే పాన్ ఇండియా సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ఫైర్ గ్లింప్స్, స్టైలిష్ విజువల్స్‌తో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా అడవి శేష్ డబ్బింగ్ టెస్ట్ పూర్తిచేశారు. దీనికి సంబంధించిన ఫొటోని సోషల్ మీడియాలో ఆయన షేర్ చేశారు. కాగా, ఈనెల 8 నుంచి కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న విడుదల కానుంది.

వనజీవి రామయ్య స్ఫూర్తితో



అడవులను రక్షించుకోవాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'కలివి వనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, బిత్తిరి సత్తి, నాగదుర్గ కీలకపాత్రలు పోషించారు. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించారు. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. సినీ పాత్రికేయుల చేతుల మీదుగా టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మాకు చెట్లంటే చాలా ఇష్టం. అందుకే 'కలివి వనం' చిత్రాన్ని రూపొందించి, ప్రజల్లో అవగాహన పెంచాలనుకుంటున్నాం. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'వనజీవి రామయ్య, దుశ్చర్ల సత్యనారాయణ స్ఫూర్తితో 'కలివివనం' చిత్రాన్ని రూపొందించాం. వృక్షాలతో మనిషి అనుబంధాన్ని చర్చిస్తూ సందేశాత్మకంగా సాగుతుంది' అని చెప్పారు.

సీక్వెల్ చిత్రం



గీతా సింగ్, కార్తీక్, కాశీ మదన్ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'బ్యాచిలర్స్ ప్రేమకథలు'. ఎం.ఎన్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. శుక్రవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. తొలి షాట్‌కు దర్శకుడు వి. సముద్ర కెమెరా స్విచాన్‌చేయగా, దర్శకుడు వీరశంకర్ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ 'నా గత చిత్రం 'కాలం రాసిన ప్రేమకథలు' చిత్రానికి చక్కటి ప్రేక్షకాదరణ దక్కింది. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'బ్యాచిలర్స్ ప్రేమకథలు' తెరకెక్కిస్తున్నా. ఇందులో వినోదంతో పాటు నేటి సమాజానికి మంచి సందేశం ఇవ్వబోతున్నాం. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'దసరా' విలన్ తండ్రి దుర్మరణం


షైన్ టాన్ చాకో

తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి జిల్లాలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 'దసరా' మూవీ విలన్ షైన్ టాన్ చాకో తండ్రి సీపీ చాకో (70) దుర్మరణం పాలయ్యారు. చాకో భార్య మరియా కార్మెల్ (65)లతో పాటు మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు గాయపడ్డారు. రోడ్డు పక్కన నిలిపివున్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు.. లారీ కిందకు వెళ్ళిపోవడంతో నుజ్జునుజ్జు అయిపోయింది. దీంతో కారులోని వారంతా అందులో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని చూసిన ఇతర వాహనదారులు పోలీసులకు సమాచారమిచ్చి వారిని రక్షించారు. వీరిలో షైన్ తండ్రి సీపీ చాకో ప్రాణాలు కోల్పోగా, మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బిజినెస్
వరంగల్ ● శనివారం 7 జూన్ 2025

ఆర్‌బీఐ డబుల్ బొనాంజా



రెపో, సీఆర్ఆర్‌లో భారీ కోత.. ఇక రుణాలు మరింత చౌక!

రెపో రేటు 0.50 శాతం తగ్గింపు ● 5.5 శాతానికి దిగివచ్చిన రెపో
5 ఏళ్లలో ఇదే అతిపెద్ద తగ్గుదల ● బ్యాంకులకు రూ.2.5 లక్షల కోట్ల బూస్ట్
సీఆర్ఆర్ ఒక శాతం తగ్గింపు ● 3 శాతానికి నగదు నిల్వల నిష్పత్తి
ద్రవ్యోల్బణం అంచనా 3.7 శాతం ● జీడీపీ వృద్ధి అంచనా 6.5%
ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు ప్రకటించిన ఆర్‌బీఐ
ఆగస్టు 4-6 తేదీల్లో తదుపరి సమీక్ష

ముంబై: రుణగ్రహీతలు, బ్యాంకింగ్ రంగానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బంపర్ బొనాంజా ప్రకటించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయాలతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత చౌకగా లభించనున్నాయి. ఇప్పటికే తీసుకున్న రెపో ప్రామాణిక రుణాలపై నెలవారీ చెల్లింపుల (ఈఎంఐ) భారం గణనీయంగా తగ్గనుంది. అలాగే, బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యతను భారీగా పెంచేలా చర్యలు చేపట్టింది. బ్యాంకులు విరివిగా రుణాలు మంజూరు చేయడంతో పాటు దేశ ఆర్థిక వృద్ధికి ఇది దోహదపడనుంది. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భాగంగా రెపో రేటును 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించారు. దాంతో రెపో 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగివచ్చింది. గడిచిన ఐదేళ్లలో ఇదే అతిపెద్ద రెపో తగ్గుదల. అంతేకాదు, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఆర్‌బీఐ రెపో రేటును 1 శాతం తగ్గించింది. ఈ ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో 0.25 శాతం చొప్పున కోత పెట్టింది. కాగా, బ్యాంక్‌లకు నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని ఒక శాతం తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. దాంతో సీఆర్ఆర్ 3 శాతానికి జారుకోనుంది. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో అదనంగా రూ.2.5 లక్షల కోట్ల మేర నిధులు అందుబాటులోకి రానున్నాయి. అయితే, సీఆర్ఆర్ తగ్గింపు సెప్టెంబరు-డిసెంబరు మధ్య కాలంలో నాలుగు విడతల్లో అమలులోకి రానుంది. బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద తప్పనిసరిగా నిల్వ చేయాల్సిన నగదు నిష్పత్తిని సీఆర్ఆర్ అంటారు.

బ్యాంకుల్లో విదేశీ వాటా పరిమితి పెంచం..

దేశీయ బ్యాంకుల్లో విదేశీ యాజమాన్య వాటా పరిమితిని ప్రస్తుతమున్న 15 శాతానికి మించి పెంచే ఆలోచన లేదని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో మరిన్ని బ్యాంకులు అవసరమే. అయితే, నమ్మకమైన యాజమాన్యాలు, మేనేజర్లు అవసరమని ఆయన పేర్కొన్నారు. దేశీయ బ్యాంకులో విదేశీ సంస్థ గరిష్ఠంగా 15 శాతం వరకు వాటా కలిగి ఉండవచ్చు. ఇంతకు మించి వాటా పెంపునకు కేవలం అవసరానుగుణంగానే అనుమతించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సీఎస్‌బీ బ్యాంక్‌లో ప్రవాస భారతీయుడు ప్రేమ్‌వత్సకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ 51 శాతం వాటా కలిగి ఉంది. తాజాగా, యెస్ బ్యాంక్‌లో జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీ 20 శాతం వాటా కొనుగోలుకు ఆర్‌బీఐ అనుమతిచ్చింది.

ఇండస్‌ఇండ్ బ్యాంక్.. ఓకే!

ఆర్థిక అవకతవకలు వెలుగుచూసిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉందని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. ఈ లోపాలకు బాధ్యత వహిస్తూ బ్యాంక్ ఎండీ, సీఈఓ సుమంత్ కథ్పాలియా రాజీనామా చేయడం జవాబుదారీ చర్యకు మంచి ఉదాహరణగా చూడవచ్చన్నారు. అలాగే, సంక్షోభ కాలంలో బ్యాంక్ నియంత్రణ ప్రశ్నలన్నింటికీ కట్టుబడి ఉందన్నారు. అంతేకాదు, బ్యాంక్‌పై ఎలాంటి చర్య చేపట్టేందుకైనా ఆర్‌బీఐ సంకోచించదని, ఈ విషయంలో ఏమైనా నేరాలు జరిగి ఉంటే చట్టం తన పని చేస్తుందన్నారు. గడిచిన కొన్ని త్రైమాసికాలుగా ఇండస్ ఇండ్ బ్యాంక్ సవాళ్లు ఎదుర్కొంటోంది. తమ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో రూ.2,100 కోట్ల అకౌంటింగ్ వ్యత్యాసాన్ని గుర్తించామని, ఇది బ్యాంక్ విలువను దాదాపు 2.35 శాతం వరకు ప్రభావితం చేయవచ్చని ఈ మార్చిలో ప్రకటించింది. దాంతో బ్యాంక్ షేరు భారీగా క్షీణించడంతో చిన్న మదుపరులు, ఇతర ఇన్వెస్టర్లు నష్టపోవాల్సి వచ్చింది.

క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి భంగం

బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలపై ఆర్‌బీఐ మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. అవి దేశ ఆర్థిక స్థిరత్వానికి భంగం వాటిల్లవచ్చని మల్హోత్రా అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం క్రిప్టోలపై ముసాయిదా చర్చాపత్రం రూపొందించే పనిలో ఉంది.

ఏకగ్రీవ నిర్ణయం కాదు..

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) పరపతి సమీక్షలో భాగంగా మూడు రోజుల పాటు సమావేశమైంది. మార్కెట్లో ధరలు అదుపులోకి వచ్చిన నేపథ్యంలో ఆర్థిక వృద్ధికి దోహదపడేలా కీలక వడ్డీ (రెపో) రేటును అర శాతం తగ్గించాలన్న ప్రతిపాదనకు ఐదుగురు సభ్యులు ఓటేయగా.. ఒకరు మాత్రం వ్యతిరేకించారు.

భవిష్యత్‌పై తటస్థ వైఖరి

కీలక వడ్డీ రేటుపై భవిష్యత్ వైఖరిని ఆర్‌బీఐ సానుకూలం నుంచి తటస్థ స్థాయికి మార్చింది. అంటే, ద్రవ్యోల్బణం వంటి స్థూల ఆర్థిక గణాంకాల డేటా ఆధారంగా భవిష్యత్‌లో రేట్లను మరింత తగ్గించడం లేదా పెంచే అవకాశాలుంటాయి. మున్ముందు వడ్డీ రేట్లను మరింత తగ్గించేందుకున్న అవకాశాలు పరిమితమేనని ఆర్‌బీఐ గవర్నర్ సంకేతాలిచ్చారు.

తదుపరి సమీక్ష తేదీల మార్పు

ఆగస్టులో నిర్వహించే సమీక్ష తేదీలను ఆర్‌బీఐ సవరించింది. ఈ మార్చిలో ప్రకటించిన షెడ్యూలు ప్రకారంగా.. ఆగస్టు 5-7 తేదీల్లో ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాలు జరగాల్సి ఉంది. కానీ, పాలనపరమైన అవసరాల కారణంగా తదుపరి సమీక్ష సమావేశ తేదీలను ఆగస్టు 4-6 తేదీలకు మార్చడం జరిగిందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

భారత్-పాక్ ఉద్రిక్తతల ప్రభావం నామమాత్రమే

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల ప్రభావం మన ఆర్థిక వ్యవస్థపై నామమాత్రమేనని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా అన్నారు. ఉద్రిక్తతల సమయంలో ఉత్తర భారతంపై కొంత ప్రభావం పడిందన్నారు. ఎందుకంటే, ఆ సమయంలో విమానాశ్రయాలు మూతపడ్డాయి. విమాన ప్రయాణాలు తగ్గాయి. వస్తు సరఫరాకు కొంత ఆటంకం కలిగింది. అయితే, ఆర్థిక కార్యకలాపాలు, జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణంపై దాని ప్రభావం లేదన్నారు. ఈ ఏప్రిల్ 22న పహల్గాంలో తీవ్రవాదులు 26 మంది పర్యాటకులను దారుణంగా కాల్చిచంపిన విషయం తెలిసిందే. ఇందుకు కారణమైన పాకిస్థాన్ తీవ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసేందుకు భారత సేన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. ఈ మే 7న పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తీవ్రవాదులకు చెందిన 9 స్థావరాలను ధ్వంసం చేసింది. కాగా, దేశంలో కొవిడ్ కేసుల పెరుగుదలపైనా మల్హోత్రా స్పందించారు. ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

వృద్ధి - ద్రవ్యోల్బణం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) జీడీపీ వృద్ధి రేటు అంచనాను ఆర్‌బీఐ గతంలో ప్రకటించిన 6.5 శాతాన్ని యథాతథంగా కొనసాగించింది. భారత ఆర్థిక వ్యవస్థ బలాన్ని, స్థిరత్వాన్ని ప్రదర్శించడంతో పాటు అంతర్జాతీయ అనిశ్చితులను అవకాశాలుగా మలుచుకోనుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను గతంలో ప్రకటించిన 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గించింది. గడిచిన కొన్నేళ్లలో ఇదే అత్యల్ప ద్రవ్యోల్బణ అంచనా. అంతర్జాతీయ మార్కెట్లో కమోడిటీ ధరలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో కీలక ఉత్పత్తుల ధరలు అదుపులోనే ఉండవచ్చని ఆర్‌బీఐ భావిస్తోంది.

అంచనాలు (%)

త్రైమాసికం	జీడీపీ వృద్ధి	ద్రవ్యోల్బణం
ఏప్రిల్-జూన్ (క్యూ1)	6.5	2.9
జూలై-సెప్టెంబరు (క్యూ2)	6.7	3.4
అక్టోబరు-డిసెంబరు(క్యూ3)	6.6	3.9
జనవరి-మార్చి (క్యూ4)	6.3	4.4

వాహన బీమా మరింత భారం?

» థర్డ్ పార్టీ ప్రీమియం 25 శాతం అప్!

న్యూఢిల్లీ: మోటార్ ఇన్సూరెన్స్ ముఖ్యంగా థర్డ్ పార్టీ (టీపీ) ఇన్సూరెన్స్ ప్రీమియం భారీగా పెరగనుంది. ఈ ప్రీమియంను 18 నుంచి 25 శాతం పెంచాలని బీమా నియంత్రణ అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఇప్పటికే సిఫారసు చేసింది. రోడ్డు రవాణ, రహదారులు మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఈ ప్రతిపాదనలను చురుగ్గా పరిశీలిస్తోంది. వచ్చే రెండు మూడు వారాల్లో ప్రభుత్వం ఈ సిఫారసులపై నిరయం తీసుకుంటుందని సమాచారం. 2022 తర్వాత థర్డ్ పార్టీ మోటార్ ఇన్సూరెన్స్ ప్రీమియం పెంచలేదు. దీంతో వచ్చే ప్రీమియం కంటే క్లెయిమ్స్‌పై చేసే చెల్లింపులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన ప్రీమియం కంటే 8 శాతం అధికంగా టీపీ చెల్లింపులు చేసింది. ప్రైవేట్ రంగంలోని గో డిజిట్, ఐసీఐసీఐ లొంబార్డ్ సంస్థల టీపీ చెల్లింపులూ 64.2 శాతం నుంచి 69 శాతం వరకు ఉన్నాయి. టీపీ ప్రీమియం రేట్లు పెంచితే తప్ప ఈ భారం మోయడం తమ వల్ల కాదని బీమా కంపెనీలు ఇప్పటికే స్పష్టం చేశాయి. దీంతో త్వరలోనే మోటార్ ఇన్సూరెన్స్ థర్డ్ పార్టీ ప్రీమియాలు మరింత భారంగా మారనున్నాయి.

స్టార్‌లింక్‌కు గ్రీన్‌సిగ్నల్

» లైసెన్స్ మంజూరు చేసిన డాట్

నూఢిల్లీ: ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్.. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభించేందుకు టెలికాం శాఖ (డాట్) లైసెన్స్ మంజూరు చేసింది. దీంతో దేశంలో ఈ తరహా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు అనుమతి పొందిన మూడో సంస్థగా స్టార్‌లింక్ నిలిచింది. ఇంతకు ముందు యూటెల్‌సాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ లైసెన్స్ పొందగా.. అమెజాన్ చెందిన క్యైపర్ సంస్థ ఇంకా అనుమతుల కోసం ఎదురు చూస్తోంది. ట్రయల్ స్పెక్ట్రమ్ కోసం స్టార్‌లింక్ దరఖాస్తు చేసిన 15-20 రోజుల్లో అనుమతులు రానున్నాయి. స్టార్‌లింక్‌కు ప్రభుత్వం గత నెలలో లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) జారీ చేయగా ఇప్పుడు పూర్తి లైసెన్స్ మంజూరు చేసింది. అయితే, పూర్తి స్థాయిలో కమర్షియల్ సేవలు ప్రారంభించే ముందు, సెక్యూరిటీ ప్రమాణాలు, దేశంలోని గేట్‌వేలు, హబ్‌లు, మానిటరింగ్ వ్యవస్థల ఏర్పాట్లు వంటి తదితర అంశాల్లో ప్రభుత్వ నిర్దేశించిన ప్రమాణాలను కంపెనీ నిరూపించుకోవాల్సి ఉంటుంది.

మార్కెట్లకు ఆర్‌బీఐ బూస్ట్

ముంబై: ఆర్‌బీఐ జంబో రేట్ల తగ్గింపుతో శుక్రవారం స్టాక్ మార్కెట్లు దూసుకుపోయాయి. దీంతో మార్కెట్ వరుసగా మూడో రోజూ లాభాలతో ముగిసింది. ఆరంభంలో స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సూచీలు.. ఆర్‌బీఐ రేట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించగానే రేసు గుర్రాల్లా పరుగెత్తాయి. సెన్సెక్స్ ఒక దశలో 857.85 పాయింట్ల లాభంతో 82,299.89 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 746.95 పాయింట్ల లాభంతో 82,188.99 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ కూడా 252.15 పాయింట్ల లాభంతో 25,003.05 వద్ద ముగిసింది. రియల్టీ ఇండెక్స్ 5 శాతం మేర లాభపడగా ఆటోమొబైల్ ఇండెక్స్ 1.5 శాతం, బ్యాంకెక్స్ 1.25 శాతం మేరకు లాభపడ్డాయి. నవంబరులోగా సీఆర్ఆర్‌ను దశలవారీగా ఒక శాతం వరకు తగ్గించబోతున్నట్లు ఆర్‌బీఐ చేసిన ప్రకటనతో బ్యాంక్ నిఫ్టీ ఒక దశలో 934.15 పాయింట్ల లాభంతో 56,695 పాయింట్లతో జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకింది. చివరికి 817.55 పాయింట్ల లాభంతో 56,578.40 వద్ద ముగిసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,650 ▲	91,350 ▲	1,17,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,800 ▲
విశాఖపట్నం	1,00,040 ▼	91,300 ▲	1,18,000 ▲
రాజమండ్రి	99,600 ▲	91,300 ▲	1,08,600 ▲
ప్రొద్దుటూరు	96,800 ▲	89,060 ▲	1,03,000 ▲
ముంబై	97,145 ▼	88,985 ▼	1,05,285 ▲

బంగారం రుణాలకు ఎల్‌టీవీ నిష్పత్తి పెంపు



రూ.2.5 లక్షల లోపు రుణాలకు 75 శాతం నుంచి 85 శాతానికి

» రూ.2.5-5 లక్షల వరకు రుణాలకు 80%.. తుది మార్గదర్శకాలు విడుదల చేసిన ఆర్‌బీఐ

బంగారం తనఖా రుణాలకు సంబంధించిన తుది మార్గదర్శకాలను ఆర్‌బీఐ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. రూ.2.5 లక్షల లోపు గోల్డ్ లోన్‌కు లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తిని ప్రస్తుతమున్న 75 శాతం నుంచి 85 శాతానికి పెంచుతున్నట్లు తెలిపింది. అయితే, ఈ రుణాల్లో రిస్క్‌ను తగ్గించేందుకు కొన్ని షరతులను సైతం విధించింది. 'ఆర్‌బీఐ (బంగారం, వెండి తనఖాపై రుణం) మార్గదర్శకాలు 2025' ప్రకారం.. రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలకు ఎల్‌టీవీ నిష్పత్తిని 80 శాతంగా నిర్ణయించింది. రూ.5 లక్షలకు పైగా రుణాలకు మాత్రం ఎల్‌టీవీ నిష్పత్తి 75 శాతంగా కొనసాగనుంది. బ్యాంకులు లేదా గోల్డ్ లోన్ కంపెనీలు రుణాలు మంజూరు చేసేందుకు ఈ నిష్పత్తే ఆధారం. రుణగ్రహీత తాకట్టు పెట్టే బంగారం నికర విలువలో ఆ రోజున రుణ మంజూరుకు అర్హత శాతమే ఎల్‌టీవీ నిష్పత్తి. బుల్లెట్ రీపేమెంట్ లోన్స్ విషయానికొస్తే, ఎల్‌టీవీ మదింపులో రుణ కాలపరిమితి ముగిసే నాటికి తిరిగి చెల్లించాల్సిన మొత్తాన్ని (అసలు+వడ్డీ) పరిగణనలోకి తీసుకుంటారు. మరిన్ని విషయాలు..

- తనఖా బంగారం యాజమాన్యంపై సందేహాలున్నప్పుడు రుణం మంజూరు చేయరాదు. ఆర్‌బీఐ తాజా మార్గదర్శకాల ప్రకారం.. తనఖా పెట్టే బంగారానికి రుణగ్రహీతే అసలైన యజమాని అని ధ్రువీకరించే పత్రం లేదా రశీదును కోరాలి. రశీదు లేని పక్షంలో పూచీకత్తుగా సమర్పిస్తున్న లోహానికి తానే అసలైన యజమాని అని తెలిపే స్వీయ ప్రకటిత (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రాన్ని తీసుకోవాలి.
- గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్), మ్యూచువల్ ఫండ్ యూనిట్లు వంటి ఆర్థిక ఆస్తులపై ఎలాంటి రుణాలు లేదా అడ్వాన్సు మంజూరు చేయవద్దు.
- ఇప్పటికే తనఖా పెట్టిన బంగారం లేదా వెండిని మళ్లీ తనఖా పెట్టుకుని రుణాలివ్వరాదు.
- ఒక రుణగ్రహీత నుంచి కిలో బంగారు నగలు లేదా 10 కిలోల వెండి ఆభరణాలకు మించి తనఖా స్వీకరించవద్దు. నాణేల విషయంలో బంగారమైతే 50 గ్రాములు, వెండి అయితే 500 గ్రాములకు మించరాదు.
- తనఖా కింద స్వీకరించే బంగారం లేదా వెండి విలువను ఆ లోహం స్వచ్ఛత ఆధారిత ధర ప్రకారంగా లెక్కించాలి. ఇందుకోసం ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్ లేదా సెబీ నియంత్రణలోని కమోడిటీ ఎక్స్ఛేంజ్ ధరలను ప్రామాణికంగా తీసుకోవాలి. గడిచిన 30 రోజుల ముగింపు ధరల సగటు లేదా క్రితం రోజు ముగింపు ధరను ఇందుకు పరిగణనలోకి తీసుకోవాలి.
- రూ.2.5 లక్షల వరకు రుణాల కోసం తాకట్టు పెట్టే బంగారానికి క్రెడిట్ అప్రైజల్ అవసరం లేదని పరపతి సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు.
- తాజా మార్గదర్శకాలను రుణదాతలు వీలైనంత త్వరగా పాటించాలని, 2026 ఏప్రిల్ 1 నుంచి తప్పక అమలు చేయాల్సిందేనని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

తగ్గనున్న ఈఎంఐల భారం

వడ్డీ రేట్లు తగ్గించిన పీఎన్‌బీ, బీఓఐ

ఆర్‌బీఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ రెపో ఆధారిత వడ్డీ రేట్లు (ఆర్‌బీఎల్ఆర్) 0.50 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గించిన వడ్డీ రేట్లు ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తాయని పీఎన్‌బీ వెల్లడించింది. తాజా రేట్ల తగ్గింపుతో గృహ రుణాలు 7.45 శాతం నుంచి ప్రారంభం కానుండగా వాహన రుణాలు 7.8 శాతం నుంచి మొదలవుతాయని పీఎన్‌బీ తెలిపింది. కాగా బీఓఐ కూడా తన ఆర్‌బీఎల్ఆర్‌ను 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గించినట్లు వెల్లడించింది.

ఎంత తగ్గొచ్చు: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఆర్‌బీఐ కీలక రెపో రేటును ఒక శాతం తగ్గించింది. ఇందులో అర శాతాన్ని ఈ ఏడాది జనవరి, ఏప్రిల్ నెలల్లో, మిగతా అర శాతాన్ని శుక్రవారం తగ్గించింది. దీంతో రెపో ఆధారిత గృహ రుణాల వడ్డీ రేట్లు దిగొస్తున్నాయి. అయితే ఈ వడ్డీ రేట్ల కోతతో ఎవరికి ఎంత భారం తగ్గుతుందనేది ఆయా వ్యక్తుల రుణ కాలపరిమితి, ఈఎంఐలపై ఆధారపడి ఉంటుంది. ఒకే కాలపరిమితితో కేవలం ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే ఒక రకంగా, అదే ఈఎంఐతో కాలపరిమితి మాత్రమే తగ్గించుకుంటే వడ్డీ భారం తగ్గుతుంది.

ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే: 20 ఏళ్ల కాలపరిమితితో ఒక వ్యక్తి 9.5 శాతం వడ్డీతో గృహ రుణం తీసుకుంటే, ఇప్పుడు అతను చెల్లించే వడ్డీ రేటు 8.5 శాతం. అదే కాలపరిమితితో ఈఎంఐ మాత్రమే తగ్గించుకుంటే అతడికి నెలకు అదా అయ్యే ఈఎంఐ రూ.1,929. అంటే 20 ఏళ్ల కాలంలో అతడికి ఆదా అయ్యే వడ్డీ రూ.4,63 లక్షలు.

ఈఎంఐ మార్పు.. 8.5% వడ్డీతో

రుణ మొత్తం	తగ్గే ఈఎంఐ	20 ఏళ్లలో ఆదా అయ్యే మొత్తం వడ్డీ
రూ.20 లక్షలు	రూ.1,929	రూ.4.63 లక్షలు
రూ.50 లక్షలు	రూ.3,215	రూ.7.71 లక్షలు
రూ.75 లక్షలు	రూ.4,823	రూ.11.58 లక్షలు
రూ.1 కోటి	రూ.6,431	రూ.15.43 లక్షలు

ఈఎంఐలో మార్పు లేకుండా 8.5% వడ్డీతో

రుణ మొత్తం	ఆదా అయ్యే సంవత్సరాలు	ఆదా అయ్యే వడ్డీ
రూ.30 లక్షలు	3.16	రూ.10.59 లక్షలు
రూ.50 లక్షలు	3,16	రూ.17.64 లక్షలు
రూ.75 లక్షలు	3.16	రూ.26.47 లక్షలు
రూ.1 కోటి	3.16	రూ.35.29 లక్షలు

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	540
వరంగల్	532	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	535

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	107
కర్నూలు	110	నెల్లూరు	112
విశాఖపట్నం	101	అనంతపురం	112
గోదావరి	114		

ఆర్థిక మాంద్యంతోనే 'కింగ్‌ఫిషర్' కుదేలు!

» ఎయిర్‌లైన్స్ పరిధిని కుదిస్తానంటే ప్రణబ్ ముఖర్జీ వద్దన్నారు
» బ్యాంకులు సహకరిస్తాయన్నారు
» నా బకాయిలు రూ.6,203 కోట్లే.. 9 వేల కోట్లనడం అబద్ధం
» నేనేమీ పారిపోలేదు..
» జైట్లీకి చెప్పే జెనీవా వెళ్లాను: మాల్యా



న్యూఢిల్లీ, జూన్ 6: అప్పులు తిరిగి చెల్లిస్తానని చెప్పినా తనపై 'దొంగ' అనే ముద్ర వేశారని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధినేత విజయ్ మాల్యా అన్నారు. ఆర్థిక మాంద్యం కారణంగానే తన సంస్థ దెబ్బతిందని వాపోయారు. ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఎయిర్‌లైన్స్ పరిధిని కుదించాలనుకుని నాటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని సంప్రదించానని.. కానీ ఆయన తిరస్కరించారని తెలిపారు. మోసం, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మాల్యా శుక్రవారం యూట్యూబర్, పారిశ్రామికవేత్త రాజ్ శామనీతో 'పాడ్‌కాస్ట్'లో సంభాషించారు. కింగ్‌ఫిషర్ పతనానికి దారితీసిన పరిణామాలను వివరించారు. '2005లో ప్రారంభించిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అనతికాలంలోనే నాణ్యమైన సేవలతో మంచిపేరు తెచ్చుకుంది. 2008 వరకు మా కార్యకలాపాలు సజావుగా నడిచాయి. ఆ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. దీంతో సమస్యలు చుట్టుముట్టాయి. ధనప్రవాహం నిలిచిపోయింది. రూపాయి విలువ క్షీణించింది. ఆర్థిక వాతావరణం నానాటికీ పతనావస్థకు చేరడంతో ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు కుదించడానికి అనుమతివ్వాలని అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని కలిసి అభ్యర్థించాను. విమానాల సంఖ్య తగ్గిస్తానని, ఉద్యోగులను తొలగిస్తానని.. కంపెనీ పరిధిని కుదిస్తానని కోరాను. ఆయన తిరస్కరించారు. కార్యకలాపాలు కొనసాగించాలని.. బ్యాంకులు సహకరిస్తాయని చెప్పారు. కింగ్‌ఫిషర్ సంక్షోభానికి అదే నాంది. ఆయన తప్పుడు సలహా ఇచ్చారు. సంస్థ పనితీరు సరిగా లేకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో ఆర్థిక సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. చివరకు విమానాలన్నీ నిలిపివేశాం' అని తెలిపారు. ఆర్థిక అవకతవకలపై స్పందిస్తూ.. బ్యాంకులు డబ్బులు తిరిగి చెల్లించాలన్న సదుద్దేశంతో నాలుగు సెటిల్మెంట్ ప్రతిపాదనలు వాటి ముందు పెట్టానని.. కానీ అవి తిరస్కరించాయని ఆరోపించారు. బ్యాంకుల్లో పారదర్శకత లేదని విమర్శించారు. 15 సార్లు జ్ఞాపకం చేసినా.. తన అకౌంట్ స్టేట్‌మెంట్‌ను ఇవ్వలేదన్నారు. తాను చెల్లించాల్సిన మొత్తం రుణాలు 14,131.6 కోట్లకు చేరాయని పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రకటన చేశారని తెలిపారు. తాను 9 వేల కోట్లు బకాయి పడినట్లు మీడియాలో వచ్చిన కథనాలతో ఆయన విభేదించారు. తాను తీసుకున్న అప్పు రూ.6,203 కోట్లు మాత్రమేనన్నారు. అప్పుపడిన దానికంటే ఎక్కువే చెల్లించినా తనపై దొంగ అన్న ముద్ర వేశారన్నారు.

జెనీవా వెళ్తున్నానని జైట్లీకి చెప్పా..

టీవీ యాంకర్లు తాను పరారయ్యారని అన్నారని.. కానీ తానేమీ పారిపోలేదని మాల్యా చెప్పారు. 2016 మార్చిలో నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి సమాచారమిచ్చే జెనీవా వెళ్లానని.. రుణాల సెటిల్‌మెంట్‌కు బ్యాంకులు సంప్రదింపులు జరిపేలా చేయాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. "జైట్లీని నేను కలిసిన విషయం మీడియాలో రావడంతో ఆయన తొలుత ఖండించారు. అయితే ఓ కాంగ్రెస్ ఎంపీ మా ఇద్దరినీ చూసి మీడియాతో మాట్లాడడంతో జైట్లీ మాటమార్చారు. క్లుప్తంగా మాత్రమే మాట్లాడుకున్నామని.. సమావేశం కాలేదని చెప్పారు. అయితే నేను నేరస్థుడిని కాను. విదేశీ భాగస్వాములను సమన్వయం చేసుకుని రుణాలు చెల్లించాలని భావించాను. ఈడీని సమయం కోరాను. అయితే విదేశాల్లో ఉండగా నా పాస్‌పోర్టు రద్దుచేయడంతో భారత్‌కు తిరిగి రాలేకపోయా' అని చెప్పారు. కింగ్‌ఫిషర్ పతనానికి తొలిసారి మాల్యా బహిరంగంగా క్షమాపణ చెప్పారు.

మోదీ 'నేరపూరిత ఎకనామిక్స్': కాంగ్రెస్

అరుణ్ జైట్లీకి చెప్పే విదేశాలకు పారిపోయానని మాల్యా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించింది. ప్రధాని మోదీ ప్రవచిత 'పకోడా ఎకనామిక్స్'.. నేరపూరిత ఎకనామిక్స్'గా మారాయని ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి పవన్ ఖేరా ధ్వజమెత్తారు. మాల్యా పరారీలో మోదీ ప్రభుత్వ హస్తం ఉందనేది స్పష్టమైందన్నారు. 'మీపై దాడి చేయబోతున్నామని విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌కు ముందే చెప్పేస్తారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన నేరగాళ్లు దేశ ఆర్థిక మంత్రికి చెప్పే పరారవుతారు. నరేంద్ర మోదీ వ్యవస్థంతా లొంగుబాటే' అని ఎద్దేవాచేశారు.

మాపైనే దర్యాప్తునకు ఆదేశిస్తారా?

» అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై అమెరికా ఆగ్రహం
» నలుగురు జడ్జిలపై ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటన

వాషింగ్టన్, జూన్ 6: కోర్టు ఇచ్చిన తీర్పుల్ని మనకు నచ్చినా, నచ్చకున్నా పాటిస్తాం. పాటించాలి. కానీ.. అమెరికాకి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)లో నచ్చని తీర్పు వస్తే ఏం చేసిందో తెలుసా? ఆ కోర్టులోని న్యాయమూర్తులపైనే ఆంక్షలు విధించింది! గాజాపై ఇజ్రాయెల్ దాడులను యుద్ధనేరంగా పరిగణిస్తూ.. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు చెందిన నలుగురు న్యాయమూర్తులు దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో అమెరికాకు కోపం వచ్చింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రాజకీయ వేదికగా మారిందని, ప్రత్యేకించి ఈ నలుగురు న్యాయమూర్తులూ చట్టవిరుద్ధంగా, ఆధారాలేవీ లేకుండా.. అమెరికాను, తమ మిత్రదేశమైన ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకున్నారని అమెరికా విదేశాంగ మంత్రి రుబియో ఆగ్రహం వ్యక్తం చేశారు. బెనిన్, పెరూ, స్లొవేనియా, ఉగాండాకు చెందిన ఆ నలుగురు న్యాయమూర్తులకు చెందిన ఆస్తులు అమెరికా పరిధిలో ఉంటే వాటన్నింటిని స్తంభింపజేస్తామని ప్రకటించారు. ట్రంప్ మొదటిసారి అధ్యక్ష పదవి చేపట్టినప్పుడు కూడా ఇలాగే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపై ఆంక్షలు విధిస్తే.. 2021లో బైడెన్ సర్కారు వాటిని తొలగించింది.

హార్వర్డ్‌పై ట్రంప్ నిర్ణయానికి ఫెడరల్ కోర్టు బ్రేక్

వాషింగ్టన్, జూన్ 6: హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఫెడరల్ కోర్టులో చుక్కెదురైంది. ఆయన విధించిన ఆంక్షలను ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ట్రంప్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఫెడరల్ కోర్టును హార్వర్డ్ యూనివర్సిటీ ఆశ్రయించింది. వైట్‌హౌస్ డిమాండ్లను హార్వర్డ్ వర్సిటీ తిరస్కరించిన నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైన ప్రతీకార చర్యగా అభివర్ణించింది.

కేటీఆర్‌కు సుప్రీం కోర్టు నోటీసులు

» ఆత్రం సుగుణ పిటిషన్‌పై విచారణ



న్యూఢిల్లీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో రూ.25 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం తరలించిందంటూ కేటీఆర్ చేసిన ఆరోపణలు తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశాయంటూ ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది సెప్టెంబర్ 30న కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. తనపై తప్పుడు కేసును బనాయించారని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 21న తుది తీర్పును వెలువరించింది. హైకోర్టు తీర్పును ఆత్రం సుగుణ మే 19న సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్‌చంద్రశర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. సుగుణ పిటిషన్‌కు సమాధానం చెప్పాలంటూ ప్రతివాదులుగా ఉన్న కేటీఆర్, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది.

కేసీఆర్‌తో సీఎం రేవంత్ 'డూప్ ఫైట్': ఏలేటి

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌తో 'డూప్‌ఫైట్' చేస్తూ ఆయన అరెస్టు కాకుండా కాపాడుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై గతంలో సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు ఎందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి క్యాబినెటు మీటింగు నిర్ణయాలే నిదర్శనమని ఆయన ఆరోపించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అక్రమాలకు ఆయన కుటుంబాన్ని వేయి సంవత్సరాలు జైల్లో పెట్టాల్సి ఉంటుందని చెప్పిన రేవంత్ ఒక్కరిని కూడా జైల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.

రాష్ట్రంలో పర్సెంటేజీల పాలన : డీకే అరుణ

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్సెంటేజీల పాలన నడుస్తోందని, 30 శాతం కమీషన్ చెల్లిస్తేనే పెండింగ్ బిల్లులు వస్తున్నాయని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, కాంట్రాక్టర్లు టెండర్లు వేసే పరిస్థితి లేదని ఆరోపించారు. ఐదున్నర గంటల సుదీర్ఘ క్యాబినెట్ సమావేశంలో ఏమీ తేల్చలేదని విమర్శించారు. కాగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఖాళీ లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా అరుణ చెప్పారు.

దాశరథి జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

» లేదంటే జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తాం: ఎమ్మెల్సీ కవిత



సుభాష్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20, 21న దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని, ప్రభుత్వం నిర్వహించకపోతే జూలైలో జాగృతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రఘునాథ ఖిల్లా జైలును ఆమె సందర్శించారు. అక్కడ నెలకొల్పిన దాశరథి కృష్ణమాచార్య విగ్రహాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఈ సంవత్సరం దాశరథి జయంతి సంవత్సరం అని, ప్రభుత్వం ఆయన శత జయంతి ఉత్సవాలను మర్చిపోయిందన్నారు.

స్నేహపూర్వకంగా ఉంటూనే సమస్యలు పరిష్కరించుకుంటాం: ఉద్యోగులు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉంటూనే సమస్యలు పరిష్కరించుకోవాలనే ఆలోచనా విధానంతో పని చేస్తున్నామని ఉద్యోగుల ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రివర్గ ఉపసంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు అండగా నిలుస్తుందని మరో ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నిరాశే!

» క్యాబినెట్ సమావేశంలో చర్చకు రాని వారి సమస్యలు

» తదుపరి కార్యాచరణపై 9న జేఏసీ సమావేశం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిరాశే మిగిలింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, యూనియన్లపై ఆంక్షల ఎత్తివేత, విద్యుత్ బస్సుల్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయడం, వెల్ఫేర్ కమిటీల రద్దు తదితర 21 ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ గత నెలలో సమ్మెకు పిలుపునిచ్చింది. జేఏసీ నాయకులతో చర్చలు జరిపిన మంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యల్ని దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో జేఏసీ నాయకులు సమ్మె వాయిదా వేశారు. ఇది జరిగి నెల రోజులు దాటినా... తమ డిమాండ్లలో ఇప్పటి వరకు ఏ ఒక్కటీ పరిష్కారం కాకపోవడంతో జేఏసీ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు అయోమయంలో పడ్డారు. చేసేది లేక క్యాబినెట్ సమావేశంలోనైనా తమ సమస్యలను సీఎం వద్ద చర్చించి, సాధ్యమైన వాటిని పరిష్కరించాలని జేఏసీ నాయకులు మరోసారి మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. కానీ క్యాబినెట్ సమావేశంలో ఆర్టీసీ సమస్యలపై కనీస చర్చ జరగకపోవడంతో జేఏసీ, ఉద్యోగులు నిరాశ చెందారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 9న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. మరో వైపు ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహార దీక్షకు స్టాఫ్, వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది.

హరీశ్, కేసీఆర్ కమిషన్ ఎదుట హాజరైతేనే వాస్తవాలు వెలుగులోకి: యెన్నం

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సర్కారు వేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట హరీశ్‌రావు, కేసీఆర్ విచారణకు హాజరైతేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతి, పర్యవేక్షణ, డిజైన్, నాణ్యతా లోపాలపై కాగ్ నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రాజెక్టు వ్యయం రూ.82 వేల కోట్ల నుంచి లక్షా 20 వేల కోట్లు పెరిగిన విషయంపై నాటి ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ తనకు సంబంధం లేదనడం దురదృష్టకరమన్నారు. విచారణ కమిషన్ ఎదుట ఈటల వివరణ విశ్లేషిస్తే.. మొత్తం అప్పటి సీఎం కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగిందని స్పష్టమవుతోందన్నారు. 2018-2023 వరకు బీఆర్ఎస్‌కు వచ్చిన రూ.1,400 కోట్ల ఎన్నికల బాండ్లు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమేనని ఆరోపించారు. బీఆర్ఎస్ రాజకీయ కుట్రతోనే ధన్వాడ ఘటన జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత సంపత్ కుమార్ అన్నారు.

నాగర్‌కర్నూల్ సబ్ జైలర్‌పై కేసు నమోదు

నాగర్‌కర్నూల్, బర్కత్‌పుర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలు మండలం ధన్వాడ గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో కీలక పాత్ర పోషించారని పేర్కొంటూ నాగర్‌కర్నూల్ సబ్ జైలర్ నాగరాజుపై కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్‌లో ఆయనను ఏ-3గా చేర్చారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఇంటలిజెన్స్ వర్గాలు నాగరాజుకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించారు. నాగరాజు రెండు రోజులుగా సెలవులో ఉన్నట్లు సమాచారం. కాగా, ఇథనాల్ ఫ్యాక్టరీని రైతుల ముసుగులో బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటూ, విధ్వంసం సృష్టిస్తున్నారని బీసీ సంఘాల నేతలు ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా ప్రధాన కార్యదర్శి చిరుతల విఠల్‌గౌడ్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఫ్యాక్టరీకి అనుమతులు లభించాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి బీఆర్ఎస్ దాడులను ప్రోత్సహిస్తోందని విమర్శించారు.

బనకచర్లపై ఉత్తమ్ మాటలు విడ్డూరం

» స్టడీ చేయలేదనడం బాధ్యతారాహిత్యమే

» చంద్రబాబు కనుసన్నల్లో కేంద్రమంత్రులు

» బనకచర్లపై సుప్రీం కోర్టుకెళ్తాం: హరీశ్

దుబ్బాక/హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ అక్రమంగా నిర్మించాలనుకుంటున్న బనకచర్ల ప్రాజెక్టుపై తాను స్టడీ చేయలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, అది బాధ్యతారాహిత్యమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ గోదావరిలో వాటాను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర క్యాబినెట్ భేటీలో బనకచర్లపై మాట్లాడేందుకు మంత్రులకు సమయం లేదా..? ఐదుగంటల పాటు జరిగిన సమావేశంలో కమీషన్లు, పర్సంటేజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా..? అంటూ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కుమార్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇద్దరూ ఏపీ సీఎం చంద్రబాబుకు దాసోహం అయ్యారన్నారు. రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటే, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా సతీసమేతంగా విజయవాడకు పోయి చంద్రబాబును కలిసి బజ్జీలు తినొచ్చారని వ్యాఖ్యానించారు. పదేళ్ల



రాష్ట్ర చరిత్రలో కృష్ణా జలాల్లో తక్కువ నీటిని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే వాడామని, కిందికి నీళ్లు వదిలి, ఆంధ్రాకు లాభం చేకూర్చి ఖమ్మం, నల్లగొండ జిల్లా రైతుల పంటలు ఎండబెట్టారని మండిపడ్డారు. చీటికిమాటికి ఒంటికాళ్లమీద లేచే బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు గోదావరి-బనకచర్ల మీద ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల శాశ్వతంగా తెలంగాణ తన నీటి వాటాను కోల్పోయే ప్రమాదం ఉందని, హైదరాబాద్‌కు తాగునీటి సమస్య ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు చంద్రబాబు కనుసన్నల్లోనే మెదులుతున్నారని ఆరోపించారు. బనకర్లపై బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్తుందని ఆయన చెప్పారు.

ఉద్యోగులకు కనీసం మూడు డీఏలైనా ఇవ్వాలి: బీఆర్ఎస్

కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాదిన్నరకాలం గడిచినా.. ఎన్నికల హామీలను అమలు చేయడంలేదని, క్యాబినెట్ సమావేశంలోనూ.. దీనిపై చర్చించకపోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ నేతలు అన్నారు. శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, పార్టీ నేత జి.దేవీప్రసాద్ శుక్రవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు.

అది కేసీఆర్ నిర్ణయమే



(మొదటిపేజీ తరువాయి)

లేఖ రాసింది. 152అడుగుల ఎత్తులో తుమ్మిడిహెట్టి కట్టడానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదు. 148 అడుగులకు తగ్గించుకుంటే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 15 టీఎంసీలు, గ్రామీణ తాగునీటి అవసరాలకు 10 టీఎంసీలు కలుపుకొని ప్రతిపాదిత 16.6 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించలేని పరిస్థితుల్లో ప్రాణహిత-చేవెళ్లను రీడిజైన్ చేశారు. తుమ్మిడిహెట్టి నుంచి నీరు తీసుకోలేమని తెలిసే హరీశ్‌రావు నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీ వేశారు. ఆ కమిటీలో నేను, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులుగా ఉన్నాం. ఆ నివేదికను నీటి పారుదల శాఖ పరిశీలించి, నిర్ణయం తీసుకుంది. ప్రతిపాదన దశలో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.60వేల కోట్లే. కాలక్రమంలో రైతుల విజ్ఞప్తులతో పలు మార్పుల అనంతరం అది రూ.80వేలకోట్లకు పెరిగింది. ఆ తర్వాత ఎంతకు చేరిందో నాకు తెలియదు" అని పేర్కొన్నారు.

కమిషన్: కాళేశ్వరం నిర్మించాలన్న నిర్ణయం ఎవరిది?

ఈటల: 2014 జూన్ 2 నుంచి 2018 డిసెంబరు 18 దాకా ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నా. కాళేశ్వరం బ్యారేజీలు కట్టాలని అప్పటి సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రివర్గమంతా కలిసి నిర్ణయించింది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఫలానా చోట కట్టాలని చెప్పిందెవరు?

గోదావరిలో పలు చోట్ల బ్యారేజీల కోసం సాంకేతిక అధ్యయనాలు జరిగాయి. అధ్యయనాల అనంతరం అంతిమంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో కట్టాలని సాంకేతిక నిపుణులు చెప్పారు.

కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఎందుకు ఏర్పాటు చేశారు? ప్రాజెక్టు నుంచి జనరేట్ అయ్యే నిధుల నుంచి రుణాలు తిరిగి చెల్లిస్తామని విజయ బ్యాంకుకు చెప్పారా?

ప్రభుత్వం వద్ద ప్రాజెక్టుల నిర్మాణానికి సరిపడా నిధులు లేనందువల్ల నిధుల సమీకరణ కోసం కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రుణాలు తీసుకోవడానికి అవసరమైన గ్యారంటీల పైనే ప్రభుత్వం సంతకాలు చేసింది. అయితే ప్రతిపాదిత తాగు, పారిశ్రామిక అవసరాలకు ఇచ్చే నీటిపై చార్జీలు వసూలు చేసి, రుణాలను తిరిగి చెల్లించాలనుకున్నాం. కానీ తాగునీటికి చార్జీలు వసూలు చేయలేదు. 2018 తర్వాత బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిధులను సమీకరించుకొని కాళేశ్వరం కార్పొరేషనే చెల్లింపులు చేసుకుంది.

బ్యారేజీల నిర్మాణ స్థలాలను మీరు వ్యతిరేకించారా?

ఏ నిర్ణయమైనా నీటి పారుదల శాఖలోని సాంకేతిక కమిటీ మాత్రమే తీసుకోగలదు.

ఆర్థిక క్రమశిక్షణ పాటించలేదనేది వాస్తవమేనా?

నీటిపారుదల శాఖకు సొంతంగా ఆర్థిక విభాగం ఉంది. ఆర్థిక క్రమశిక్షణ బాధ్యత ఆ విభాగానిదే.

కాళేశ్వరం సమాచారమంతా కేసీఆర్, హరీశ్ వద్దే ఉంది

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారమంతా కేసీఆర్, హరీశ్ వద్దే ఉందని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఆర్థిక శాఖ పాత్ర పెద్దగా ఏమీ లేదని చెప్పారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా విలువలకు కట్టుబడే ఉన్నానని, తన కణతపై తుపాకీ పెట్టినా నిజాలే చెప్తానని పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ లేఖతోపాటు సాంకేతిక కమిటీ సిఫారసులతో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటిదాకా చేపట్టిన పరీక్షల వివరాలతోపాటు కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రభుత్వం బయటపెట్టాలని కోరారు. కాళేశ్వరం సృష్టికర్త కేసీఆరేనని, తాను కాదని గుర్తుచేశారు. కాగా, జస్టిస్ ఘోష్ తనతో వ్యవహరించిన తీరు పట్ల ఈటల సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విచారణలో తనకు సముచిత గౌరవం లభించినట్టు ఈటల తన సహచరుల వద్ద వ్యాఖ్యానించినట్లు సమాచారం.

మహేశ్‌గౌడ్‌వి అవగాహనలేని దద్దమ్మ మాటలు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్.. అవగాహన లేని దద్దమ్మలా మాట్లాడుతున్నారని ఈటల మండిపడ్డారు. తన నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం నిర్మాణానికి, ఆర్థిక శాఖకు సంబంధం లేదని స్పష్టం చేశారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు హాజరైనట్లు తెలిపారు. ఇరిగేషన్ శాఖలో అకౌంట్ ఆడిట్ డిపార్టుమెంట్ బిల్లులు పంపిస్తే ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేస్తారే తప్ప మంత్రి వరకు రాదని వివరించారు. బడ్జెట్ కంటే ఎక్కువ ఖర్చయితే.. మంత్రివర్గ ఆమోదం తీసుకుని విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. ఇవేమీ తెలియకుండా మాట్లాడేవారిని చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావట్లేదన్నారు. ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి కుటుంబ సభ్యులు 10శాతం కమీషన్ చెల్లిస్తేనే బిల్లులు ఇస్తున్నట్టు తెలిసిందని, తాను మంత్రిగా ఉన్నప్పుడు అలాంటిదెప్పుడూ జరగలేదని వివరించారు. హరీశ్‌రావును తాను కలిసినట్లు దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో మాదిరిగానే.. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని ఆరోపించారు.

క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు

» క్రిటికల్ మినరల్స్ కోసం పలు దేశాలతో ఒప్పందాలు

» కోల్ ఇండియా లాంటి కేంద్ర సంస్థలు విదేశాల్లో గనుల నుంచి క్రిటికల్ మినరల్స్‌ను వెలికితీయాలి

» కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కర్బన ఉద్గారాలను తక్కువగా విడుదల చేసే ఇంధనాలను(క్లీన్ ఎనర్జీ) ప్రోత్సహించడంలో భాగంగా లిథియం, కోబాల్ట్‌లతో పాటు అత్యంత అరుదైన ఖనిజ వనరులను(క్రిటికల్ మినరల్స్) వెలికితీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అర్జెంటీనాలోని క్యాటామార్కా ప్రావిన్స్‌లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాబిల్ ఇప్పటికే 15 వేల హెక్టార్ల ప్రాంతంలో లిథియాన్ని వెలికితీస్తోందని తెలిపారు. అరుదైన ఖనిజ వనరుల శుద్ధిపై శుక్రవారం ఢిల్లీలో జరిగిన సెమినార్‌లో కిషన్ రెడ్డి మాట్లాడారు. కోల్ ఇండియా, హిందుస్థాన్ కాపర్, సింగరేణి సంస్థలు దేశంలో, విదేశాల్లో గనులను సొంతం చేసుకుని, ఖనిజాల వెలికితీత పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. విదేశాల్లో ఉన్న ఖనిజ వనరులను వెలికితీసి, దిగుమతి చేసుకోవడానికి ఆస్ట్రేలియా, అర్జెంటీనా, చిలీ వంటి దేశాలతో భారత్ ఇప్పటికే ద్వైపాక్షిక ఒప్పందం చేసుకున్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం భారత్ ఈ క్రిటికల్ మినరల్స్‌ను 100% విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. 2040 నాటికి వీటి డిమాండ్ 4 నుంచి 6 రెట్లు పెరగనుందని కిషన్‌రెడ్డి చెప్పారు.

నువ్వు బీజేపీ ఎంపీవా? బీఆర్‌ఎస్ నేతవా?

కేసీఆర్, హరీశ్‌పై డైలాగ్స్ వేస్తివి కదా.. ఏమైంది?.. కాళేశ్వరం డిజైన్ తప్పు.. అది జగమెరిగిన సత్యం

» ఢిల్లీ నేతల డైరెక్షన్‌లోనే కేసీఆర్‌కు క్లీన్‌చిట్ ఇచ్చావా?

» బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై జగ్గారెడ్డి మండిపాటు

» అప్పుడైనా, ఇప్పుడైనా రేవంత్‌ది ఒకటే విధానమని వెల్లడి

హైదరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈటల రాజేందర్.. నువ్వు బీజేపీ ఎంపీవా? బీఆర్ఎస్ నేతవా? అని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నిలదీశారు. గతంలో పీసీసీ చీఫ్‌గా చేసినా.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినా కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి ఒక్కటే విధానంతో ఉన్నారని తెలిపారు. గాంధీభవన్‌లో శుక్రవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ఈటల రాజేందర్.. కేసీఆర్‌కు క్లీన్‌చిట్ ఇచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లినప్పుడు కేసీఆర్, హరీశ్‌పై పెద్ద పెద్ద డైలాగ్స్ వేస్తివి కదా.. కమిషన్ ముందుకెళ్లగానే ఏమైంది? అని ప్రశ్నించారు. ఈటల స్టేట్‌మెంట్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమర్థిస్తారా? లేక వ్యతిరేకిస్తారా? వెంటనే జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. "కమిషన్ విచారణలో నీ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని కేసీఆర్‌తో కవిట్ అయ్యావా? అది కూడా కిషన్‌రెడ్డికి చెప్పే కమిట్ అయినట్లు మాకు అనుమానం ఉంది. బీజేపీ ఢిల్లీ నేతల డైరెక్షన్‌లోనే కేసీఆర్‌కు క్లీన్‌చిట్ ఇచ్చినట్టుగా ఉంది" అని మండిపడ్డారు. పదేళ్లపాటు బీఆర్ఎస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందంటూ స్వయంగా మోదీ, అమిత్‌షా విమర్శించారని, ఇప్పుడు కూడా ఆ మాటకే కట్టుబడి ఉన్నారా? లేదా? వెంటనే బదులివ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం డిజైన్ తప్పు అనేది.. జగమెరిగిన సత్యమని, ఆయా అక్రమాల్లో ఈటల కూడా భాగస్వామేనని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్.. మొదటి నుంచి కాళేశ్వరం అక్రమాలు బయట పెడుతూనే ఉన్నారని, ప్రజల సొమ్ము కాపాడే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరంపై అప్పుడెప్పుడో టెంప్ట్ అయ్యానని, త్వరలోనే ఆ ప్రాజెక్టులో జరిగిన అక్రమాల గుట్టు విప్పుతానని జగ్గారెడ్డి తెలిపారు.



గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఈ నెలలోనే

పీసీసీ కొత్త కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణ!

» ఎమ్మెల్యేలు పనితీరును సమీక్షించుకోవాలి

» కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెలలోనే పీసీసీ కార్యవర్గ నియామకంతో పాటు మంత్రివర్గ విస్తరణకు అవకాశం ఉందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. ఎమ్మెల్యేలు తమ పనితీరును సమీక్షించుకోవాలని హితవు పలికారు. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సమక్షంలో జరిగిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో సంబంధిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి, బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం జరగాలని.. పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పార్టీ సమర్థంగా పనిచేస్తేనే మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశముంటుందని తెలిపారు. ఉచిత బస్సు మొదలుకొని సన్న బియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఆశించిన స్థాయిలో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని.. కార్యకర్తలు నిరాశగా ఉన్నారని చెప్పారు. వారిని సమన్వయం చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుగా మనపై ఉందని వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాల కోసం ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఆయన అన్నారు.



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్, చిత్రంలో మీనాక్షి నటరాజన్

ఈటల.. కాళేశ్వరం నిధులతో సంబంధం లేదా?

కేసీఆర్‌ను కాపాడేందుకు వకల్తా పుచ్చుకుని ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ ఎదుట వివరణ ఇచ్చినట్టుగా ఉందని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశమంతా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కోడై కూస్తే.. అప్పటి ఆర్థికమంత్రి ఈటల ప్రాజెక్టు నిధులతో తనకు సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ తప్పేమీ లేదన్నట్లుగా, అంతా క్యాబినెట్ నిర్ణయం మేరకే జరిగిందని ఈటల బుకాయిస్తున్నారని విమర్శించారు. పక్కా ముందస్తు ప్లాన్ ప్రకారం కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల కూడబలుక్కొని ఒక్కటే సమాధానాలు చెప్పాలనుకున్నారన్నారు. కమిషన్ ఎదుట విచారణ అనంతరం ఈటల చేసిన వ్యాఖ్యలతో.. హరీశ్‌తో ఆయన రహస్యంగా భేటీ అయ్యారంటూ తాను చేసిన వ్యాఖ్యలే నిజమని తేలిందన్నారు. కాళేశ్వరం అవినీతిలో ఈటలకు సైతం వాటాలు ముట్టినందునే కేసీఆర్‌కు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. 'ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను పెంచినట్లు ఈటల చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఏటీఎంలా మారిందని.. వేల కోట్ల అవినీతి జరిగిందని మొత్తుకున్న ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ నేతలు ఇప్పుడేమంటారు? ఈటలతో పాటు మీకు కూడా కాళేశ్వరం కమీషన్లు అందాయా? బీఆర్ఎస్‌తో బీజేపీకి ఉన్న లోపాయికారి ఒప్పందం మేరకే కేసీఆర్‌ను కాపాడేందుకు ఈటలతో వివరణ ఇప్పించారా? దీనిపై బీజేపీ నాయకత్వమే సమాధానం చెప్పాలి' అని అన్నారు.

ఏడాదిలో 'టాస్క్' ద్వారా 4,100 ఉద్యోగాలు

» గరిష్ఠ వార్షిక ప్యాకేజీ రూ.11 లక్షలు, కనిష్ఠం రూ.2.4 లక్షలు

» 1,37,677 మంది విద్యార్థులు, 2,791 మంది ఫ్యాకల్టీకి శిక్షణ

» వికలాంగులు ఎదిగేందుకు టాటా ట్రస్ట్‌తో ఒప్పందం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 4,100 మంది ఉద్యోగాలు సాధించడంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి (టాస్క్) కీలక పాత్ర పోషించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 6 వేలకు తగ్గొద్దని లక్ష్యాన్ని నిర్దేశించారు. శుక్రవారం సచివాలయంలో 'టాస్క్' చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. నిరుద్యోగులకు, విద్యార్థులకు నైపుణ్యాలను అందించడంలో టాస్క్ గణనీయమైన పురోగతి సాధించిందని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక శిక్షణను అందిస్తోందని తెలిపారు. ఈ ఏడాది టాస్క్ సంస్థ రికార్డు స్థాయిలో 1,37,677 మంది విద్యార్థులు, 2,791 మంది ఫ్యాకల్టీ సభ్యులకు వివిధ సాంకేతిక, నైపుణ్య అంశాల్లో శిక్షణ అందించిందని శ్రీధర్ బాబు వెల్లడించారు. వెరిస్క్ అనలైటిక్స్ అనే అమెరికన్ కంపెనీ ఏడాదికి రూ.11 లక్షల ప్యాకేజీతో సాంకేతిక నిపుణులను ఎంపిక చేసుకోగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్(యూబీఎస్) రూ.6 లక్షల వార్షిక ప్యాకేజీతో 63 మందిని నియమించుకుందని తెలిపారు. హ్యుండాయ్ మోబిస్ సంస్థ టాస్క్ ద్వారా 42మందికి శిక్షణ అందించి ఉద్యోగాల్లో నియమించుకుందని వివరించారు. ఉద్యోగాలు సాధించిన మొత్తం 4100 మందిలో, కనీస వార్షిక ప్యాకేజీ రూ.2.4 లక్షలుగా ఉందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

ఐక్యరాజ్య సమితి సదస్సుకు హాజరైన టాస్క్ విద్యార్థులు

వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ ఫౌండేషన్ తెలంగాణలో ఏర్పాటు చేసిన గ్రీన్ స్కిల్స్ అకాడమీ ద్వారా మేడ్చల్, సంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల నుంచి ఏడు వేల మంది విద్యార్థులు శిక్షణ పొందారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ఐక్యరాజ్య సమితి ఇటీవల న్యూయార్క్‌లో నిర్వహించిన గ్లోబల్ సదస్సుకు హాజరైన నలుగురు విద్యార్థులను ఆయన ప్రశంసించారు. అంగ వైకల్యం ఉన్న యువతకు వివిధ నైపుణ్యాల్లో శిక్షణనిచ్చి ఉద్యోగాలు పొందేలా, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా టాటా ట్రస్ట్‌తో టాస్క్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని వెల్లడించారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల. చిత్రంలో మంత్రి పొన్నం

కేంద్రం పూర్తిస్థాయిలో ఎరువులను సరఫరా చేయడం లేదు

- ఈ నెల 9న కేంద్ర మంత్రిని కలుస్తాం: తుమ్మల
- సాగులో విప్లవాత్మక మార్పు కోసమే కిసాన్ మేళా: పొన్నం

హుస్నాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఎరువులను పూర్తి స్థాయిలో అందించడం లేదని, ఈ విషయంపై 9న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. అయినా రాష్ట్రంలో ఎరువులు, విత్తనాలకు కొరత లేకుండా ముందే బఫర్ స్టాక్ పెట్టుకున్నామని చెప్పారు. ఈ వరినాట్లకు ముందే భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన రైతు మహోత్సవాన్ని (కిసాన్‌మేళా) ప్రారంభించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వానికి యేటా రూ. వెయ్యి నుంచి రెండు వేల కోట్లు నష్టం వస్తున్నా రైతులను ఆదుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామని చెప్పారు. రైతాంగాన్ని ప్రభుత్వం, ప్రతిపక్షాలు కన్నకొడుకుల్లా చూసుకోవాలని హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేందుకే కిసాన్ మేళా ఏర్పాటు చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగం సంతోషంగా ఉండాలనే ఏకైక లక్ష్యంతో పని చేస్తున్నారని తెలిపారు.

పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు:పొంగులేటి



హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పట్టణాల్లోనూ ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం సాగిస్తున్న పేదలకు హైదరాబాద్‌కు దూరంగా ఇళ్లను నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందనే భావనతో ఇళ్లను తీసుకునేందుకు ఆసక్తి చూపడంలేదన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని.. హైదరాబాద్‌లోని మురికివాడల్లో ఉంటున్న పేదలకు, వారున్న చోటే గ్రౌండ్ ఫ్లస్ 3 అంతస్తుల విధానంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి వారికి ఇవ్వాలనే నిర్ణయించిన్నట్టు వెల్లడించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలివిడతలో 16 మురికివాడలను గుర్తించామని తెలిపారు. సీఎం రేవంత్ సూచనల మేరకు గిరిజనులకు భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని చెంచు, కోలం, తోటి, కొండరెడ్డి జాతులకు 13,266 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. 16 ఎస్టీ నియోజకవర్గాలకు ఇప్పటికే 8,750 ఇళ్లను మంజూరు చేశామని.. ఈ రెండింటితో కలిపి గిరిజనులకు ఇప్పటివరకు 22,016 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు.

రాజన్న కోడెలపై రాజకీయం వద్దు: సురేఖ

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న కోడెలపై రాజకీయం చేయవద్దని మంత్రి కొండా సురేఖ అన్నారు. రాజన్న కోడెల దుస్థితికి కారణం కేసీఆర్ పాలనే అని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో రాజన్న ఆలయ అభివృద్ధికి చేసిందేమి లేదన్నారు. కోడెల ఘటన జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించిందని, తగిన చర్యలు చేపట్టి ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. అయినా ప్రతిపక్షాలు ఈ విషయంలో బురద రాజకీయం చేయడం సరికాదని విమర్శించారు. రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తానని దేవుడిని మోసం చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌ది కాదా అని ప్రశ్నించారు.

రక్షణ రంగంలో ఎగుమతులు ప్రధాని మోదీ ప్రభుత్వ విజయమే

- కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్

హైదరాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు రక్షణ రంగ ఉత్పత్తులను దిగుమతి చేసుకునే దశ నుంచి ఇప్పుడు ఎగుమతులు చేసే స్థాయికి భారత్ ఎదిగిందని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. గతంలో బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు కూడా దిగుమతి చేసుకునే వారమని ఆయన గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు రక్షణ రంగ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని, ఇది ముమ్మాటికీ మోదీ ప్రభుత్వం సాధించిన విజయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్ సేథ్ మాట్లాడారు. 2027 నాటికి ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా భారత్ ఎదగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని, భారత వైమానిక దళం కేవలం 23 నిమిషాల్లో 9 ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందన్నారు.

మరో రూ.3000 కోట్ల అప్పు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.3000 కోట్ల అప్పు తీసుకోనుంది. ఈమేరకు శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఇండెంటు పెట్టింది. 30 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 31 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 32 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్ల చొప్పున రుణం తీసుకోనుంది. దేశంలోని 8 రాష్ట్రాలు రూ.18,330 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐకి ఇండెంట్లు పెట్టాయి. ఈ నెల 10న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా ఈ రుణాలను తీసుకోనున్నాయి.

అత్యవసర సేవల్లో డయల్ 112

- కత్తిపోట్లకు గురైన వ్యక్తిని కాపాడిన ఫోన్‌కాల్
- టీజీఐసీసీసీ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి సీఎం ఆదేశాలతో ఏర్పాటయిన డయల్ 112 సమర్థమైన సేవలను అందిస్తోందని టీజీఐసీసీసీ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని ఓ వ్యక్తి మరో వ్యక్తిని కత్తితో పొడిచాడని, గాయపడిన అతని పరిస్థితి విషమంగా ఉందంటూ గురువారం రాత్రి 10.07 నిమిషాలకు డయల్ 112 సిబ్బందికి ఒకరు ఫోన్ చేశారని ఆయన తెలిపారు. 'గాయపడిన వ్యక్తి కామారెడ్డి జిల్లా బాన్సువాడ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని తంగోజీపేట తండాలో ఉన్నాడని తెలిసింది. కంట్రోల్ రూం నుంచి బాన్సువాడ పోలీసులను అప్రమత్తం చేశాం. ఐదు నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అదే సమయానికి అంబులెన్స్‌ను పంపించాం. బాధితుడిని సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది'అని వివరించారు. రాష్ట్రంలోని ఎక్కడి నుంచైనా ఆపదలో ఉన్నామని 112నంబర్‌కు కాల్ వస్తే శరవేగంతో స్పందిస్తామని తెలిపారు.

గవర్నర్, సీఎం బక్రీద్ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని, భాగస్వామ్యం, దానధర్మం, గౌరవం, అవసరమైన వారికి సాయం చేయడం ఈ పండుగ ఉద్దేశాలని గవర్నర్ పేర్కొన్నారు. దైవభక్తి, త్యాగ నిరతికి బక్రీద్ అద్దం పడుతుందని.. దాతృత్వాన్ని మించి మరొకటి లేదనే స్ఫూర్తిని ఈ పండుగ చాటిచెబుతోందని సీఎం పేర్కొన్నారు. ఇటు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్


లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మండలి ఛైర్మన్ గుత్తా, మంత్రులు తుమ్మల, దామోదర రాజనర్సింహ, పొంగులేటి, కోమటిరెడ్డి, ఉత్తమ్

పదేళ్లు అధికారం ఇవ్వాలి

తనను పడగొట్టాలని చూస్తున్నారని, ప్రజలు తనకు పదేళ్ల అధికారం ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారు. ఇతర దేశాలతో పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దుతానన్నారు. తనకు ప్రత్యేకంగా కోరికలేమీ లేవని, రాష్ట్రాన్ని న్యూయార్క్, టోక్యో మాదిరిగా అభివృద్ధి చేస్తానని, లక్ష బిలియన్ డాలర్ల ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రకటించారు. గత పాలకులు యాదగిరిగుట్ట ఆలయ పనుల్లో కాంట్రాక్టులు ఇచ్చి కమీషన్లు మెక్కారని రేవంత్ ఆరోపించారు. యాదగిరిగుట్టను అపవిత్రం చేసినందుకు తగిన శిక్ష పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రోజే ఆయన బాత్రూమ్‌లో కిందపడి కాలు విరిగింది వాస్తవం కాదా? అని అన్నారు. గత ప్రభుత్వం యాదగిరిగుట్టను యాదాద్రిగా మారిస్తే తాము వచ్చాక యాదగిరిగుట్టగా మార్చామని తెలిపారు. 60 కిలోల బంగారంతో స్వామివారి విమాన గోపురాన్ని స్వర్ణమయం చేశామన్నారు. భక్తుల కోరిక మేరకు పాత సంప్రదాయాలను పునరుద్ధరించామని పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు కేసీఆర్ ఫాంహౌస్‌కు వినపడాలన్నారు. బీఆర్ఎస్ పార్టీలో దయ్యాలు ఉన్నాయని సొంత బిడ్డ ఆరోపించినా కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ఆ దయ్యాలు ఎవరో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ కమిషన్ ఒక్క నోటీసు ఇస్తేనే కేసీఆర్ ఆగమాగం అవుతున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. "అప్పట్లో మాజీ ప్రధానమంత్రి (పీవీ నరసింహారావు)కి సెషన్స్ కోర్టు నోటీసు ఇస్తే కోర్టు ముందు హాజరయ్యారు. అంతకంటే గొప్పవాడివా నువ్వు? గతంలో నన్ను జైలులో పెడితే తొడగొట్టి పడగొట్టా. ఆ కుర్చీలో కూర్చున్నా. పట్టుబట్టి నా లక్ష్యం నెరవేర్చుకున్నా" అని అన్నారు. బంగారు తెలంగాణ ముసుగులో బొందల తెలంగాణ చేసిపోయినోళ్లు మమ్మల్ని విమర్శిస్తారా? అని మండిపడ్డారు.



మూసీ పునరుజ్జీవం చేసి తీరుతాం..

కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లేందుకు రోడ్డుకోసం దత్తత గ్రామం వాసాలమర్రిని ఆగం చేశారని, ఇళ్లన్నీ కూలగొట్టి గ్రామస్తులను రోడ్డున పడేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. తాను అలా వదిలేయనని, వాసాలమర్రి వాసుల ఇక్కట్లు తీరుస్తానని ప్రకటించారు. తన పుట్టినరోజు నాడు మూసీ ప్రక్షాళనపై పాదయాత్ర నిర్వహించి, ఈ ప్రాంతవాసుల బాధలు గమనించానని తెలిపారు. ఆరు నూరైనా.. అడ్డం పడినా తొక్కుకుంటూ వెళ్లి మూసీ పునరుజ్జీవం చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. ఈ ప్రాంత బిడ్డలు మూసీ విషంతో విషమ పరిస్థితిని ఎదుర్కోవాల్సిందేనా? అని నిలదీశారు. మూసీ ప్రక్షాళన చేపట్టి.. మూసీని గోదావరి జలాలతో నింపుతామని అన్నారు. నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి, తదితర సాగునీటి కాలువలు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. గంధమల్లకు నీరు ఎక్కడి నుంచి ఇస్తారంటూ హరీశ్‌రావు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని, నిధులు ఇచ్చినవారు నీరు ఇవ్వలేరా? అని వ్యాఖ్యానించారు.

యాదగిరిగుట్టలో వర్సిటీ, విద్యాసంస్థలు..

యాదగిరిగుట్ట దేవస్థానానికి ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో బోర్డు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ అన్నారు. త్వరలో వైటీడీఏ పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తిరుమల తరహాలోనే ఇక్కడ కూడా విద్యాసంస్థలను యూనివర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తామని, ప్రఖ్యాత యూనివర్సిటీని, గొప్ప విద్యాసంస్థలను నెలకొల్పుతామని, గోశాలలు, భక్తులకు సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. టీటీడీ తరహాలోనే వైటీడీఏ కూడా మున్ముందు సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారమవుతాయని హర్షం వ్యక్తం చేస్తుంటే.. బీఆర్ఎస్ వాళ్లు మాత్రం విమర్శలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీన జీతాలివ్వలేని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం 5 లక్షల మంది ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు వేస్తున్నామని అన్నారు. ఎందరో త్యాగధనులు, ఉద్యమకారులు పుట్టిన చైతన్యవంతమైన ప్రాంతంగా నల్లగొండ జిల్లాకు పేరుందన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు నుంచి అభినందనలు అందుకోవడమంటే మామూలు విషయం కాదని సీఎం వ్యాఖ్యానించారు. ఎస్సీ కులాల వర్గీకరణ చేసినప్పుడు నరసింహులు తనను అభినందించారన్నారు. ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్యను కూడా నరసింహులు లాగే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సీఎం పర్యటనలో పాల్గొన్నారు. కాగా, మూసీ ప్రక్షాళన విషయంలో సీఎం నిర్ణయానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజానీకం అండగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ సభా వేదిక నుంచి ప్రకటించారు.

రూ.1051.45 కోట్ల పనులకు శంకుస్థాపన

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో చేపట్టనున్న తొమ్మిది శాఖలకు చెందిన రూ.1051.45 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుర్కపల్లి మండలం తిరుమలాపురంలో శంకుస్థాపన చేశారు. రిమోట్ ద్వారా శిలాఫలకాలను ప్రారంభించారు. వీటిలో రూ.574 కోట్లతో గంధమల్ల రిజర్వాయర్ పనులు, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం, యాదగిరిగుట్టలో రూ.183 కోట్లతో నూతన ప్రభుత్వ ఆస్పత్రి, కళాశాల నిర్మాణం తదితర పనులు ఉన్నాయి. ఈ సందర్భంగా ముగ్గురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు రూ.54.70 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక సాంకేతికతతో ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వుతాం

- ఉమ్మడి నల్లగొండలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- సన్న బియ్యంతో 80% ప్రజలకు కడుపు నిండా అన్నం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



యాదాద్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తిరుమలాపురంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సన్న బియ్యం ద్వారా 80 శాతం ప్రజలకు కడుపు నిండా అన్నం పెడుతున్నామన్నారు. దశాబ్ద కాలంగా పెండింగులో ఉన్న గంధమళ్ల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను రూ.574 కోట్లతో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎక్కువ గ్రామాలు ముంపునకు గురికాకుండా రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.4టీఎంసీలకు తగ్గించి, 60వేల ఎకరాలకు నీరు ఇచ్చేలా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. గత ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ, డిండిప్రాజెక్టులతో పాటు కృష్ణా నదిపై ఎత్తిపోతల పథకాలను చేపట్టలేదని, తమ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్మాణంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఎత్తిపోతల పథకాల కింద భూసేకరణ బాధ్యతను సంబంధిత శాసనసభ్యులు తీసుకోవాలన్నారు. రూ.1,800కోట్లతో ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టును మొదలుపెట్టబోతున్నామని, తమ హయాంలోనే పూర్తిచేస్తామని మంత్రి తెలిపారు.

చెప్పనివీ చేస్తున్నాం: కోమటిరెడ్డి



తాము ఇచ్చిన వాగ్దానాలే కాకుండా, ఇవ్వని వాటిని కూడా నెరవేరుస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని చెప్పారు. ఆలేరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికీ మంచినీరు ఇవ్వనున్నామని, యాదగిరిగుట్ట మునిసిపాలిటీలో తాగునీటితో పాటు ఇళ్లు, డ్రైనేజీలు కట్టిస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఏఎమ్మార్పీ కింద మిగిలిపోయిన 10కిలోమీటర్ల ఉప కాలువ పనులను పూర్తి చేయాలని కోరారు. తుర్కపల్లికి పారిశ్రామిక పార్కు మంజూరు చేయాలని, గుండాల కాల్వ పనులకు నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు.

నెలకు రెండుసార్లు క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పాలనలో వేగం పెంచేందుకు, విధానపరమైన నిర్ణయాల్లో జాప్యం లేకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. నెలలో మొదటి శనివారం, మూడో శనివారం క్యాబినెట్ సమావేశమై.. క్షేత్రస్థాయిలో పథుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్షించనుంది. ఈ మేరకు రెండు వారాలకు ఒకసారి క్యాబినెట్ సమావేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు 17 మంత్రివర్గ సమావేశాలను నిర్వహించారు. వీటిలో గురువారం (ఈ నెల 5న) నిర్వహించిన సమావేశంలో ఏకంగా 24 అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం మంత్రివర్గ సమావేశాల్లో అత్యధిక నిర్ణయాలు తీసుకున్నది ఈ భేటీలోనే. కాగా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, అధికార యంత్రాంగం పనితీరు సహా పలు కారణాలతో మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ఆశించిన స్థాయిలో క్షేత్రస్థాయికి వెళ్లడంలేదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో నెలలో రెండుసార్లు క్యాబినెట్ భేటీ నిర్వహించాలని, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ఎంతమేరకు క్షేత్రస్థాయికి చేరాయనే అంశంపై చర్చించాలని నిర్ణయించింది. తద్వారా పలు పథకాలు, కీలక అంశాలపై తీసుకున్న నిర్ణయాలు, వాటి ఉపయోగాలు ప్రజలకు త్వరితగతిన తెలిసే అవకాశం ఉంటుందని భావిస్తోంది.

దొంగల్లా దోచుకొని దయ్యాల్లా వికటాట్టహాసం

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయింది..

- ఏడాది తిరగకముందే అన్యాయం జరిగిపోయినట్టు గత పాలకుల మాటలు
- అన్యాయం జరిగింది ప్రజలకా? మీ కుటుంబానికా? కేసీఆర్..
- పదేళ్లలో పాలమూరులో ఒక్క ఎకరాకూ నీరివ్వలేదు: భట్టి


మూసాపేటలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క.. చిత్రంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని, ఇప్పుడిప్పుడే గాడినపడుతోందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన గత పాలకులు ఏడాది తిరగకముందే అన్యాయం జరిగిపోయిందన్నట్లుగా మాట్లాడుతున్నారన్నారు. 'అన్యాయం జరిగింది? ప్రజలకా? మీకా.. మీ కుటుంబానికా?' అని కేసీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ మొసలి కన్నీరు కార్చుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ప్రజలకు ఏమీ చేయకపోగా రాష్ట్రాన్ని దొంగల్లా దోచుకొని దయ్యాల్లా వికటాట్టహాసం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల కేంద్రంలో దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి 12 సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగసభలో భట్టి మాట్లాడారు. పదేళ్లలో పాలమూరులో ఒక్క ఎకరాకూ నీరివ్వలేదన్నారు. ప్రజలకు కాంగ్రెస్ హయాంలో మంచి జరుగుతుంటే చూసి సంతోషించాలన్నారు. దోపిడీకి పాల్పడకుండా రాష్ట్ర సంపదను ప్రజలకే పంచుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో గతంలో గిరిజనులు, ఆదివాసులకు 6.70 లక్షల ఎకరాలను పంచితే పదేళ్ల పాలనలో ఆ భూముల సాగుకు కరెంట్ ఇవ్వలేదని, రైతులే బోర్లు వేసుకొని పంటలు పండించినా వాటిని అమ్ముకునే పరిస్థితిలేకుండా బుల్డోజర్లతో తొక్కించారన్నారు. మహిళలను చెట్టుకు కట్టేసి కొట్టారని గుర్తు చేశారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇందిరా సౌర గిరి జల వికాసంతో ఆ 6.70 లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చేందుకు రూ.12,500 కోట్లతో సోలార్ పవర్ పంపుసెట్లు ఏర్పాటు చేయించి ఉద్యానవ న పంటలు వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక దుర్భర పరిస్థితులున్నా గత ప్రభుత్వం అమలుచేసిన పథకాలను తొలగించకుండా కొనసాగిస్తూనే ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, ఇందిరా సౌర గిరి జల వికాసంతోపాటు రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్ నాయకత్వంలో అభివృద్ధిలో తెలంగాణ దేశంలోని రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. వరంగల్ సభలో కేసీఆర్ మాట్లాడుతూ 17 నెలల కాంగ్రెస్ పాలనను చూస్తుంటే దుఃఖం వస్తోందనడం విడ్డూరంగా ఉందన్నారు. 'నీ దుఃఖం అధికారం పోయిందనా, ప్రజల కోసమా' అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని 65 ఏళ్లు 22 మంది ముఖ్యమంత్రులు పాలించి రూ.65 వేల కోట్లు అప్పుచేస్తే ఒక్క కేసీఆర్ పదేళ్లలో రూ.7.30 లక్షల కోట్లు అప్పుచేశారన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు నెలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6 వేల కోట్లు కడుతోందని, లేకుంటే కాంగ్రెస్ చెప్పిన హామీల అమలుకు సమస్యే ఉండేది కాదన్నారు. వందేళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ ఖాతాలో రూ.15 కోట్లు ఉంటే.. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఖాతాలో రూ.1,500 కోట్లు ఉన్నాయని, ఎంతలా దోపిడీ చేయకపోతే అంత డబ్బు ఖాతాలో ఉంటుందని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు జి మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మేఘారెడ్డి పాల్గొన్నారు.

సీఎంతో మీనాక్షి నటరాజన్ భేటీ

- మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కమిటీ నియామకంపై ప్రధాన చర్చ

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి మీనాక్షి కలిశారు. సుమారు గంటకు పైగా వారు చర్చలు జరపడం రాజకీయ వర్గాల్లో పలు ఊహాగానాలకు దారితీసింది. అయితే రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులతో పాటు ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ, పీసీసీ నూతన కమిటీల నియామకం చర్చకు రాగా.. పార్టీ నేతల మధ్య కొరవడిన సమన్వయం, నామినేటెడ్ పోస్టుల భర్తీ, స్థానిక ఎన్నికలకు సన్నద్ధత తదితర అంశాలనూ మీనాక్షి చర్చలో ప్రస్తావించినట్లు తెలిసింది. వారం పది రోజులుగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ ముఖ్య నేతలతో జరిపిన సమీక్షల్లో వెల్లడైన అంశాలను మీనాక్షి ఈ సందర్భంగా సీఎం దృష్టికి తెచ్చినట్టు సమాచారం. పార్టీలో అంతర్గత విభేదాలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై వారు చర్చించినట్లు తెలిసింది. పార్టీ కార్యకర్తలు, నాయకులను పట్టించుకోని కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలపై వచ్చిన ఫిర్యాదులను మీనాక్షి సీఎంకు వివరించినట్లు సమాచారం. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి పార్టీ శ్రేణులను నిర్లక్ష్యం చేస్తున్న నాగర్‌కర్నూల్ ఎంపీ, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవిపై మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ చేసిన ఫిర్యాదు ప్రస్తావించినట్టు తెలిసింది. అలాగే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నేతల మధ్య సమన్వయ లోపమే కారణమని మీనాక్షి తెలిపినట్లు సమాచారం. నియోజకవర్గాల నేతలు సోషల్‌మీడియాను వినియోగించుకోవడంలో వెనుకబడి ఉన్నారని.. ఇతర పార్టీల్లో మాదిరిగా కాంగ్రెస్‌నేతలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని మీనాక్షి వివరించినట్లు సమాచా రం. ఈ సందర్భంగా ఆయా అంశాలపై చర్యలు తీసుకుంటామని సీఎం హామీనిచ్చినట్టు తెలిసింది.

పెట్ స్కానింగ్‌లో వాడే నీళ్లు.. లీటరు 25 లక్షలు

మణుగూరు భారజల కర్మాగారంలో తయారవుతాయి

- అశ్వాపురం, కోటా ప్లాంట్ల సామర్థ్యం పెంచేలా చర్యలు
- భవిష్యత్ అంతా న్యూక్లియర్ విద్యుత్తుదే
- 2047 నాటికి 100 గెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం
- హెవీవాటర్ బోర్డు ఛైర్మన్ సత్యకుమార్ వెల్లడి

భద్రాచలం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పెట్ స్కానింగ్‌లో వాడే ఓఎటైన్ నీటిని అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారంలో తయారు చేస్తున్నామని హెవీవాటర్ బోర్డు ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం తన కుటుంబసభ్యులు, అశ్వాపురం ప్లాంటు జీఎం జి.శ్రీనివాస్‌తో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమృత్‌కాల్ 2047లో భాగంగా దేశంలోని నాలుగు కీలకమైన మణుగూరు, కోటా, అజీరా, తాల్ హెవీ వాటర్ ప్లాంట్ల సామర్థ్యాన్ని మరింతగా పెంచుతున్నామని, ఇందుకు సంబంధించిన పనులు ఇప్పటికే మొదలయ్యాయని తెలిపారు. అలాగే భారత్ ఇంతకాలం క్యాన్సర్ నిర్ధారణలో వాడే పెట్‌స్కానింగ్‌లో ఉపయోగించే అబ్జర్ ఎటైన్ నీటిని అమెరికా, ఇజ్రాయెల్, కువైట్ దేశాల నుంచి దిగుమతి చేసుకునేదని, ప్రస్తుతం అశ్వాపురం ప్లాంట్‌లో ఆ నీటిని తయారు చేస్తున్నామని తెలిపారు. లీటర్ నీరు రూ.25 లక్షల వరకు ఉంటుందని, ఇంత ఖరీదైన నీటిని రాజస్థాన్‌లోని కోటా, అశ్వాపురం ప్లాంట్లలోనే తయారు చేస్తున్నామని వివరించారు. ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమివ్వడంతో మణుగూరు, కోటాలో మరింతగా భారజలం ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. 2047 నాటికి 100 గెగావాట్ల న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేసేందుకు అవసరమైన భారజలాన్ని తయారు చేసి అందించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టామని పేర్కొన్నారు. అశ్వాపురం ప్లాంట్‌లో బోరాన్ కార్బైట్ పెల్లెట్స్‌ను కూడా తయారు చేస్తున్నామని, వాటిని రెండోతరం న్యూక్లియర్ విద్యుత్ తయారీలో ఉపయోగిస్తారని సత్యకుమార్ తెలిపారు.

మాగంటికి వెంటిలేటర్‌పై చికిత్స

» ఆయన కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌కు వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. వైద్యానికి ఆయన శరీరం స్పందిస్తోందని సన్నిహితులు చెబుతున్నారు. గురువారం ఛాతీలో నొప్పి రావడంతో మాగంటి ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు సీపీఆర్ చేయడంతో కాస్త కోలుకున్నారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే సమయంలో స్పృహ కోల్పోయారు. ఆసుపత్రి వర్గాలు మరోసారి సీపీఆర్ చేయడంతో పల్స్ రేటు పెరిగింది. దీంతో ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు చెబుతున్న వివరాల ప్రకారం.. గోపినాథ్ ఆరోగ్యం గురువారం కన్నా శుక్రవారం మెరుగ్గా ఉందన్నారు. కాగా, కేటీఆర్ విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ ఆయన సతీమణి శైలిమ గురువారమే ఆసుపత్రికి వెళ్లారు. శుక్రవారం కూడా ఆమె ఆసుపత్రికి వెళ్లి మాగంటి కుటుంబసభ్యులను పరామర్శించారు. కేటీఆర్ కుమారుడు, మాగంటి కుమారుడు హైదరాబాద్‌లో కలిసి చదువుకోవడం వల్ల రెండు కుటుంబాల మధ్య మైత్రి ఏర్పడింది.

ఈసారి 69 అడుగుల విశ్వశాంతి మహాశక్తి గణపతి

» ఖైరతాబాద్ గణేషుడి రూపకల్పన పనులు ప్రారంభం

ఖైరతాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈసారి వినాయక ఉత్సవాల్లో ఖైరతాబాద్ గణపతి విశ్వశాంతి మహాశక్తి గణేషుడిగా పూజలందుకోనున్నాడు. 69 అడుగుల ఎత్తుతో నాగసర్పంపై ఐదు తలల నాగుపాము నీడన మూడు తలలు, 8 చేతులతో శాంతమూర్తిగా గణపతి దర్శనమివ్వానున్నాడు. గణేషుడికి పూరీ జగన్నాథుడు ఓ వైపు, లలితా త్రిపుర సుందరీ దేవి మరోవైపున కొలువుదీరనున్నారు. అలాగే కుడి వైపు లక్ష్మీ సమేత హయగ్రీవస్వామి, కుడి వైపు గజ్జెలమ్మ తల్లిని ఆవిష్కరిస్తున్నారు. గణపతి విగ్రహ రూపకల్పన పనులు శుక్రవారం మొదలయ్యాయి. మండపం కోసం వాడే కర్రకు పూజలు చేసి పనులు ప్రారంభించారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, రాజ్యసభ సభ్యుడు ఎం అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి కర్రపూజలో పాల్గొన్నారు.

బౌరంపేట్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించండి

» వాటితో రక్షణ సంస్థలకు ముప్పు: హైకోర్టు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం బౌరంపేట్ గ్రామం సర్వే నంబర్ 345/పీ, 347/పీ పరిధిలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని హెచ్ఎండీఏకు హైకోర్టు ఆదేశించింది. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలతో రక్షణ శాఖకు చెందిన సంస్థలకు ముప్పు కలిగే అవకాశం ఉన్నందున చట్టప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. రక్షణ సంస్థలను ఆనుకొని ఉన్న భూమిలో సంబంధిత అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసి) పొందకుండా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు చేపట్టిన నిర్మాణాలను సవాల్ చేస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై జస్టిస్ టి. వినోద్‌కుమార్ ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 2012 ఏప్రిల్ 7న మున్సిపల్ శాఖ జారీ చేసిన జీవో నంబర్ 168 ప్రకారం సంబంధిత రక్షణ శాఖ అధికారుల నుంచి ఎన్‌వోసీ పొందడం తప్పనిసరి అన్నారు. కానీ ఆ నిబంధనలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2016లో జీవో నంబర్ 7ను జారీ చేసిందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. అక్రమ నిర్మాణాలు ఉంటే తొలగించాలని ఆదేశించింది.

రాజన్న గోశాలలో మరో రెండు కోడెలు మృతి

వేములవాడ కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం తెల్లవారుజామున మరో 2 కోడెలు మృతి చెందాయి. దీంతో ఇప్పటివరకు మృతి చెందిన కోడెల సంఖ్య 31కి చేరింది. మరో 3 కోడెల పరిస్థితి విషమంగా ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో తెలిపారు. ప్రస్తుతం 11 కోడెలకు వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని, అనారోగ్యంతో ఉన్న కోడెలు కోలుకుంటున్నాయన్నారు.



కీరవాణికి డాక్టరేట్ అందజేస్తున్న ఏపీ ఎయిర్‌స్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ సలహాదారుడు సతీష్‌రెడ్డి, ఎస్సార్ వర్సిటీ చాన్సలర్ వరదారెడ్డి

స్వదేశీ శక్తిలో భారత్ ముందంజ

» డ్రోన్, రేడార్లు, మిసైళ్లతో శక్తిని చాటిన ఇండియా

» వేల కోట్ల విలువైన రక్షణ సామగ్రి ఎగుమతి

» ఎస్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సతీష్‌రెడ్డి

» ఎంఎం కీరవాణికి డాక్టరేట్ ప్రదానం

హసన్‌పర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ రంగం స్వదేశీ శక్తితో ముందుకు వెళ్తోందని ఏపీ ప్రభుత్వ ఎయిర్ స్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారుడు జి. సతీష్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో చాన్సలర్ ఎ. వరదారెడ్డి అధ్యక్షతన శుక్రవారం 3వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత్‌లో విద్యారంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతి సంవత్సరం 1.4 మిలియన్ల ఇంజనీర్లు తయారవుతున్నారని పేర్కొన్నారు. పబ్లికేషన్లు, పీహెచ్‌డీల పరంగా భారత్ 3వ స్థానంలో ఉందని చెప్పారు. రక్షణ రంగంలో డ్రోన్లు, రేడార్లు, మిసైళ్ల వ్యవస్థల ద్వారా భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటిందని తెలిపారు. గత ఏడాది రూ.24వేల కోట్ల విలువైన రక్షణ సామగ్రిని ఎగుమతి చేసిందని ఆయన పేర్కొన్నారు. కీరవాణి మాట్లాడుతూ తెలుగు సినిమాకు అందించిన గొప్ప కవిత్వ సేవలను గుర్తించి ఎస్సార్ వర్సిటీ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా చంద్రబోస్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు. 3వ స్నాతకోత్సవంలో డాక్టరేట్‌ను తాను అందుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ వర్సిటీ వీసీ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ ఆర్. అర్చనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి-బనకచర్ల అనుసంధానం అడ్డుకుంటాం

» కేంద్ర జలశక్తి, ఆర్థిక శాఖలకు లేఖలు రాశాం

» బచావత్ ట్రైబ్యునల్ ప్రకారమే వెళ్తామని కేంద్రం చెప్పింది

» కేంద్రం చట్ట వ్యతిరేకంగా వెళ్లదనే అనుకుంటున్నాం

» బీజేపీ ఎంపీలు కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలి

» విలేకరులతో చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన గోదావరి- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును అడ్డుకుంటామని, నదీ జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా కోసం ఎక్కడిదాకైనా వెళతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ అన్యాయం జరిగిందని ఆరోపించారు. కానీ, ఆ పార్టీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని చూసి జోసెఫ్ గోబెల్స్ కూడా సిగ్గుపడతారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో చిట్‌చాట్ చేశారు. గోదావరి - బనకచర్ల అనుసంధానినికి వ్యతిరేకంగా కేంద్ర జలశక్తి, ఆర్థిక శాఖతోపాటు గోదావరి నది యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీలకు పలుమార్లు లేఖలు రాశామని చెప్పారు. గోదావరి - కృష్ణా బేసిన్‌లో కొత్తగా ఏ ప్రాజెక్టును చేపట్టాలన్నా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం ఆ ప్రాజెక్టు డీపీఆర్‌ను గోదావరి, కృష్ణా బోర్డులు పరిశీలించాలని, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి అని కేంద్రానికి లేఖల ద్వారా తెలియజేశామని తెలిపారు. 'తెలంగాణ విజ్ఞప్తిని పరిశీలిస్తున్నామని, బచావత్ ట్రైబ్యునల్ ప్రకారమే గోదావరి- బనకచర్ల అనుసంధానంపై వ్యవహరిస్తాం' అని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ బదులు కూడా ఇచ్చారని ఉత్తమ్ చెప్పారు. ఈ విషయంలో కేంద్రం ఏపీకి అనుకూలంగా.. చట్ట వ్యతిరేకంగా పని చేయదని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలగకుండా గోదావరి-బనకచర్ల అంశంలో రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఉత్తమ్ కోరారు. ఇక, కృష్ణా జలాల అంశంలో బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రానికి ఎక్కువ అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004-14 దాకా శ్రీశైలం నుంచి ఇతర బేసిన్లకు 727 టీఎంసీల కృష్ణా జలాలను ఏపీ తరలించిందని, అదే 2014-23 దాకా 1201 టీఎంసీలను తరలించిందని ఉత్తమ్ అన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కలిగిన మేలు ఏమీ లేదని తెలిపారు. ఆ లక్ష కోట్లలో రూ.38 వేల కోట్లను ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలోని తుమ్మిడిహెట్టి బ్యారేజీపై, రూ.60 వేల కోట్లను కృష్ణా ప్రాజెక్టులపై పెట్టి ఉంటే 25 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందేదని ఉత్తమ్ అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల కృష్ణా జలాలు కేటాయిస్తే... అందులో 512 టీఎంసీలు ఏపీ తరలించడానికి, 299 టీఎంసీలు తెలంగాణకు చాలనే ఒప్పందాలపై బీఆర్ఎస్ హయాంలో సంతకాలు చేశారని తెలిపారు. ప్రస్తుతం తాము 811 టీఎంసీల్లో 700 టీఎంసీలను రాష్ట్రానికి కేటాయించాలని కోరుతున్నామని చెప్పారు. ట్రైబ్యునల్ చరిత్రలోనే నీటి కేటాయింపుల విచారణకు హాజరైన ఏకైక నీటి పారుదల శాఖ మంత్రి తానేనని ఉత్తమ్ వెల్లడించారు. 2014లో చేసుకున్న కృష్ణా జలాల పంపిణీ ఒప్పందం 2023 దాకా కొనసాగిందన్నారు. 2014 దాకా శ్రీశైలం నుంచి రోజుకు 47 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే తరలించే సామర్థ్యం కలిగిన ఏపీ 2023 నాటికి అది 1,11,400 క్యూసెక్కులకు చేరేలా పనులు చేసిందని తెలిపారు. ఇందుకోసం పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, మల్యాల సామర్థ్యాలను పెంచిందని వివరించారు. అలాగే, 2014కు ముందు శ్రీశైలం నుంచి రోజుకు 4.1 టీఎంసీలు మాత్రమే తరలించగా, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2023 దాకా రోజుకు 9.6 టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యాన్ని ఏపీ పెంచుకుందని చెప్పారు. ఇక రాయలసీమ ఎత్తిపోతల పథకానికి 2020 మే 5న జీవో జారీ చేస్తే.. ఆ పథకం టెండర్లు పిలిచే దాకా అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం హాజరుకాలేదని తెలిపారు. 2020 ఆగస్టు 5న జరగాల్సిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని కోరుతూ 2020 జూలై 30న కేసీఆర్ లేఖ రాశారని ఉత్తమ్ గుర్తు చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్లన్నీ పూర్తయ్యాక 2020 అక్టోబరు 20న అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగిందన్నారు. వర్కింగ్ అరేంజ్‌మెంట్ పేరుతో కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోవడానికి అవసరమైన సహకారం బీఆర్ఎస్ ఇచ్చిందని వివరించారు. కానీ, అసత్యాలు ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ నేతలు ముందున్నారని, ఆ ప్రచారాన్ని చూస్తే జోసెఫ్ గోబెల్స్ కూడా సిగ్గుపడేవారని ఉత్తమ్ అన్నారు. జోసెఫ్ గోబెల్స్ రావుగా పేరు మార్చుకోవాలని పరోక్షంగా హరీశ్ రావుకు చురకలంటించారు.

హెల్త్ కేర్ ట్రస్ట్‌కు ప్రతి నెలా రూ.59 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వాటాను ట్రెజరీ నుంచి హెల్త్‌కేర్ ట్రస్టు ఖాతాకు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులకు వైద్య సేవలు అందించిన ఆస్పత్రులకు ఈ నిధుల నుంచి చెల్లింపులు చేస్తారు. వైద్య ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం.. 2021-22 నుంచి 2024-25 మధ్య కాలంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్, నగదు రహిత వైద్యం కోసం ప్రభుత్వం రూ.2,298 కోట్లు ఖర్చుపెట్టింది. అంటే ఏడాదికి సగటున మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ.409 కోట్లు, నగదు రహిత వైద్యం కింద రూ.166 కోట్ల కలిపి రూ.575 కోట్లు వెచ్చించింది. అయితే, కొత్త ఈహెచ్ఎస్ కింద ఏడాదికి రూ.720 కోట్లు ఖర్చు పెట్టాలన్న యోచనలో సర్కారు ఉండడం గమనార్హం. అయితే, వాటా అంశంలో ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వాటాగా ఎక్కువ మొత్తం చెల్లించే వారికి అపరిమిత వైద్య సేవలను అందించాలని పలువురు కోరుతున్నారు. అయితే, వచ్చే వారం ఉద్యోగ సంఘాలతో సీఎస్ నిర్వహించే సమావేశంలో ఉద్యోగుల వాటాపై స్పష్టత వస్తుందని టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు వెల్లడించారు. కాగా, కొత్త ఈహెచ్ఎస్‌లో ఉద్యోగుల వాటా ఎంత ? అనే అంశంపై వైద్య ఆరోగ్యశాఖ గతంలో రెండు ప్రతిపాదనలు చేసింది. మొదటి ప్రతిపాదన కింద ఉద్యోగుల మూలవేతనం నుంచి ఒక శాతం మొత్తాన్ని తీసుకోవాలని ప్రతిపాదించింది. ఈ విధానం వల్ల ప్రతీనెలా సుమారు రూ.29.19 కోట్లు, ఏడాదికి రూ.350 కోట్లు జమ అవుతాయని అంచనా వేసింది. ఈ మొత్తానికి ప్రభుత్వం నుంచి మరో రూ.250 కోట్లు జమ చేస్తే మొత్తంగా రూ.600 కోట్లు అందుబాటులో ఉంటాయనేది అంచనా. ఇక, రెండో ప్రతిపాదన కింద ఉద్యోగుల మూల వేతనం నుంచి 1.5 శాతం తీసుకుంటే నెలకు రూ.43.79 కోట్లు, ఏడాదికి రూ.525 కోట్లు జమ అవుతాయని పేర్కొంది. ఈ మొత్తానికి సర్కారు నుంచి రూ.75కోట్లు జమచేస్తే రూ.600కోట్లు అవుతాయని తెలిపింది. కానీ ఈ ప్రతిపాదలను పక్కనపెట్టిన ప్రభుత్వం.. ఇప్పుడు ప్రతీ ఉద్యోగి నెలకు రూ.500 వాటాగా చెల్లించాలని, అంతే మొత్తాన్ని తాము ఇస్తామని పేర్కొంది.

16 నుంచి గ్రూప్-1 సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 అభ్యర్థుల మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 16న ఉదయం 10:30 గంటలకు నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతుందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. వెరిఫికేషన్ మెటీరియల్ కమిషన్ వెబ్ సైట్ (http://www.tspsc.gov.in)లో ఉందని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల 16వ తేదీతోపాటు 17న కూడా వెరిఫికేషన్ ఉంటుందని, ఈ తేదీల్లో వెరిఫికేషన్‌కు హాజరుకానివారికి మళ్లీ అవకాశం ఉండబోదన్నారు. అభ్యర్థులు ఈనెల 13 నుంచి 17వ తేదీ దాకా వెబ్ ఆప్షన్లు సమర్పించాలని, ఈ వెబ్ ఆప్షన్లను తుది ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. గ్రూప్-3లో 1,388 పోస్టులకు నిర్వహించిన పరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈనెల 18 నుంచి జూలై 8వ తేదీ వరకు నాంపల్లి పబ్లిక్‌గార్డెన్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో వెరిఫికేషన్ ఉంటుందని కమిషన్ కార్యదర్శి డాక్టర్ నవీన్‌నికోలస్ ఓ ప్రకటనలో తెలిపారు.

26 వేల సర్కారు బడుల డిజిటైజేషన్‌కు శ్రీకారం

» 3,500 కోట్లతో 8 వేల గ్రామాలకు ఇంటర్నెట్

» టీఫైబర్ ఎండీ వేణు ప్రసాద్

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26,000కి పైగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటైజేషన్ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని టీఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ వెల్లడించారు. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం మిల్పిటాస్‌లోని ఫాల్కన్ ఎక్స్‌లో ప్రవాస భారతీయులతో శుక్రవారం జరిగిన అనధికారిక సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు, ఇంటర్నెట్ సౌకర్యాలు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు" అని వేణు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీఫైబర్ ఆధ్వర్యంలో ఐటీ&సీ మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందని వెల్లడించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 3,500 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ చేపట్టి, సుమారు 8,000 గ్రామాలకు ఇంటర్నెట్ సేవలు అందజేసిందని ఆయన వెల్లడించారు. ఈ డిజిటలీకరణ ప్రణాళికలో కార్పొరేట్‌లు, ఎన్‌జీవోలు, ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని ప్రభుత్వం కోరుతోందన్నారు. ఈ సమావేశంలో ఫోర్సిస్ ఇంక్ సీఈవో జేపీ వేగెండ్ల టీఫైబర్ ప్రణాళికను స్వాగతిస్తూ కాలిఫోర్నియా నుంచి 1,000 పాఠశాలలకు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఒక్కో పాఠశాలకు సంవత్సరానికి 250 డాలర్లు లేదా 5 సంవత్సరాలకు కలిపి 850 డాలర్లు విరాళం ఇస్తామన్నారు. తెలంగాణ అభివృద్ధి ఫోరమ్ తరఫున గూడూరు మహేందర్ యాదాద్రి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని ఇప్పటికే ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్ కోగంటి(తానా జాయింట్ సెక్రటరీ), హరి గక్కిన, సుబ్బారావు చెన్నూరి(తెలుగు టైమ్స్), రమేష్ కొండా(ఫాల్కన్ ఎక్స్), సాయి కిరణ్(ఈ క్విప్స్) తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నర్సింగ్ డైరెక్టరేట్!

ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం.. నెరవేరిన స్టాఫ్ నర్సుల దశాబ్దాల కల

» త్వరలోనే పూర్తిస్థాయి మార్గదర్శకాలు

» ఇక పదోన్నతులు, సర్వీస్ అంశాలు వేగంగా పరిష్కారం

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్టాఫ్ నర్సుల దశాబ్దాల కలను సాకారం చేసింది. రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్ (ఎన్‌డీ) ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంపై తెలంగాణ వ్యాప్తంగా సర్కారీ దవాఖానాల్లో పనిచేస్తున్న నర్సులందరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలోనే దీన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా పలు కారణాల వల్ల వాయిదా పడింది. ఎన్‌డీ విభాగాధిపతిగా వైద్యులను నియమించాలని ప్రభుత్వం భావించగా.. అందుకు నర్సులు అంగీకరించలేదు. దాంతో ఎన్‌డీ ఏర్పాటు కూడా నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి వైద్య మంత్రి లక్ష్మారెడ్డి ఎన్‌డీ ఏర్పాటు చేస్తామని శాసనసభ సాక్షిగా ప్రకటించారు. అయినా అది కార్యరూపం దాల్చలేదు. నాటి నుంచి నర్సింగ్ అధికారుల సంఘాలు అనేక సార్లు వైద్యమంత్రులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎన్‌డీ ఏర్పాటుకు సర్కారును ఒప్పించారు.

ఎన్‌డీతో ఏంటి లాభం?

నర్సింగ్ రంగంలో సమస్యలను పరిష్కరించి, ఆరోగ్యసేవలను మెరుగుపర్చడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్రాల్లో నర్సింగ్ డైరెక్టరేట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అందుకు సంబంధించి 2012 డిసెంబరు 24న జీవో జారీ చేసింది. ఎన్‌డీ ఏర్పాటుతో నర్సుల సర్వీస్ విషయాలు, పదోన్నతులు, ఖాళీల గుర్తింపు, సకాలంలో బదిలీలు వంటి అంశాలన్నీ దాని పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం నర్సులు మూడు విభాగాధిపతుల ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు. ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్), వైద్యవిద్య సంచాలకులు(డీఎంఈ), వైద్య విధాన పరిషత్ కమిషనర్ (టీవీవీపీ) పరిధిలో సుమారు 18-20 వేల మంది వరకు పనిచేస్తున్నారు. అలాగే నర్సింగ్ విద్యలో పనిచేస్తున్న అధ్యాపకులు సైతం ఈ కేటగిరీలోకి వస్తారు. టీవీవీపీని కూడా సర్కారు సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్ కిందకు తీసుకురానున్న నేపథ్యంలో ఆ హెచ్‌వోడీ పరిధిలో పనిచేసేవారు సైతం ఎన్‌డీ పరిధిలోకే వస్తారని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఇంత పెద్దసంఖ్యలో ఉన్న స్టాఫ్‌నర్సులకు సంబంధించి పదోన్నతులు, సర్వీస్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలంటే ఏళ్లతరబడి ఆయా హెచ్‌వోడీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అలాగే నర్సుల డిప్యుటేషన్, వర్క్ ఆర్డర్లు, ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ (ఎఫ్ఎస్‌డీ) లాంటి విషయాల్లో కూడా కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. ఎన్‌డీ ఏర్పాటుతో ఇటువంటి సమస్యలన్నింటికీ అడ్డుకట్ట పడుతుందని స్టాఫ్ నర్సులు చెబుతున్నారు. దీంతోపాటు నర్సింగ్ విద్యను మరింత బలోపేతం చేయడం, నాణ్యమైన విద్యా ప్రమాణాల ద్వారా నిపుణులైన నర్సులను తయారు చేయడం, మాతా శిశు మరణాల రేటును తగ్గించడమే లక్ష్యంగా ఎన్‌డీ పనిచేస్తుందని వైద్యవర్గాలు తెలిపాయి.

డైరెక్టరేట్ నిర్మాణం

నర్సింగ్ డైరెక్టరేట్ నిర్మాణం, విభాగాధిపతి, డైరెక్టరేట్ ఎలా పనిచేయాలన్న దానిపై ప్రభుత్వం త్వరలోనే పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు ఇస్తుందని ఉన్నతాధికారులు చెప్పారు. ఎన్‌డీలో డైరెక్టర్, ఏడీ, డీడీ, అసిస్టెంట్ డైరెక్టర్, తెలంగాణ నర్సుల పరీక్ష బోర్డు కార్యదర్శి ఉంటారని, పలు రాష్ట్రాల్లో ఇదే విధానం అమలవుతోందని తెలిపారు. అలాగే ఎన్‌డీ ఏర్పాటు, నిర్వహణ వ్యయాలపై ఆర్థిక శాఖ కూడా జీవో జారీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

నర్సింగ్ డైరెక్టరేట్ కోసం రాష్ట్ర ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో పదేళ్లుగా పోరాటం చేస్తున్నాం. కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఎన్‌డీ ఏర్పాటుకు ఆమోదం తెలపడం సంతోషకరం. అందుకు కృషి చేసిన మంత్రి దామోదర, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నాం.

-రూఢావత్ లక్ష్మణ్, ప్రభుత్వ నర్సుల సంఘం సంయుక్త కార్యదర్శి

హెచ్‌వోడీలతో సంబంధం లేకుండా కార్యకలాపాలు

వైద్యశాఖలో నర్సులంతా ఇప్పటిదాకా ఆయా విభాగాధిపతుల పరిధిలో పనిచేశారు. డైరెక్టరేట్ ఏర్పాటుతో స్వతంత్రంగా మా కార్యకలాపాలు నిర్వహించుకుంటాం. ప్రస్తుత నర్సుల పదోన్నతులు, సర్వీస్ అంశాల్లో ప్రస్తుతం విపరీతమైన జాప్యం జరుగుతోంది. ఇకపై దానికి చెక్ పడనుంది. సర్కారుకు కృతజ్ఞతలు.

-సుజాత రాథోడ్, నర్సింగ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు

బార్లకు భారీగా దరఖాస్తులు

» గ్రేటర్‌లో 24 బార్లకు 3200పైగా

» శుక్రవారం అర్ధరాత్రి దాకా స్వీకరణ

» మిగిలిన 4 ప్రాంతాల్లో 123 దరఖాస్తులు

» దరఖాస్తు ఫీజుతోనే 34 కోట్ల ఆదాయం

» 13న లాటరీ పద్ధతిలో బార్ల కేటాయింపు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బార్ల ఏర్పాటుకు వ్యాపారుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిలో చివరి రోజున దరఖాస్తులు అందించేందుకు వ్యాపారులు పోటీ పడ్డారు. 24 బార్లకు ఏకంగా 3200పైగా దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకూ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండగా.. మరో వందకుపైగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 24 బార్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, బోధన్, జల్‌పల్లి (సరూర్‌నగర్) మున్సిపాలిటీల పరిధిలో ఒక్కొక్క బార్ ఏర్పాటుకు గత నెలలో ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. గత నెల 15న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ.. శుక్రవారం రాత్రి వరకు కొనసాగింది. వ్యాపారుల మధ్య పోటీ వాతావరణం నెలకొల్పడానికి గతానికి భిన్నంగా ఈసారి దేశంలోని ఎక్కడి ఎవరైనా, ఎన్నైనా దరఖాస్తులైనా చేసుకునేందుకు అవకాశం కల్పించారు. నాలుగు రోజుల క్రితం వరకూ కేవలం 359 దరఖాస్తులే రాగా.. చివరి మూడు రోజులు ముహూర్తాలు బాగుండటంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు స్వీకరణ గడువు శుక్రవారం సాయంత్రం 5గంటలకు ముగిసినా.. అధిక సంఖ్యలో వ్యాపారులు రావడంతో అర్ధరాత్రి వరకు స్వీకరణ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే 3200 దరఖాస్తులు అందాయని, మరో వంద వరకు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు.. జల్‌పల్లిలో 49, మహబూబ్‌నగర్‌లో 44, నిజామాబాద్‌లో 15, బోధనలో 15మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఆరు రెట్లు ఎక్కువగా..

జీహెచ్ఎంసీ పరిధిలో 2021లో 55 బార్ల ఏర్పాటుకు ప్రకటన జారీ చేయగా.. 1320 వరకు దరఖాస్తులు వచ్చాయి. అంటే అప్పట్లో ఒక్కో బార్‌కు సుమారుగా 22 మంది పోటీపడ్డారు. కానీ.. ఈ సారి 24 బార్ల ఏర్పాటుకు 3,200పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. అంటే ఒక్కో బార్‌కు దాదాపు 130మందిపైగా పోటీ పడ్డారు. గతంతో పోలిస్తే దాదాపు 6రెట్లకుపైగా దరఖాస్తులు అందాయి. దేశంలోని ఎక్కడి వారైనా, ఎన్ని దరఖాస్తులైనా సమర్పించే అవకాశం ఇవ్వడం, ప్రకటన జారీ చేసిన తర్వాత 3 వారాలు గడువు ఇవ్వడంతో దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.లక్ష నిర్ణయించగా.. ఈ సారి రూ.34కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించిన తర్వాత ఈ నెల 13న లాటరీ పద్ధతిన వ్యాపారులను ఎంపిక చేస్తారు. ఎంపికైన వ్యాపారులు 3నెలల్లో బార్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.